సమగ్ర సమాచార పత్రిక
www.mudranews.in
# ముద్ర
హైదరాబాద్
బుధవారం, 15.04.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 173
పేజీలు: 12 వెల: రూ. 5

# ట్రంప్.. ఓ పైరేట్స్ కింగ్

## ఏఐ చిత్రాలతో ఇరాన్ వ్యంగ్యం 10



- ట్రంప్ హెచ్చరికలకు ఇరాన్ వ్యంగ్య సమాధానం
- హర్మూజ్ ఉద్రిక్తతల మధ్య సోషల్ మీడియాలో ఏఐ యుద్ధం
- సముద్రపు దొంగగా ట్రంప్
- డిజిటల్ డిప్లమసీకి కొత్త రూపం
- రాజకీయ ఉద్రిక్తతలకు సోషల్ మీడియా ట్విస్ట్

అంతర్జాతీయ రాజకీయాల్లో అమెరికా–ఇరాన్ మధ్య మాటల యుద్ధం ఇప్పుడు సరికొత్త 'డిజిటల్' రూపాన్ని సంతరించుకుంది. హర్మూజ్ జలసంధిలో నౌకలను అడ్డుకుంటామన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికలకు ఇరాన్ తనదైన శైలిలో కౌంటర్ ఇచ్చింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాయంతో ట్రంప్‌ను ఒక 'సముద్రపు దొంగ' గా చిత్రీకరిస్తూ ఇరాన్ రాయబార కార్యాలయం విడుదల చేసిన చిత్రాలు.. మ్యూజిక్ వీడియోలు ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా నెట్టింట వైరల్ అవుతున్నాయి. రాజకీయ ఉద్రిక్తతలకు వ్యంగ్యాన్ని జోడించి, డిజిటల్ దౌత్యంలో ఇరాన్ అనుసరించిన ఈ వినూత్న వ్యూహం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

-ముద్ర డెస్క్

## డిక్లరేషన్లు గుర్తొచ్చేలా బీఆర్ఎస్ సభలు 10

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

డిక్లరేషన్లు అమలు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి

- కాంగ్రెస్ హామీలపై దృష్టి సారించిన బీఆర్ఎస్
- సభల ద్వారా ప్రజల్లో అవగాహన పెంచాలని కేటీఆర్ లక్ష్యం
- మే, జూన్ నుంచి ప్రభుత్వంపై ఆందోళనలు తీవ్రతరం
- ఎస్సీ, ఎస్టీల సమస్యలతో పోరాటాలకు శ్రీకారం



## ఆర్టీసీని కాపాడుకుందాం

### కార్మికుల సమస్యల పరిష్కారానికి సిద్ధం

రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

- సమ్మె నిర్ణయం సరైంది కాదన్న మంత్రి
- చర్చలకు తలుపులు ఎప్పుడూ తెరిచి ఉంటాయన్న హామీ
- ఆర్థిక స్థితిగతులపై ఉన్నతస్థాయి కమిటీ అధ్యయనం
- నివేదిక ఆధారంగా నిర్ణయాలు
- వేల సంఖ్యలో కొత్త బస్సులు, ఉద్యోగ నియామకాలు
- ఉచిత ప్రయాణంతో నష్టం లేదు.. లాభాల్లో 90కి పైగా డిపోలు

10




## డిలిమిటేషన్‌పై జాతీయ స్థాయిలో చర్చ అవసరం

### ప్రధాని మోడీకి సీఎం రేవంత్ బహిరంగ లేఖ

- రాజకీయ పార్టీలతో అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేసి చర్చించాలి
- మహిళల రిజర్వేషన్, పునర్విభజన, లోక్‌సభ సీట్ల పెంపు అంశాలను ఒకదానితో ఒకటి ముడి పెట్టి ప్రజల్లో గందరగోళం

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** దేశంలో నియోజకవర్గాల పెంపు విషయంలో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగకుండా జాతీయ స్థాయిలో విస్తృత చర్చలు జరపాలని సీఎం ఎ. రేవంత్ రెడ్డి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాశారు. అన్ని రాజకీయ పార్టీలతో అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేయాలని మంగళవారం రాసిన లేఖలో కోరారు. అన్ని రాష్ట్రాలు, రాజకీయ పార్టీల అభిప్రాయాలు, ఏకాభిప్రాయ సాధన ద్వారానే ఇలాంటి కీలక నిర్ణయాలు తీసుకోవాలని ప్రధానికి విజ్ఞప్తి చేశారు. దేశ ప్రజాస్వామ్య భవిష్యత్తుపై ప్రభావం కలిగించే అంశమైనందున బాధ్యతతో అత్యవసరంగా ఈ లేఖ రాసినట్లు తెలిపారు. ప్రస్తుతం మహిళల రిజర్వేషన్, పునర్విభజన, లోక్‌సభ సీట్ల పెంపు అనే మూడు వేర్వేరు అంశాలను ఒకదానితో ఒకటి ముడి పెట్టి ప్రజలలో గందరగోళం సృష్టిస్తున్నారని, అవి పూర్తిగా వేర్వేరు విషయాలని స్పష్టం చేశారు. మహిళల రిజర్వేషన్ బిల్లుకు భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ పూర్తిగా మద్దతు ఇస్తుందని తెలిపారు. ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ సీట్లలోనే మిగతా 02లో




- లోక్‌సభ సీట్ల భారీ పెంపు
- మహిళా రిజర్వేషన్‌కు మళ్లీ ఊపు
- 2029 ఎన్నికలకు కొత్త రూపురేఖలు
- డీలిమిటేషన్ బిల్లు రాబోతోంది
- 543 నుంచి 850కి లోక్‌సభ సీట్లు?
- ఉత్తర-దక్షిణ సమతుల్యం కోసం 50%సీట్ల పెంపు ఫార్ములా
- ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లకు కూడా పెరుగుదల సూచనలు
- డీలిమిటేషన్ కమిషన్‌కు గ్రీన్ సిగ్నల్
- కీలక బిల్లులపై కదిలిన ఇండియా కూటమి.. ఖర్గే ఇంట్లో భేటీ
- రాజకీయ సమీకరణాల్లో పెద్ద మార్పులు
- పార్లమెంట్‌లో హాట్ టాపిక్‌గా మారిన సీట్ల పెంపు, మహిళా బిల్లు

# భారత రాజకీయాల్లో నవశకం

## కేంద్రం డబుల్ స్ట్రైక్

**ముద్ర డెస్క్ :** భారత ప్రజాస్వామ్య చరిత్రలో సరికొత్త అధ్యాయానికి తెరలేవబోతోంది. దేశ రాజకీయ గమనాన్ని ప్రాతినిధ్య ముఖచిత్రాన్ని సమూలంగా మార్చివేసే రెండు అత్యంత కీలకమైన బిల్లులను ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) , మహిళా రిజర్వేషన్ బిల్లులను ఈ నెల 16న పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేందుకు ముహూర్తం ఖరారైంది. ఈ మేరకు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ ఇప్పటికే ఎంపీలకు బిల్లుల ప్రతులను పంపించి సభా కార్యక్రమాలపై స్పష్టతనిచ్చింది. ఈ పరిణామం దేశవ్యాప్తంగా రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది.

**లోక్‌సభ స్థానాల భారీ పెంపు.. 850కి చేరనున్న సభ్యుల సంఖ్య?**

అత్యంత ఆసక్తి రేకెత్తిస్తున్న డీలిమిటేషన్ బిల్లు ద్వారా లోక్‌సభ స్థానాల సంఖ్యను భారీగా పెంచాలని కేంద్రం ప్రతిపాదిస్తోంది. ప్రస్తుతం ఉన్న 543 స్థానాలను దాదాపు 850 వరకు పెంచే దిశగా ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ఇందులో రాష్ట్రాలకు సుమారు 815 స్థానాలు.. కేంద్ర పాలిత ప్రాంతాలకు 35 వరకు స్థానాలు కేటాయించే అవకాశం ఉంది. ఈ బిల్లు ఆమోదం పొందిన వెంటనే కేంద్రం ఉన్నత స్థాయి 'డీలిమిటేషన్ కమిషన్'ను ఏర్పాటు చేయనుంది. ఈ కమిషన్ క్షేత్రస్థాయిలో జనాభా గణాంకాలను పరిశీలించి కొత్త నియోజకవర్గాల సరిహద్దులను నిర్ణయిస్తుంది. 2029 సాధారణ ఎన్నికల నాటికి ఈ ప్రక్రియను పూర్తి చేసి పెరిగిన స్థానాలతో ఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నట్లు తెలుస్తోంది.

మిగతా 02లో

## అంబేద్కర్ ఆలోచనలకు విఘాతం

### డీలిమిటేషన్ విషయంలో కేంద్రంపై రేవంత్ ఫైర్




- కేంద్ర పునర్విభజనతో అంబేద్కర్ ఆలోచనలకు విఘాతం
- మహిళా రిజర్వేషన్ల ముసుగులో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం
- ఎస్సీ, ఎస్టీ, మహిళల సీట్ల సంఖ్య తగ్గే ప్రమాదం
- అంబేద్కర్ జయంతి వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి

03

## షాడో నేతల చీకటి దందా!

- నేతల అండతో ఇసుక మాఫియా బరితెగింపు
- రాత్రికి రాత్రే భారీ వాహనాలతో ఇసుక తరలింపు
- రూ. లక్షలు చేతులు మారుతున్న వైనం

09



## ఒకడు ఉప్పెన.. ఒకడు గర్జన

### కలిసి ఎస్ఆర్‌హెచ్ ప్రళయం..

- ప్రఫుల్ హింజ్ ఉత్పాతాన్ని సృష్టిస్తే..
- సాకిబ్ హుస్సేన్ భయాన్ని కలిగించాడు..
- డెబ్యూ మ్యాచ్ లోనే ఇద్దరు చరిత్ర సృష్టించారు..
- రాజస్థాన్ బ్యాటింగ్ లైనప్‌ను చీల్చి చెండాడిన ఎస్ఆర్‌హెచ్

11



## ఉత్తరాంధ్రలో మహానాడు!

### టీడీపీ పొలిటికల్ స్కెచ్ అదేనా..!

- ఈసారి ఉత్తరాంధ్ర సెంట్రిక్‌గా మహానాడు జరిపే ప్లాన్
- ఆ మూడు ఉమ్మడి జిల్లాలపై టీడీపీ స్పెషల్ ఫోకస్
- పసుపు పండుగకు తమ్ముళ్లు రెడీ
- విజయనగరం జిల్లా వైపు మొగ్గు
- కేడర్లో పెరుగుతున్న జోష్


09



## పాకిస్తాన్ పరువు 'హోటల్' పాలు!

### ఇరాన్, అమెరికా చర్చలు 02

- హోటల్ బిల్లు కూడా కట్టలేకపోయిన పాకిస్తాన్
- అప్పుల కుప్పలో రాయబారాల ముచ్చట
- సెరెనా హోటల్ బిల్లు కూడా చెల్లించలేక ఆర్థిక సంక్షోభం బహిర్గతం
- మధ్యవర్తిత్వం పేరుతో పాకిస్తాన్ మరింత ఇబ్బందుల్లో పడేసింది




## మోదీకి ట్రంప్ ఫోన్..

### పశ్చిమాసియా ఉద్రిక్తతలపై 40 నిమిషాల ఫోన్ సంభాషణ


- హార్మూజ్ భద్రతపై ప్రధాన చర్చ
- అమెరికా–ఇరాన్ ఉద్రిక్తతల మధ్య అగ్రనేతల మంతనాలు
- భారత్–అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్యంపై సమీక్ష
- పశ్చిమాసియా పరిస్థితులపై ట్రంప్ వివరణ

10





తండ్రి మందలించాడనే కోపంలో ఓ బాలుడు 100 కిలో మీటర్ల దూరం ఏకధాటిగా సైకిల్ తొక్కుకుంటూ ప్రొద్దుటూరు నుంచి కర్ణాటకకు వెళ్లిపోయాడు



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
బుధవారం 15.04.2026
www.mudranews.in | @mudranews




టాప్ ఏఐ 1 ChatGPT




సహజమైన సంభాషణతో ప్రశ్నలకు సమాధానాలు ఇస్తుంది.రైటింగ్, కోడింగ్, చదువు, ఐడియాల కోసం అత్యంత ఉపయోగకరం.

# పాకిస్తాన్ పరువు హోటల్ పాలు!




**ముద్ర డెస్క్ :**
పాకిస్తాన్ ఎగిరి పడుతోంది అంటే ఏదో కారణమే ఉండి ఉంటుంది. కాకపోతే ఆ దేశానికి అంత సీన్ ఉందా.. అమెరికాకు గత్యంతరం లేదు. చైనా మధ్యవర్తి పాత్ర పోషించలేదు. భారత దేశానికి అవసరం లేదు. ఇంగ్లాండ్ ఆ సాహసం చేయలేదు. యూరోపియన్ యూనియన్ నిలబడలేదు.. అందువల్లే పుడింగిలాగా పాకిస్తాన్ వచ్చింది. కానీ, ఇరాన్ కు ఎక్కడో అపశకునం.. కాకపోతే తప్పదు కాబట్టి వచ్చింది. అయినప్పటికీ ఏం జరగలేదు. ఇకపై ఏం జరగదు కూడా".. ఇరాన్, అమెరికా మధ్య చర్చలకు ఇస్లామాబాద్ వేదిక అయినప్పుడు.. ఓ జాతీయ ఛానల్ నిర్వహించిన డిబేట్లో ఓ విశ్లేషకుడు పంచుకున్న అభిప్రాయానికి అనువాదం అది.

పై అనువాదానికి.. ఇప్పుడు జరుగుతున్న పరిస్థితికి పెద్ద తేడా లేదు. ఎందుకంటే అమెరికా షరతులకు ఇరాన్ తల వంచదు. ఇరాన్ తన దేశంలో అమెరికా పెత్తనాన్ని ఒప్పుకోదు. మొత్తంగా పాకిస్తాన్ మధ్యవర్తిత్వం వహించిన ఈ చర్చలు ఆదిలోనే హంస పాదులాగా ముగిసిపోయాయి. మరో దఫా చర్చలు అంటున్నారు గానీ.. అవి కార్యరూపం దాల్చుతాయా.. లేదా అనేది ఇంతవరకు క్లారిటీ లేదు. ఇప్పటికే హర్ముజ్ జల సంధి మీద పరోక్ష ఆంక్షలు కొనసాగుతున్నాయి. ఇరాన్, అమెరికా పోటా పోటీగా ప్రకటనలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఏదైనా జరగవచ్చు అనే సంకేతాలు వినిపిస్తున్నాయి.

ఇదంతా జరుగుతుండగానే పాకిస్తాన్ దేశానికి సంబంధించిన ఒక కీలకమైన అంశం వెలుగులోకి వచ్చింది. ఇటీవల ఇస్లామాబాద్ వేదికగా సెరెనా హోటల్ లో అమెరికా, ఇరాన్ దేశాల ప్రతినిధుల మధ్య చర్చలు జరిగాయి. అయితే ఈ హోటల్ బిల్లు తడిసి మోపెడు కావడంతో పాకిస్తాన్ ప్రభుత్వం చెల్లించలేదని తెలుస్తోంది. రెండు దేశాలకు ఆతిథ్యం ఇచ్చినప్పుడు జరిగే రొటీన్ ఖర్చులు మాత్రమే కాకుండా..ఇతర వాటిని కూడా పాకిస్తాన్ చెల్లించడంలో విఫలమైందని అంతర్జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి.

'దేశంలో పెట్రోల్ లేదు. డీజిల్ దొరకడం లేదు. ఒక రకంగా కరోనా కాలం నాటి పరిస్థితి కంటే దారుణంగా ఉంది. ప్రజలకు కనీస అవసరాలు తీరే మార్గం కనిపించడం లేదు. దారుణమైన పన్నులు చెల్లించాల్సిన పరిస్థితి. అసలు దేశంలో ఎన్నుకుంటున్నామో ప్రజలకే అర్థం కావడం లేదు. ప్రజలు చెల్లించిన పన్నులు దారి మల్లుతున్నాయి. ఇటువంటి స్థితిలో ఆదేశాన్ని ఆ భగవంతుడే కాపాడాలి. చివరికి హోటల్ బిల్లులు కూడా చెల్లించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందంటే ఇంతకంటే దారుణం మరొకటి ఉండదు. అసలు ఇలాంటి స్థితిలో మధ్యవర్తిత్వం ఎందుకు చేసినట్టు.. చేయాలని ఎవరు చెప్పినట్టు.. పాకిస్తాన్ ప్రతి సందర్భంలోనూ తనను తాను తక్కువ చేసుకుంటుంది. ఇంకొకరికి అవకాశం ఇవ్వకుండా తన పరువు తానే తీసుకుంటుందని' విశ్లేషకులు చెబుతున్నారు.


# భారత రాజకీయాల్లో నవశకం

(మొదటి పేజీ తరువాయి)

**దక్షిణాది రాష్ట్రాల ఆందోళన..**
**కేంద్రం '50 శాతం' ఫార్ములా**

జనాభా ప్రాతిపదికన సీట్ల కేటాయింపు జరిగితే జనాభా నియంత్రణను సమర్థవంతంగా అమలు చేసిన దక్షిణ భారతదేశ రాష్ట్రాలు రాజకీయంగా ప్రాధాన్యత కోల్పోయే ప్రమాదం ఉందన్న చర్చ ఊపందుకుంది. ఉత్తరాది రాష్ట్రాల్లో జనాభా పెరుగుదల ఎక్కువగా ఉండటంతో ఆ రాష్ట్రాలకే అత్యధిక సీట్లు దక్కుతాయని, ఫలితంగా దేశ రాజకీయాల్లో దక్షిణాది గొంతు నొక్కుకుపోతుందనే ఆందోళనను ప్రాంతీయ పార్టీలు వ్యక్తం చేస్తున్నాయి.

ఈ సున్నితమైన అంశాన్ని పరిష్కరించేందుకు కేంద్రం ఒక మధ్యేమార్గం వెతుకుతోంది. అన్ని రాష్ట్రాల్లోని లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలను సగటున 50 శాతం మేర పెంచే ఫార్ములాను పరిశీలిస్తోంది. దీనివల్ల రాష్ట్రాల మధ్య ప్రస్తుతం ఉన్న రాజకీయ సమతౌల్యం దెబ్బతినకుండా అన్ని ప్రాంతాలకు సముచిత ప్రాతినిధ్యం లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. అలాగే ఎస్సీ, ఎస్టీ వర్గాలకు కూడా పెరిగిన స్థానాలకు అనుగుణంగా రిజర్వేషన్లను పెంచే ప్రతిపాదన ఉంది.




**మహిళా రిజర్వేషన్లు..**
**చట్టసభల్లో సగభాగం దిశగా..**


దశాబ్దాలుగా నలుగుతున్న మహిళా రిజర్వేషన్ బిల్లు ఈసారి కార్యరూపం దాల్చడం ఖాయంగా కనిపిస్తోంది. చట్టసభల్లో మహిళలకు తగిన ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా నిర్ణయాధికారంలో వారి భాగస్వామ్యాన్ని పెంచడమే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశం. ఈ బిల్లు చట్టంగా మారితే, దేశ రాజకీయాల్లో మహిళా శక్తి సరికొత్త శిఖరాలను అధిరోహించనుంది. ఇది కేవలం సీట్ల కేటాయింపు మాత్రమే కాకుండా, దేశ సామాజిక-రాజకీయ పరిణామాల్లో విప్లవాత్మక మార్పుగా అభివర్ణించవచ్చు.

**ప్రతిపక్షాల వ్యూహం..**
**'ఇండియా' కూటమి భేటీ**

కేంద్రం వేగంగా కదుపుతున్న పావులకు ప్రతిస్పందనగా ప్రతిపక్ష 'ఇండియా' కూటమి కూడా అప్రమత్తమైంది. బుధవారం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో కూటమి నేతలు సమావేశం కానున్నారు. ఈ బిల్లుల్లోని లోటుపాట్లు, రాష్ట్రాలపై పడే ప్రభావం, పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహాలపై సుదీర్ఘంగా చర్చించనున్నారు. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలకు విఘాతం కలగకుండా ఎలాంటి పోరాటం చేయాలన్నది ఈ భేటీలో ప్రధాన అజెండా కానుంది.

మొత్తానికి రాబోయే వారం రోజులు భారత రాజకీయాల్లో అత్యంత కీలకం కానున్నాయి. నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్లు అమల్లోకి వస్తే అది కేవలం ఎన్నికల సంఖ్య మార్పు మాత్రమే కాదు.. నవ భారత నిర్మాణంలో ఒక కీలక మలుపుగా నిలుస్తుంది.

# డిలిమినేషన్‌పై జాతీయ స్థాయిలో చర్చ అవసరం



(మొదటి పేజీ తరువాయి)

33 శాతం మహిళల రిజర్వేషన్‌ను యథాతథంగా వెంటనే అమలు చేయాలని, అన్ని రాష్ట్ర అసెంబ్లీల్లో కూడా అమలు చేయాలని కోరారు. మహిళల రాజకీయ సాధికారత కేవలం చట్టపరమైన మార్పు మాత్రమే కాదు, అది ప్రజాస్వామ్యానికి ఒక నైతిక అవసరమని పేర్కొన్నారు. పునర్విభజనకు సంబంధించి గతంలో కూడా సీట్ల సంఖ్య పెంచకుండా కేవలం నియోజకవర్గాల సరిహద్దులను మార్చుతూ డిలిమిటేషన్ నిర్వహించినట్లు గుర్తుచేశారు. ఇప్పుడు కూడా దేశవ్యాప్తంగా అలాంటి ప్రక్రియను చేపట్టవచ్చని తెలిపారు.లోక్‌సభ సీట్లను 850కు పెంచే ప్రతిపాదన అసలైన వివాదాస్పద అంశమని పేర్కొన్నారు. ప్రస్తుత సీట్లను పెంచి వాటిని ప్రోరాటా పద్ధతిలో కేటాయించే ఆలోచనపై ఆందోళన వ్యక్తం చేశారు. మహిళల రిజర్వేషన్‌కు పూర్తి మద్దతు ఇవ్వటంతో పాటు, సీట్ల సంఖ్య పెంపు లేకుండా డిలిమిటేషన్‌కు తాము పూర్తి మద్దతు ఇస్తామని తెలిపారు. జనాభా లేదా ప్రోరాటా పద్ధతిలో లోక్‌సభ సీట్ల పెంపు ప్రతిపాదనను అనేక రాష్ట్రాలు, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలు అంగీకరించబోవని తెలిపారు. ప్రోరాటా పద్ధతిలో అమలు చేస్తే దేశంలో తలెత్తబోయే పరిణామాలపై ఆందోళన వ్యక్తం చేశారు.1970ల నుంచి దేశం జనాభా నియంత్రణ విధానంపై దృష్టి పెట్టినప్పటికీ, రాష్ట్రాల వారీగా జనాభా నియంత్రణ అమలు జరిగిన తీరు భిన్నంగా ఉందన్నారు. జనాభాలో తేడాల వల్ల జాతీయ ఐక్యతపై ప్రభావం పడే ప్రమాదాన్ని గుర్తించి, ఇందిరా గాంధీ, అటల్ బిహారి వాజ్‌పేయి వంటి నాయకులు ఈ అంశాన్ని ఒక్కోసారి 25 సంవత్సరాల పాటు వాయిదా వేసినట్లు తెలిపారు. ఆర్థిక సహకారం, సామాజిక, మానవ అభివృద్ధి అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా ప్రోరాటా పద్ధతిలో సీట్ల పెంపు చేస్తే దేశ ఫెడరల్ సమతుల్యత దెబ్బతింటుందని పేర్కొన్నారు. వికసిత్ భారత్ లక్ష్య సాధనకు అన్ని ప్రాంతాల సమాన ప్రాతినిధ్యం దేశానికి అత్యంత కీలకమని పేర్కొన్నారు. సీట్ల పెంపుతో దక్షిణ రాష్ట్రాలపై పడే ప్రభావాన్ని కేంద్రం పూర్తిగా విశ్లేషించలేదని అభిప్రాయపడ్డారు.తెలంగాణతో పాటు తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, పుదుచ్చేరి, కేరళ రాష్ట్రాలు దశాబ్దాలుగా జనాభా స్థిరీకరణ, ఆరోగ్యం, మానవ అభివృద్ధి రంగాల్లో కృషి చేశాయని తెలిపారు. ఇవన్నీ జాతీయ ప్రాధాన్యాలకు అనుగుణంగా చేపట్టిన చర్యలని గుర్తుచేశారు.

ప్రస్తుత ప్రతిపాదనతో ఈ రాష్ట్రాలన్నీ నిర్మాణాత్మకంగా నష్టపోతాయని, రాజకీయంగా బలహీనపడే పరిస్థితి ఏర్పడుతోందని తెలిపారు. ఈ మోడల్ కేవలం గణాంకాల మార్పుగా కాకుండా, రాజకీయ అసమతుల్యతకు దారి తీస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రాలకు నిధుల పంపిణీలో ఇప్పటికే పక్షపాతం, వివక్ష ఉన్నట్లు తెలిపారు. బీహార్, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాలు ఎక్కువ నిధులు పొందుతుంటే, తెలంగాణకు తక్కువ నిధులు వస్తున్నాయని ఉదాహరణగా చెప్పారు. ఇది దక్షిణాది-ఉత్తరాది అసమానతకు సంకేతమని పేర్కొన్నారు. నిధుల వివక్షకు అదనంగా ఇప్పుడు సీట్ల పెంపు కారణంగా రాజకీయంగా అన్యాయం జరుగుతుందని తెలిపారు. దక్షిణాది రాష్ట్రాలు దేశ ఆర్థిక వ్యవస్థకు గణనీయంగా సహకరించినప్పటికీ, పార్లమెంట్‌లో వారి ప్రాధాన్యం తగ్గిపోతుందని, జనాభా పెరుగుదల ఎక్కువగా ఉన్న ఉత్తరాది-మధ్య ప్రాంత రాష్ట్రాలు లాభపడతాయని తెలిపారు. అభివృద్ధిలో పాలుపంచుకున్న రాష్ట్రాలకు శిక్ష పడుతుందని, జనాభా పెరిగిన రాష్ట్రాలకు ప్రోత్సాహకంగా ఉంటుందని పేర్కొన్నారు. ఇది అంకెల విషయం కాదని, దేశ సమగ్రత, సమానత్వం, న్యాయానికి సంబంధించిన ప్రాథమిక అంశమని స్పష్టం చేశారు.దక్షిణ రాష్ట్రాలు జాతీయ ఆదాయానికి నిరంతరం సహకరిస్తూ, సుపరిపాలన, అభివృద్ధి ప్రమాణాలు కొనసాగిస్తున్నాయని తెలిపారు. ఈ కృషిని పట్టించుకోకుండా దేశ ఐక్యతపై ప్రతికూల ప్రభావం చూపుతుందని అన్నారు. ప్రోరాటా మోడల్‌ను దక్షిణ రాష్ట్రాలు అంగీకరించవని, ఈ అంశంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉత్పన్నమవుతుందన్నారు.

అందరికీ న్యా యం జరిగేలా ఒక స్థిరమైన పరిష్కారం అవసరమని సూచించారు. హైబ్రిడ్ మోడల్ ఒక ప్ర త్యామ్నాయంగా ఉంటుందని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. అందరి ప్రాతినిధ్యంతో పాటు అన్ని రాష్ట్రాల సహకారాన్ని ఈ మోడల్ సమతుల్యం చేస్తుందని వివరించారు. సుప్రీం కోర్టు సూచించిన 50 శాతం– 50 శాతం విధానాన్ని ప్రస్తావించారు.

హైబ్రిడ్ మోడల్ ప్రకారం, కొత్తగా పెంచే సీట్లలో సగాన్ని ప్రోరాటా పద్ధతిలో, మిగతా సగాన్ని రాష్ట్రాల ఆర్థిక భాగస్వామ్యం (జీఎస్డీపీ), అభివృద్ధి ప్రమాణాల ఆధారంగా కేటాయించాలని సూచించారు. స్వామి వివేకానంద చెప్పినట్లుగా, మన ఆలోచనలకు తలుపులు తెరిచి కొత్త భావనలు స్వీకరిస్తే, ప్రజాస్వామ్య వ్యవస్థ, ప్రక్రియ అందరికీ న్యాయంగా, ఆమోదయోగ్యంగా ఉండే ఉత్తమ పరిష్కారాన్ని కనుగొంటుందని పేర్కొన్నారు.

హైబ్రిడ్ మోడల్ ద్వారా అభివృద్ధి చెందిన రాష్ట్రాలు నష్టపోకుండా ఉండటంతో పాటు, ప్రజాస్వామ్య ప్రాతినిధ్య సూత్రం అమలవుతుందన్నారు.ఈ అంశంపై విస్తృత స్థాయిలో చర్చలు జరిపి, అన్ని రాష్ట్రాలు, రాజకీయ పార్టీలతో కలిసి ఒక ఏకాభిప్రాయానికి రావాలని కోరారు. దేశ బలం భిన్న త్వంలో ఏకత్వమని, ఇలాంటి కీలక నిర్ణయాలు ఆ ఏకత్వాన్ని బలోపేతం చేసేలా ఉండాలని పేర్కొన్నారు. దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ అందరి కీ న్యాయం చేసే పరిష్కారాన్ని కనుగొంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. లోక్‌సభ సీట్లను ఈ పద్ధతిలో పెంచే ప్రతిపాదన దక్షిణాది రాష్ట్రాలకు నష్టం చేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. దక్షిణాది రాష్ట్రాలు దీనికి వ్యతిరేకంగా నిలబడాలని తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కే. స్టాలిన్ కు లేఖ రాశారు. మహిళల రిజర్వేషన్, డిలిమిటేషన్, లోక్‌సభ సీట్ల పెంపు అనే మూడు వేర్వేరు అంశాలను కలిపి ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నారని లేఖలో ప్రస్తావించారు. లోక్‌సభ సీట్లను 543 నుంచి 850కు పెంచి ప్రోరాటా పద్ధతిలో పంచితే దక్షిణ రాష్ట్రాల ప్రాధాన్యం తగ్గిపోతుందని అప్రమత్తం చేశారు. దేశ అభివృద్ధిలో భాగస్వామ్యం పంచుకునే రాష్ట్రాలు నష్టపోతూ, జనాభా ఎక్కువగా ఉన్న రాష్ట్రాలు లాభపడే పరిస్థితి వస్తుందని అన్నారు. అందుకే అన్ని రాష్ట్రాలకు న్యాయం జరిగేలా హైబ్రిడ్ మోడల్‌ను పరిశీలించాలని, ఈ అంశంపై రాష్ట్రాలు ఐక్యంగా ముందుకు రావాలని ఆయన కోరారు.

# బెంగళూరులో పిల్లి పిల్లల పంచాయితీ

## అనగనగా ఒక మగ పిల్లి.. ఆడ పిల్లిని చూసి మనసు పడింది..



**ముద్ర డెస్క్ :**
పిట్టల మధ్య పోరును పిల్లి తీర్చిందని చిన్నప్పుడు చదువుకున్నాం కదా.. ఈ ఆధునిక కాలంలో రెండు పిల్లుల మధ్య ఏర్పడిన బంధం నిజంగానే పోరుకు దారితీసింది. అది కాస్త పోలీస్ స్టేషన్ దాకా వెళ్ళింది. చివరికి పోలీసులు తమదైన శైలిలో తీర్పు చెప్పడంతో.. రెండు పిల్లుల కథ.. సినిమా కథను మించిపోయింది.

అది బెంగళూరు.. శేషాద్రిపురం జయ భీమ నగర్. ఈ ప్రాంతంలో రెండు కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఓ కుటుంబం వారు మగ పిల్లిని పెంచుకుంటున్నారు. మరో కుటుంబం వారు ఆడ పిల్లిని సాకుతున్నారు. ఇంతవరకు బాగానే ఉంది. ఆ మగపిల్లి ఒకరోజు ఆడ పిల్లిని చూసింది. చూడగానే ఊరుకోదు కదా.. దానిలో మగతనం సెగలు కక్కింది. ఆడ పిల్లి మీద మనసు పడింది. ఇంకేముంది ఓ శుభ ముహూర్తంలో ఆడ పిల్లి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మొత్తానికి అవి రెండు అమ్మ నాన్న ఆట ఆడుకున్నాయి. సీన్ కట్ చేస్తే ఆడపిల్లి గర్భం దాల్చింది..

గర్భం దాల్చిన ఆడ పిల్లికి మగ పిల్లి తనకు పెట్టిన ఆహార పదార్థాలను తీసుకొచ్చేది. ఆడ పిల్లి వాటిని సంతృప్తిగా తినేది. ఈ లోగానే ఆడ పిల్లి ప్రసవించింది. నాలుగు పిల్లలను పెట్టింది. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ ఆడ పిల్లిని చూసుకోవడమే కష్టంగా ఉందనుకున్న ఆ కుటుంబానికి.. మరో నాలుగు పిల్లలు తోడు కావడంతో తట్టుకోలేకపోయింది. దీంతో ఆ మగపిల్లి కుటుంబం మీద దూషణకు దిగింది..

'మీ మగ పిల్లి వల్లే మా ఆడపిల్లి గర్భం దాల్చింది. నాలుగు పిల్లలను కనింది. ఆ నాలుగు పిల్లలను సాకే బాధ్యత మీదే' అంటూ ఆ ఆడపిల్లి ని పెంచుకుంటున్న కుటుంబం.. దూషణకు దిగింది. అంతేకాదు ఆడ పిల్లిని, దాని పిల్లలను వారి ఇంట్లో పడేసింది. దీంతో మగ పిల్లిని పెంచుకుంటున్న కుటుంబ సభ్యులు దూషణకు దిగారు. దీంతో రెండు కుటుంబాల మధ్య గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో ఇరు కుటుంబాల సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి.. చెరి 2 పిల్లి పిల్లలను ఇచ్చి సాదుకోమన్నారు. మొత్తానికి మగ పిల్లి, ఆడపిల్లి వల్ల జరిగిన రగడను పోలీసులు ఈ విధంగా తీర్చారు. దీంతో కథ సుఖాంతమైంది.

# వేసవిలో తిరుమల వెళ్లే భక్తులకు గమనిక

## టీటీడీ కీలక నిర్ణయం..

**ముద్ర డెస్క్ :**
వేసవికాలంలో తిరుమల శ్రీవారిని దర్శించుకోవడానికి భక్తులు భారీగా తరలి వెళ్తుంటా రు. ఏప్రిల్ లో పిల్లలకు వార్షిక పరీక్షలు ముగుస్తాయి. పరీక్షలు ముగిసిన వెంటనే చాలా మంది తిరుమల దారి పడుతుంటారు. అందువల్లే వేసవికాలంలో తిరుమల క్షేత్రం భక్తులతో కిటికిటలాడుతూ ఉంటుంది. తిరుమల శ్రీవారిని దర్శించుకోవడానికి చాలామంది ఆసక్తి చూపిస్తుంటారు. ఇందులో వివిఐపీలు, విఐపి లు ఉంటారు. ఇంతమంది భక్తులకు ఒకేసారి దర్శన భాగ్యం కల్పించడం అంత సులభం కాదు. అందువల్లే భక్తుల రద్దీకి అనుగుణంగా ఈ వేసవికాలంలో తిరుమల తిరుపతి దేవస్థానం వినూత్నమైన ప్రణాళికలను రూపొందించినట్లు తెలుస్తోంది.


ఇటీవల జరిగిన వైకుంఠ ఏకాదశి ఉత్సవాలలో భాగంగా భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని దేవస్థానం వివిఐపి, విఐపి బ్రేక్ దర్శనాలను రద్దు చేసింది. అంతేకాదు ఎస్ఎస్ డీ టోకెన్ల జారీని కూడా రద్దు చేసింది. ఇప్పుడు వేసవి కాలంలో పెరుగుతున్న భక్తుల రద్దీ దృష్ట్యా అదే విధానాన్ని పాటించాలని తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహించినట్టు సమాచారం.

**మే ఒకటి నుంచి రద్దు**

మే 1వ తేదీ నుంచి వీఐపీ బ్రేక్ దర్శనం రద్దు చేయనుంది. స్లాటెడ్ సర్వదర్శనం టోకెన్ జారీ కూడా నిలిపివేయాలని తిరుమల తిరుపతి దేవస్థానం భావిస్తున్నది. ఎస్ ఎస్ డీ టోకెన్ల దర్శనానికి సంబంధించి 23 గంటల సమయం పడుతుంది. అందువల్ల విఐపి బ్రేక్ దర్శనాన్ని రద్దుచేసి.. సామాన్యులకు స్వామివారి దర్శనాన్ని కల్పించాలని తిరుమల తిరుపతి దేవస్థానం భావిస్తోంది. దీనివల్ల సామాన్య భక్తులు ఎనిమిది గంటల నుంచి 12 గంటల మధ్యలోనే స్వామి వారిని దర్శించుకోవచ్చు. దీనివల్ల ప్రతిరోజు 80 వేల మందికి స్వామివారి దర్శన భాగ్యాన్ని కల్పించవచ్చని తిరుమల తిరుపతి దేవస్థానం అంచనా వేస్తున్నది. వివిధ దర్శనాలను పూర్తిగా పక్కన పెట్టి.. వైకుంఠ ఏకాదశి ఉత్సవాల సందర్భంగా ఇదే విధానాన్ని దేవస్థానం అమలు చేసింది. ఇప్పుడు కూడా ఇదే విధానాన్ని పాటించాలని తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు భావిస్తున్నట్టు సమాచారం. ప్రతిరోజు తిరుమల తిరుపతి దేవస్థానంలో స్వామి వారి దర్శనానికి వీఐపీలకు రోజు రెండు నుంచి మూడు గంటల వరకు సమయం కేటాయిస్తున్నారు. దీనిని పూర్తిగా రద్దుచేసి.. ఆ సమయంలో 15,000 మంది సామాన్య భక్తులకు స్వామివారి దర్శన భాగ్యాన్ని కల్పించవచ్చని అధికారులు సూచించిన సమాచారం. విపరీతమైన రద్దీ వల్ల సామాన్యులు స్వామివారిని దర్శించుకోవడానికి తిరుమల తిరుపతి దేవస్థానం ఆలోచిస్తున్నట్టు సమాచారం.

**మిగతా కేటగిరీలు కూడా**

ఇతర కేటగిరిల దర్శనాన్ని కూడా రద్దు చేయాలని తిరుమల తిరుపతి దేవస్థానం భావిస్తున్నట్టు తెలుస్తోంది. దీనివల్ల భక్తులకు వెయిటింగ్ పీరియడ్ తగ్గుతుంది. దర్శనాలు జరగడం కూడా వేగం పుంజుకుంటుంది. సామాన్య భక్తులు స్వామివారి దర్శనానికి గంటలు తరబడి క్యూలైన్లలో ఎదురుచూస్తున్నారు. గడిచిన మూడేళ్లుగా వేసవికాలంలో స్వామివారిని ప్రతినెల 23 లక్షల మంది భక్తులు దర్శించుకున్నారు. ఈ ఏడాది మరింత పెరిగే అవకాశం ఉంది. అందువల్లే తిరుమల తిరుపతి దేవస్థానం ముందస్తు జాగ్రత్త చర్యలుగా వైకుంఠ ఏకాదశి ఉత్సవాల సందర్భంగా అమలు చేసిన విధానాలను ఇప్పుడు కూడా ఆచరణలో పెట్టనుంది.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
15.04.2026 బుధవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



టాప్ ఏఐ 2 Google Gemini
టెక్స్ట్, ఇమేజ్, కోడ్ వంటి మల్టీటాస్కింగ్ AI. గూగుల్ సేవలతో ఇంటిగ్రేషన్ వల్ల పనులు సులభం.
Gemini



# కొండంత పని చేస్తున్నాం..

- గడప గడపకూ చెప్పండి!
- అధికారం లేక విపక్షం విలవిల..
- నిప్పు తొక్కిన కోతుల్లా ప్రవర్తన
- కార్యకర్తల కృషితోనే ప్రజా పాలన సాధ్యం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఉద్ఘాటన

**ముద్ర, ఖమ్మం :**

గత పాలకులు గోరంత చేసి కొండంత చెప్పుకున్నారు.. కానీ మన ప్రభుత్వం కొండంత అభివృద్ధి చేస్తున్నా ప్రజల్లోకి తీసుకెళ్లడంలో వెనుకబడి ఉన్నాం. కార్యకర్తలు నడుం బిగించి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమాన్ని ప్రతి ఇంటికీ వివరించాలి" అని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన జిల్లా, నగర కాంగ్రెస్ నూతన కార్యవర్గ బాధ్యతల స్వీకరణ మహోత్సవంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో కొనసాగుతున్నది కార్యకర్తల ప్రభుత్వమని పొంగులేటి పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సహకరించకపోయినా, పేదవాడి ముఖంలో చిరునవ్వు చూడాలనే తపనతో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నామని చెప్పారు. కార్యకర్తల కష్టం, పోరాట ఫలితంగానే నేడు మనం అధికారంలో ఉన్నామని, ఆ బాధ్యతను గుర్తెరిగి ప్రతి ఒపనిచేయాలని సూచించారు. పదేళ్లపాటు రాష్ట్రాన్ని ఏలిన వారు అధికారం కోల్పోవడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారని మంత్రి విమర్శించారు. అధికారం పోయిందన్న కసితో నిప్పు తొక్కిన కోతుల్లా ఎగురుతున్నారని ఎద్దేవా చేశారు. వారి మాయ మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని ఎద్దేవా చేశారు. మనం చేసిన అభివృద్ధిని, అందిస్తున్న సంక్షేమాన్ని గడప గడపకూ వివరించగలిగితే కాంగ్రెస్ విజయ పరంపరను ఎవరూ అడ్డుకోలేరని ధీమా వ్యక్తం చేశారు.టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా, నగర కాంగ్రెస్ నూతన కార్యవర్గ సభ్యులు ఉత్సాహంగా బాధ్యతలు చేపట్టారు. డీసీసీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, ఎంపీ రామసహాయం రఘురామ్ రెడ్డి, ఎమ్మెల్యేలు రామదాస్ నాయక్, మట్టా రాగమయి దయానంద్, కార్పొరేషన్ చైర్మన్లు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# అన్ని రాష్ట్రాలకు సమ న్యాయం

- డీలిమిటేషన్ దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి అన్యాయం జరగదు
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**




డీలిమిటేషన్ ప్రక్రియతో దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి అన్యాయం జరగదని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. దేశంలోని అన్ని రాష్ట్రాలకు సమ న్యాయం చేయాలన్నదే కేంద్ర ప్రభుత్వ విధానమని వివరించారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపాదించిన హైబ్రిడ్ నమూనాను కిషన్ రెడ్డి తప్పుపట్టిన ఆయన... అసలు అలాంటి నమూనా ఎక్కడా లేదని ఆయన కొట్టి పారేశారు. మంగళవారం హైదరాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో కూడా ఇదే హైబ్రిడ్ విధానాన్ని అమలు చేస్తారా? అని సీఎంను ప్రశ్నించారు. జనాభా ప్రాతిపదికన కాకుండా వేరే లెక్కలు తీస్తే.. రేపు ఆదిలాబాద్‌కు సీట్లు తగ్గించి, హైదరాబాద్‌కు పెంచుతారా?" అని నిలదీశారు. రేవంత్ రెడ్డి ప్రతిపాదనలు రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఆశయాలకు, విధానాలకు వ్యతిరేకమని కిషన్ రెడ్డి విమర్శించారు. జనాభా ప్రాతిపదికన కాకుండా ఆర్థిక వనరుల ఆధారంగా సీట్లు కేటాయించడం ప్రజాస్వామ్య విరుద్ధ మన్నారు. తెలంగాణ ఆదాయంలో 70 శాతం హైదరాబాద్ నుంచే వస్తోందని చెప్పారు. అలాగని 70 శాతం సీట్లు హైదరాబాద్ పరిసరాల్లోనే ఉండాలా? అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి చెప్పినట్లు ఆర్థిక వనరులు, ఇతర అంశాలను ప్రాతిపదికగా తీసుకుంటే దక్షిణాది కంటే గుజరాత్ వంటి రాష్ట్రాలకే ఎక్కువ సీట్లు వస్తాయన్నారు. కేంద్రం తీసుకునే ఏ నిర్ణయమైనా అన్ని ప్రాంతాల ప్రయోజనాలను కాపాడేలా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ వితండ వాదాన్ని రేవంత్ రెడ్డి పక్కనబెట్టి బిల్లుకు సహకరించాలని కిషన్ రెడ్డి సూచించారు. జనగణనతో పాటే కులగణన కూడా చేపట్టబోతున్నామని చెప్పారు. ఈ ప్రక్రియకు చాలా సమయం పట్టే అవకాశం ఉందని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

# బకాయిల చెల్లింపులో మీనమేషాలెందుకు?

- ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వీడాలి
- పెన్షనర్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు ఇంజమూరి రఘునందన్

**ముద్ర, హైదరాబాద్:**



రిటైర్మెంట్ బకాయిలు చెల్లించాలని హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కూడా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని పెన్షనర్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు ఇంజమూరి రఘునందన్ అన్నారు. పదవీ విరమణ ప్రయోజనాలను చెల్లించాలంటూ ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయకపోవడంపై దాఖలైన సుమారు 572కు పైగా కోర్టు ధిక్కారణ పిటిషన్ పై జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు ఇటీవల విచారణ చేపట్టారని, దీనిపై ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ప్రశ్నించారని అన్నారు. అదేమీ ప్రభుత్వ సొమ్ము కాదని, అది ఉద్యోగుల సొంత సొమ్ము అని, పిల్లల చదువులు, పెళ్లిళ్ల వంటి అవసరాల కోసం దాచుకున్న సొమ్ము అని జస్టీస్ వ్యాఖ్యానించినా.., ప్రభుత్వ వైఖరిలో ఏ మాత్రం మార్పు లేదని అన్నారు. బకాయిలు చెల్లింపులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కలు వ్యవహరిస్తున్న తీరుపై రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డు ఉద్యోగులు, తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఈ పరిస్థితుల్లో సామాజికవేత్త బక్కా జడ్సన్ పెన్షనర్లకు అండగా నిలుస్తుండడాన్ని రిటైర్ ఉద్యోగులు అభినందించారు. రాష్ట్రంలోని రిటైర్డ్ ఉద్యోగులు అందరూ ఈ నెల 15 న సామూహికంగా సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్, రిజిస్ట్రార్, భారత రాష్ట్రపతికి లేఖలు రాయాలని, తెలంగాణ రాష్ట్రంలోనీ పెన్షనర్లు అందరూ అందుబాటులో ఉన్న పోస్టాఫీసులకు వెళ్ళి మూకుమ్మడిగా అట్టి లేఖలు పోస్టు చేయాలని పిలుపునిచ్చారు.

# కేంద్ర పునర్విభజనతో అంబేద్కర్ ఆలోచనలకు విఘాతం

- మహిళా రిజర్వేషన్ల ముసుగులో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం
- ఎస్సీ, ఎస్టీ, మహిళల సీట్ల సంఖ్య తగ్గే ప్రమాదం
- అంబేద్కర్ జయంతి వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**





కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం ప్రతిపాదించిన ప్రొరేటా ప్రకారం నియోజకవర్గాల పెంపు జరిగితే దక్షిణాది రాష్ట్రాలు నష్టపోవడమే కాకుండా ఎస్సీ, ఎస్టీ, మహిళల సీట్ల సంఖ్య తగ్గి ఆ వర్గాలు నష్టపోతాయని సీఎం రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. అంతిమ లక్ష్యం రాజ్యాధికారం సాధించడమే అన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆలోచనలకు విఘాతం కలుగుతున్న సందర్భంలో దళితులు, మేధావులు ఈ విషయంపై ఆలోచనలు చేయాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ 135 వ జయంతిని పురస్కరించుకొని మంగళవారం ముఖ్యమంత్రి, మంత్రులు ప్రజాప్రతినిధులతో కలిసి ట్యాంక్‌బండ్ వద్ద ఆ అంబేద్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం ప్రసంగించారు. పురుషులతో సమానంగా మహిళలకు ఓటు హక్కు కల్పించి సమాజంలో సమాన విలువ, గౌరవం కల్పించిన నాయకుడు అంబేద్కర్ అన్నారు. మహిళా రిజర్వేషన్లతో నియోజకవర్గాల పెంపును ముడిపెట్టి కలగాపులగం చేయాలని ప్రయత్నిస్తున్నారని కేంద్ర ప్రభుత్వం పై మండిపడ్డారు. మహిళా రిజర్వేషన్ల ముసుగులో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేసే ప్రయత్నం జరుగుతోందన్నారు. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పెంపు అని మొదట ప్రస్తావించారన్న సీఎం... అభివృద్ధి చెందిన దక్షిణాది రాష్ట్రాలు నష్టపోతాయని అభ్యంతరం వ్యక్తం చేస్తే దామాషా ప్రకారం 50 శాతం పెంచుతామని చెబుతున్నారని చెప్పారు. దళితులు, గిరిజనులు, మైనారిటీలు, మహిళలకు సమాన అవకాశాలు కల్పించవచ్చని మార్గదర్శకం చేసిన మహానాయకుడు అంబేద్కర్ అన్నారు. విద్య ఒక్కటే అన్ని సమస్యల నుంచి మనల్ని విముక్తి చేస్తుందని, జీవితాల్లో వెలుగులు నింపుతుందని, సమాజంలో సరైన గౌరవం దక్కుతుందని బలంగా విశ్వసించారన్నారు. ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసేలా చేసిన గద్దరన్న, మారుమూల పల్లెల్లో జయ జయహే తెలంగాణను మారుమోగించిన అందెశ్రీని సీఎం స్మరించుకున్నారు. దళిత, గిరిజన సామాజిక వర్గానికి మంత్రిపదవులు, ఇతర పదవులు, అధికారులకు ప్రాధాన్యత విషయాల్లో గత ప్రభుత్వాలకు, ప్రజాప్రభుత్వం ఇచ్చిన ప్రాధాన్యతను పోల్చుకోవాలని చెప్పారు. కులాల మధ్యన విభజన జరుగుతుందని, సమాజంలో మరింతగా అంతరాలు పెరుగుతున్నాయని ఆలోచన చేసి ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం చేపట్టామన్నారు. రాష్ట్రంలో ఇచ్చిన 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లలో అత్యధికంగా దళితులకు ఇచ్చామన్న సీఎం.. 67 వేల ప్రభుత్వ ఉద్యోగాలు నియమిస్తే అందులో 87 శాతం ఎస్సీ, ఎస్టీ మైనారిటీలకు ఉద్యోగాలొచ్చాయన్నారు. సివిల్ సర్వీసెస్ లో ప్రోత్సహించాలని రాజీవ్ గాంధీ అభయహస్తం కింద ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు వివరించారు. అన్ని వర్గాలకు సంక్షేమం, అభివృద్ధి అందించాలన్న మంచి లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళుతోందన్నారు. ప్రజల కోసం అందిస్తున్న ప్రజాపాలనను కాపాడుకోవలసిన బాధ్యత అందరిపై ఉందని ముఖ్యమంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, ధనసరి అనసూయ సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో పాటు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.



# రాజ్యాంగం పేదవాడి బ్రహ్మాస్త్రం

- మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి
- అంబేద్కర్, జగ్జీవన్ రామ్ కాంస్య విగ్రహాలను ఆవిష్కరించిన మంత్రి

**ముద్ర, తిప్పర్తి:**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం పేదవాడి చేతిలో బ్రహ్మాస్త్రం అని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135 వ జయంతిని పురస్కరించుకొని మంగళవారం నల్గొండ జిల్లా, తిప్పర్తి మండల కేంద్రంలో రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో రూ.70 లక్షల వ్యయంతో తిప్పర్తి జంక్షన్ లో ఏర్పాటు చేసిన అంబేద్కర్, జగ్జీవన్ రామ్ ల కాంస్య విగ్రహాలను ఆయన ఆవిష్కరించారు. రూ. 10 కోట్ల 75 లక్షల వ్యయంతో సుందరీకరించిన తిప్పర్తి జంక్షన్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మహిళల ఓటు హక్కు, అందరి చదువు కోసం ఎంతో కృషి చేశారని, అభివృద్ధి చెందేందుకు చదువే ముఖ్యమని అన్నారని, ఆయనను స్ఫూర్తిగా తీసుకొని అందరూ చదువుకోవాల్సిన అవసరం ఉందని మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నదని తెలిపారు. ముందుగా నియోజకవర్గానికి ఒక పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేస్తామని, ఇకపై ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లీష్ మీడియం రెండు ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. మహిళలకు ఓటు హక్కు కోసం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కృషి చేశారని అన్నారు. నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సామాజిక న్యాయానికి ప్రతీక అని, అణగారిన వర్గాల అభివృద్ధికి ఆయన ఎంతో కృషి చేశారని, విద్య ,స్త్రీ పురుష సమానత్వానికి కృషి చేశారని అన్నారు. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ.. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగ స్ఫూర్తిని ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో ముందుకు తీసుకు వెళుతున్నామని చెప్పారు .డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం వల్లనే పేద విద్యార్థులకు చదువు, రిజర్వేషన్లు వచ్చాయని, సమానత్వం వైపు అందరు అడుగు వేయాలని కోరారు. నల్గొండ మార్కెట్ కమిటీ చైర్మన్ జూకిరి రమేష్, సర్పంచు రజిత ,వివిధ దళిత సంఘాల ప్రతినిధులు, రెవెన్యూ ఆదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, అడిషనల్ ఎస్పీ రమేష్, ఆర్ అండ్ బి ఎస్ ఈ శ్రీధర్ రెడ్డి, డి ఈ గణేష్ ,డిసిసిబి డైరెక్టర్ సంపత్ రెడ్డి, రామ్ రెడ్డి పాల్గొన్నారు.

# పోటీ చేసిన ప్రతీ చోట్లా క్లీన్ స్వీప్

- బిజెపి ఎత్తుగడలను తిప్పికొట్టండి
- తమిళనాడు ఎన్నికల ప్రచారంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**ముద్ర, హైదరాబాద్:**

డీఎంకే కూటమితో పొత్తు పెట్టుకుని పోటీ చేస్తున్న అన్ని స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ క్లిన్ స్వీప్ చేయనుందని తెలంగాణా రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల అభివృద్ధి శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. తమిళనాడు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీకి రోజు రోజుకు పెరుగుతున్న ప్రజాదరణనే ఇందుకు నిదర్శనమని ఆయన చెప్పారు. తమిళనాడు రాష్ట్రంలో జరుగుతున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పక్షాన స్టార్ క్యాంపెయిన్ గా నియమితులైన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సోమవారం నుండి అక్కడ జరుగుతున్న ఎన్నికల ప్రచార సభలలో పాల్గొంటూ విస్తృతంగా పర్యటిస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం తమిళనాడు రాష్ట్రం నీలగిరి జిల్లా ఉథగమండలం ఊటి నియోజకవర్గంలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఊటి నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బి. రామచంద్రన్ ను గెలిపిస్తే ఊటి కున్న ప్రాశస్త్యం కాపాడడంతో పాటు ఊటి అభివృద్ధికి కృషి చేస్తామని ఆయన తెలిపారు. ప్రధానంగా తేయాకు తోటల మీద ఆధారపడి ఉన్న రైతాంగం ప్రయోజనాల పరిరక్షణకు గట్టి చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. తమిళనాడు లో పాగా వేసేందుకు రంగంలోకి దిగిన భారతీయ జనతా పార్టీని కట్టడి చేసి తమిళనాడు సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షణకు ఓటర్లు సిద్ద పడాలని ఆయన పిలుపునిచ్చారు. తమిళనాడులో మళ్ళీ వచ్చేది డియంకే కాంగ్రెస్ కూటమి ప్రభుత్వమేనని ఆయన స్పష్టం చేశారు. కూటమిలో భాగంగా కాంగ్రెస్ పార్టీ పోటీ చేస్తున్న 28 స్థానాలలో కాంగ్రెస్ పార్టీ విజయం సునాయాసమేనని ఆయన ధీమా వ్యక్తంచేశారు. తమిళనాడు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్ చార్జ్ గిరీష్ చోడంకర్, ఆ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కే. సెల్వపేరుంతగై లు రాష్ట్ర వ్యాప్తంగా లీడర్ ను క్యాడర్ ను సమన్వయం చేస్తున్నారని ఆయన చెప్పారు. ఏ.ఐ.సి.సి ఎన్నికల పరిశీలకుడిగా తనను ఇక్కడికి పంపిన నేపధ్యంలో కాంగ్రెస్ పార్టీ పోటీ చేస్తున్న స్థానాలలో విస్తృతంగా పర్యటిస్తూ భాగస్వామ్య పక్షాలతో సహా కాంగ్రెస్ పార్టీ యంత్రాంగాన్ని ప్రణాళికా బద్దంగా ఎన్నికల భేరికి సన్నద్ధం చేశామని ఆయన చెప్పారు. రాష్ట్రంలో డీఎంకె కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని అధికారంలోకి వచ్చాక ఊటి లో కావలసిన మౌళిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని ఆయన భరోసా ఇచ్చారు.



# పోలీస్ అక్కల సేవలు అభినందనీయం

- డీజీపీ శివధర్ రెడ్డి

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**




నిర్మల్ జిల్లాలో అమలు చేస్తున్న పోలీస్ అక్క కార్యక్రమం ద్వారా ఎందరో మహిళలకు సేవలు అందడం అభినందనీయమని రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి అన్నారు. జాతీయ స్థాయిలో స్కోచ్ అవార్డు సాధించిన సందర్భంగా జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిలను, పోలీస్ అక్కలను ఆయన మంగళవారం అభినందించారు. అనంతరం పోలీస్ అక్కలతో ప్రత్యేకంగా మాటామంతి కార్యక్రమం నిర్వహించారు. పోలీస్ అక్కలతో ఆత్మీయంగా మమేకమై, వారి సేవలను కొనియాడుతూ వారికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో విద్యార్థినులు, మహిళల భద్రతలో పోలీస్ అక్కలు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థినుల్లో సాన్నిహిత్యం పెంచుతూ, మహిళలకు ధైర్యం కల్పించే విధంగా పనిచేయాలని సూచించారు. జిల్లా ఎస్పీ ప్రోత్సాహం, మార్గదర్శకత్వం వలననే ఈ రోజు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందగలిగామని పోలీస్ అక్కలు వివరించారు. అనంతరం పోలీస్ అక్కలకు రాష్ట్ర డీజీపీ చేతుల మీదుగా స్కోచ్ రిప్లికా అవార్డు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ డా. జి. జానకి షర్మిల, భైంసా ఏ ఎస్పీ రాజేష్ మీనా, నిర్మల్ ఏ ఎస్పీ సాయి కిరణ్, జిల్లా పోలీసు అధికారులు పాల్గొన్నారు.

**అవగాహనతో ప్రాణ రక్షణ:**

ట్రాఫిక్ నిబంధనలను పాటించక పోవటమే ప్రమాదాలకు కారణమని, వీటిపై అవగాహన కల్పించడం "అరైవ్ అలైవ్" కార్యక్రమ లక్ష్యమని రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి స్పష్టం చేశారు. నిర్మల్ జిల్లా సోన్ మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ శివధర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకి షర్మిళలతో కలిసి పాల్గొన్నారు. డీజీపీకి గుస్సాడీ నృత్యాలతో ఘన స్వాగతం పలికారు. డ్రంక్ అండ్ డ్రైవ్, మైనర్ డ్రైవింగ్ వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రోత్సహించరాదని హెచ్చరించారు. అనంతరం రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం అంబేద్కర్ జయంతి సందర్భంగా గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి డీజీపీ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డిఎఫ్ఓ సుశాంత్ సుఖదేవ్ బోబడే, అదనపు ఎస్పీలు రాజేష్ మీనా, సాయి కిరణ్, డిపిఓ శ్రీనివాస్, డిఎంహెచ్వో రాజేందర్, ఎంవిఐ మహేందర్, సర్పంచ్ వనజ తదితరులు పాల్గొన్నారు.

**భరోసా కేంద్రం ప్రారంభం:**

మహిళా బాధితులకు తక్షణ సహాయం అందించే లక్ష్యంతో నూతనంగా నిర్మించిన భరోసా భవనాన్ని రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి. శివధర్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా, మొదటగా భరోసా ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం పోక్సో కేసుల బాధితులకు ఆర్థిక సాయం అందజేశారు. కుటుంబ విభేదాల వల్ల విడిపోయి మళ్లీ కలిసిన జంటలకు ప్రోత్సాహకంగా బహుమతులు పంపిణీ చేశారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
15.04.2026 బుధవారం, హైదరాబాద్



మీ 'ముద్ర' వేయండి

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com



# కళ అనేది ఓ విశ్వ భాష

**(15 ఏప్రిల్ "ప్రపంచ కళా దినోత్సవం" సందర్భంగా)**

కళ అనేది ఒక విశ్వ భాష. కళ ద్వారా సరిహద్దులు చెరపబడుతున్నాయి. ప్రపంచ ప్రజలు సంస్కృతుల ఫలితంగా ఏకతాటిపైకి వస్తున్నారు. మన భావోద్వేగాలు, ఆలోచనలు, ఉపాయాలు, జీవన విధానాలు, సంప్రదాయాలు వ్యక్తం చేయబడుతున్నాయి. సమాజ చైతన్య వేదికలుగా కళలు అపార ప్రయోజనాలను అందిస్తున్నాయి. కళలకు ఉన్న అపార అదృశ్య శక్తి ప్రజలను ఏకం చేయడానికి, సమాజంలో నెలకొన్న అనారోగ్యకర ఆచారాల చికిత్సకు, సమైక్యంగా సాగిపోవడానికి ఉపయోగపడుతున్నాయని ఇటీవల జరిగిన సంక్షోభాలు, కరోనా విపత్తులు, మానవ వేదనల సమయాలు రుజువు చేస్తున్నాయి. కళా విద్యతో అభిజ్ఞా నైపుణ్యాల్లో వృద్ధి, దృశ్య మాధ్యమ జ్ఞానం పెరగడం, ఆత్మ గౌరవంతో పాటు ఆత్మ విశ్వాసం ఊపందుకోవడం జరుగుతున్నది. మానసిక ఆందోళనలు, ఒత్తిడి లాంటి అనారోగ్యాలకు చికిత్సలు, సృజన/ఆవిష్కరణల ప్రవృత్తిని మేలుకొలపడం లాంటి ప్రయోజనాలు కలుగుతున్నాయి.

**ప్రపంచ కళా దినోత్సవం-2026 ఇతివృత్తం:**

కళాకారుల సృజన ద్వారా పౌర సమాజం జాగృత పడడం, వైవిధ్యభరిత కళా ప్రదర్శనలు కొనసాగడం, మానవ సుస్థిరాభివృద్ధిలో కళలు భాగస్వామ్యం తీసుకోవడం గమనించిన యునెస్కో 2019లో తీసుకున్న తీర్మానం ప్రకారం ప్రతి ఏట 15 ఏప్రిల్‌న "ప్రపంచ కళా దినోత్సవం" లేదా "వరల్డ్ ఆర్ట్ డే" నిర్వహించడం జరుగుతోంది.

2026 ప్రపంచ కళా దినోత్సవ ఇతివృత్తంగా "భావ వ్యక్తీకరణ తోట : కళల ద్వారా సమాజాభివృద్ధి" అనే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. కళా సృజనతో ప్రపంచ మానవాళి ఒకే వేదికపైకి రావడం, విజ్ఞాన వితరణ జరగడం, ఉత్సుకత పెరగడం, విభేదాల పరిష్కారాల దిశగా చర్చలు కోనసాగడం జరుగుతున్నది. కళా ప్రదర్శనలను పోత్సహించడం, కళాకారులకు స్వేచ్ఛను ఇస్తూ అక్కున చేర్చుకోవడం కొనసాగాలి. కళా వేదికల వెలుగుల ద్వారా పౌర సమాజ అభివృద్ధి సుసాధ్యం అవుతున్నదని తెలుసుకోవాలి.

ఆర్కిటెక్చర్, సంగీతం, పేయింటింగ్, శిల్పాలు చెక్కడం, నాట్యం, సినిమా, నాటక వేదికలు, సాహిత్యం లాంటి కళలు మానవ నిత్య జీవితంగా ఓ ప్రధాన భాగం అయ్యాయి. ఇలాంటి శక్తివంతమైన కళారూపాలతో పౌరసమాజ చైతన్యం జరుగుతోంది. ప్రపంచ కళా దినోత్సవ వేదికగా కళా ప్రదర్శనలు, కార్యశాలలు, కళా బోధనలు, కళా శిక్షణలు, కళాకారులను ప్రోత్సహించడం, కళా ప్రదర్శనలకు సౌజన్య ప్రదాతలుగా నిలవడం, కళను సానబట్టడం జరగాలి. కళల మాధ్యమంగా పిల్లల్లో అవగాహన పెంచడం విధిగా జరగాలి. కళకు చలించని లేదా స్పందించని మనిషి లేడని గమనించి మనకు ఇష్టమైన కళలో శిక్షణ పొందడం లేదా కళాకారులను తట్టి ప్రోత్సహించడం నిరంతరం కొనసాగాయని ప్రపంచ కళా దినోత్సవం స్పష్టం చేస్తున్నదని మరువరాదు.

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# నిప్పుల కొలిమి



చంద్రునితో ఆడుకొని వెన్నెల కురిపించే
సూర్యుడు
ఏం ప్రేమ పుట్టిందో భూమిపై కన్నేశాడు
ఏం కోపం వచ్చిందో కనుగుడ్లు తెరిచాడు
ఇక్కడ సాధించడం, శాసించడం తనకే చెల్లు
ఎండలతో యుద్ధం చేసే వృక్ష వీరంగాన్ని
కొరిగేసి, కొల్లగొట్టిన మనుషులు
డాలు లేకుండా కత్తులు పట్టుకొని ఏ లాభం
చెమటలు కక్కుతూ చేతులెత్తేశారు
భూమికి సూర్యుడు ఆత్మబంధువే
పత్రహరితాన్ని పంచి, పెంచి పోషించేవాడే
జలాలను పీల్చి మబ్బుల కానుకలిస్తున్న వాడే
లోకానికి వెలుతురు రుచి చూపిస్తున్న వాడే
సూర్యుడు లేని సృష్టిని ఊహించగలమా
మమతల మాధుర్యాలు, ప్రేమలెప్పటికీ
ఉంటాయా
చేదు రుచి చూస్తేనే తెలుస్తుంది తీపి విలువ
కారం నశాలానికంటితేనే కమ్మదనం విలువ
అందుకేనేమో సూర్యుడు సురుకులంటిస్తున్నాడు
కోపిష్టిగా మారి, కొర్రాయి వాతలు పెడుతున్నాడు
కథలెన్నైనా చెప్పొచ్చు, ఊహలెన్నైనా
చేసుకోవచ్చు
కడుపు మండితేనే తెలుస్తది
మండుటెండలో నిలబడితేనే తెలిసొస్తది
చర్మ రంధ్రాలు చెమటలు స్ప్రే చేస్తుంటే
శరీరంపై దుస్తులు ఉప్పు కయ్యల్ని
మోస్తున్నట్లుంది
తాగిన నీళ్లు తాగినట్లే పోతుంటే
నీరసం, నిస్సత్తువ కౌగిలించుకుంటున్నాయి
వడదెబ్బ వండర్ ఫుల్ గా పేరిణినృత్యం చేస్తోంది
నిప్పులపై మొక్కజొన్న కంకిని కాల్చినట్లు కాదు
నిప్పుల కొలిమిలో కరిగిపోతున్న బంగారం
శరీరాలు
ఇప్పుడు సూర్య నమస్కారాలు చేస్తే చాలదు
సంధ్యావందనాలు ఆదుకోవు
చెరువులో మునుగుదామనుకుంటే
బీటలు వారిన దాహం దాంది
భూమిని వేయి దాటి అడుగులు డ్రిల్లింగ్ చేసినా
దుమ్ము లేస్తుంది తప్ప పలకరించని ఊటలు
చేతులారా చేసుకున్న తప్పలకు
అనుభవిస్తున్నాం అక్షరాలా బాధలు, బాధలు

కొమురవెల్లి అంజయ్య
సిద్దిపేట
సెల్..9848005676



# పల్లె సంస్కృతి కరిగిపోతున్నదా...?!

## సమిష్టి సహజ జీవనం నుంచి ఏకాంత ఆధునికత వరకు



తెలుగు పల్లె... ఒకప్పుడు అది కేవలం నివాస స్థలం కాదు.. అది జీవించే సంస్కృతి, ఊపిరి తీసుకునే ప్రకృతి, అనుబంధాలతో నిండిన ఒక సజీవ ప్రపంచం. ఉదయం సూర్యుడు కిరణాలు నులి వెచ్చగా తాకుతుంటే, గేదెల మేతకు వెళ్లే అడుగుల శబ్దం, కోళ్ల కూతలతో మేల్కొనే ఇళ్లు, ఎడ్లబండ్ల చక్రాలు నెమ్మదిగా తిరుగుతూ ఊరి దారుల్లో వినిపించే "క్రిక్... క్రిక్..." శబ్దాలు.. ఇవన్నీ కలిసి ఒక సహజ సంగీతంగా ప్రతి రోజును ఆరంభించేవి.

పెరట్లో పిల్లలు ఆడుకునే నవ్వులు, పెద్దలు చెట్టు కింద కూర్చొని చెప్పుకునే కథలు, ఆవుల అరుపులు, గాలిలో తేలే పంటల వాసన ఇవ్వన్ని కలిసినప్పుడు పల్లె జీవితం ఒక మధురమైన గీతంలా అనిపించేది. ఆ పల్లెల్లో ప్రతి మనిషి ఒకరికొకరు తోడుగా ఉండేవారు... ప్రతి ఇల్లు మరొక ఇంటికి దగ్గరగా ఉండేది... ప్రతి జీవి, ప్రతి చెట్టు, ప్రతి పంట ఒక అనుబంధంతో జీవించేది. పశువులు కేవలం ఆస్తి కాదు.. అవి కుటుంబ సభ్యులు. పంటలు కేవలం ఆహారం కాదు.. జీవనాధారం. పండుగలు కేవలం వేడుకలు కాదు.. మనసులను కలిపే బంధాలు. ఆ జీవన విధానంలో ఒంటరితనం అనే మాటే లేదు.. కలిసి ఉండటం, పంచుకోవడం, సహజంగా జీవించడం మాత్రమే ఉండేది.

కానీ కాలం మారింది... అదే పల్లె ఇప్పుడు నిశ్శబ్దంగా మారిపోయింది. ఎడ్లబండ్ల శబ్దం తగ్గిపోయింది, పశువుల అరుపులు అరుదైంది, పెరట్లో నవ్వుల కంటే యంత్రాల గర్జన ఎక్కువైంది. సమిష్టి జీవనం క్రమంగా వ్యక్తిగత జీవితంగా మారింది. ఒకప్పుడు ప్రకృతి గుండెలో కొట్టుకున్న ఆ పల్లె... ఇప్పుడు యాంత్రిక ప్రపంచపు అంచుల్లో నిలబడి తన గతాన్ని గుర్తు చేసుకుంటోంది.

### గత పల్లె.. ప్రకృతితో మమేకమైన సమిష్టి జీవనం

గతంలో ప్రతి ఇంటి పెరట్లో పశువుల కొట్టం ఉండేది. ఆవులు, బర్రెలు, గేదెలు.. ఇవి కేవలం ఆస్తి కాదు, కుటుంబ సభ్యుల్లా భావించేవారు. ఉదయం మేతకు వెళ్లి సాయంత్రం తిరిగి వచ్చి ఇంటి ముందు నిలబడే ఆ దృశ్యం పల్లెకు ప్రాణం. పెరట్లో తిరిగే కోళ్లు, గొర్రెలు, మేకలు.. ఇవన్నీ కలిసి గ్రామానికి సహజ స్వరాల్ని అందించేవి. ధాన్యం నిల్వ కోసం గుమ్ముల దొడ్డి (గుమ్మి) ప్రతి ఇంటిలో ఉండేది. వడ్లు, జొన్నలు, సజ్జలు, కొర్రలు.. ఇవి ఎండలో ఎండబెట్టి ఏడాది పొడవునా నిల్వ చేసుకునేవారు. ఇది స్వయం సమృద్ధి యొక్క స్పష్టమైన రూపం. వ్యవసాయం కూడా సమిష్టి పద్ధతిలో జరిగేది. ఒకరి పంట పనికి మరొకరు తోడుగా ఉండేవారు. "ఒకరికొకరు తోడు" అనేది మాట కాదు.. జీవన విధానం.

ఎండాకాలంలో ఆరుబయట నిద్రించడం, ఆకాశం చూస్తూ కథలు చెప్పుకోవడం, పాటలు పాడుకోవడం.. ఇవి కుటుంబ బంధాలను బలపరిచే అనుభవాలు.

### పండుగలు: పల్లె సంస్కృతికి ప్రాణం

పల్లెల్లో పండుగలు కేవలం ఆనంద క్షణాలు కాదు.. అవి ప్రకృతి, పశువులు, మనుషులు.. ఈ మూడింటి మధ్య ఉన్న అవినాబావ బంధానికి ప్రతీకలు. ప్రతి పండుగ వెనుక ఒక జీవన తత్వం, ఒక కృతజ్ఞత భావం, ఒక సమిష్టి ఆత్మ దాగి ఉండేది. పొలాల అమావాస్య రోజున పశువులను కృతజ్ఞతాపూర్వకంగా పూజించి, రైతు తన భూమికి నమస్కరిస్తూ, పంటకు పునాది అయిన ప్రకృతిని స్మరించేవాడు. సంక్రాంతి పండుగ రాగానే పల్లె మొత్తం ఒక పండుగ వాతావరణంగా మారేది. ఎడ్లు, ఆవులను రంగురంగుల అలంకరణలతో సిద్ధం చేసి, వాటికి పూజలు చేసి, గంగిరెద్దుల ఊరేగింపుతో ఊరంతా సంబరాల్లో మునిగిపోయేది. అది కేవలం ఉత్సవం కాదు... పశువుల పట్ల కృతజ్ఞత, వ్యవసాయానికి వాటి పాత్రను గుర్తించే సంస్కృతి.

బోనాలు, ఉగాది వంటి పండుగలు గ్రామ దేవతల పట్ల విశ్వాసాన్ని, భక్తిని, ప్రకృతి చక్రంపై ఆధారపడి ఉన్న జీవన విధానాన్ని ప్రతిబింబించేవి. బోనం పెట్టడం అంటే కేవలం ఆచారం కాదు.. "మాకు అన్నం పెట్టిన ఈ నేలకు, ఈ దేవతకు కృతజ్ఞత" అని చెప్పే భావోద్వేగం. ఉగాది కొత్త సంవత్సరాన్ని మాత్రమే కాదు, కొత్త ఆశలను, కొత్త పంటల ఆశీస్సులను తీసుకొచ్చేది.

జాతరలు అయితే పల్లె సంస్కృతికి జీవంతమైన ప్రతిబింబాలు. ఎడ్లబండ్లపై కుటుంబాలంతా కలిసి ప్రయాణిస్తూ, దారిలో పాటలు పాడుకుంటూ, గమ్యానికి చేరుకుని రాత్రంతా బుర్రకథలు, ఒగులు, జానపద నృత్యాలతో మెలకువగా గడిపే ఆ వేళలు.. అవి కేవలం వినోదం కాదు, ఒక సామాజిక ఉత్సవం, ఒక సాంస్కృతిక పాఠశాల. చిన్నా పెద్దా, ధనికా పేదా అనే తేడా లేకుండా అందరూ ఒకే చోట చేరి ఆనందాన్ని పంచుకునే అరుదైన సందర్భాలు అవి.

ఈ పండుగలు పల్లె జీవనానికి ప్రాణం పోసేవి. అవి మనుషులను ఒకే తాటిపై నిలబెట్టేవి, అనుబంధాలను బలపరచేవి, "మనం ఒకటే" అనే భావాన్ని నాటేవి. ప్రతి ఇంటి ఆనందం ఊరి ఆనందంగా మారేది. ప్రతి ఒక్కరూ ఒక కుటుంబంలా కలిసే ఆ క్షణాలు.. ఇవే పల్లె సంస్కృతికి అసలు శ్వాస.

### మార్పు దశ... హరిత విప్లవం

హరిత విప్లవం... భారత వ్యవసాయ చరిత్రలో ఒక కీలక మలుపు. అది పంటల ఉత్పత్తిని పెంచింది, ఆకలిని తగ్గించింది, దేశాన్ని ఆహార భద్రత వైపు నడిపించింది. ఇవన్నీ అనన్యసాధారణ విజయాలే. కానీ అదే సమయంలో, గ్రామీణ జీవన విధానాన్ని మౌనంగా, గమనించలేని విధంగా మార్చేసిన విప్లవం కూడా అదే.

ఒకప్పుడు ఎడ్లబండ్ల చక్రాల మోగింపుతో నిండిన పల్లె దారులు, నేడు ట్రాక్టర్ల గర్జనతో మార్మోగుతున్నాయి. ఎడ్లు, ఆవులు, గేదెలు.. వ్యవసాయానికి ప్రాణంగా ఉన్న ఈ జీవాలు క్రమంగా యంత్రాల ముందు వెనుకంజ వేశాయి. పశువులపై ఆధారపడిన సాగు పద్ధతులు తగ్గిపోగా, రసాయనిక ఎరువులు, పురుగు మందులు, హైబ్రిడ్ విత్తనాలు వ్యవసాయాన్ని పూర్తిగా మార్చేశాయి. రైతు ప్రకృతితో మాట్లాడే వ్యక్తి నుంచి మార్కెట్‌తో లెక్కలు చూసే వ్యక్తిగా మారాల్సి వచ్చింది.

యాంత్రీకరణ వేగం పెరిగింది... పని త్వరగా పూర్తయ్యింది... కానీ మనుషుల మధ్య ఉన్న ఆప్యాయత తగ్గింది. ఒకప్పుడు పంట నాటడం, కోత, నూర్పిడి ఇవన్నీ కలిసి చేసే సామూహిక కార్యక్రమాలు. ఇప్పుడు అవి యంత్రాల చేతుల్లోకి వెళ్లడంతో, "ఒకరికొకరు తోడు" అనే భావన క్రమంగా మసకబారింది. పని వేగంగా పూర్తయినా, మనసుల మధ్య దూరం పెరిగింది.

ఇంకా ఒక ముఖ్యమైన మార్పు వలసలు. పల్లెల్లో అవకాశాలు తగ్గిపోవడంతో యువత నగరాల వైపు అడుగులు వేసింది. చదువు, ఉద్యోగం, జీవనోపాధి కోసం ఊరిని వదిలి వెళ్లిన వారు తిరిగి రావడం తగ్గింది. పల్లెల్లో పెద్దలు, వృద్ధులు మాత్రమే మిగిలి, ఒకప్పుడు కిలకిలలతో కళకళలాడిన ఆవరణలు నిశ్శబ్దంగా మారాయి.

చిన్న చిన్న భూములుగా విభజన, వ్యక్తిగత వ్యవసాయం పెరగడం కూడా సమిష్టి జీవనాన్ని దెబ్బతీశాయి. ప్రతి రైతు తన భూమి, తన లాభం, తన సమస్యలతోనే పరిమితమయ్యాడు. ఒకప్పుడు ఊరి మొత్తం కలిసి పనిచేసిన వ్యవసాయం, ఇప్పుడు వ్యక్తిగత బాధ్యతగా మారింది.

ఈ మార్పులన్నింటి ఫలితంగా పల్లెల్లో వినిపించే శబ్దాలు కూడా మారిపోయాయి. పశువుల మ్రోగింపు, కోళ్ల కూతలు, ఎడ్లబండ్ల శబ్దాలు.. ఇవి తగ్గిపోగా, వాటి స్థానంలో ట్రాక్టర్లు, మోటార్లు, యంత్రాల శబ్దాలు వచ్చాయి. ఇది కేవలం శబ్దాల మార్పు కాదు.. జీవన తత్త్వం మార్పు.

హరిత విప్లవం మనకు అన్నం ఇచ్చింది... కానీ అదే సమయంలో పల్లె జీవనంలో ఉన్న ఆత్మీయతను, సమిష్టి భావనను కొంతవరకు దూరం చేసింది. ఇప్పుడు ప్రశ్న ఒక్కటే.. అభివృద్ధి పేరుతో మనం పొందిన దానికంటే, కోల్పోయింది ఎక్కువా? లేదా రెండింటి మధ్య సమతుల్యత సాధించగలమా?

ఈ ప్రశ్నకు సమాధానం వెతుక్కోవాల్సిన సమయం ఇదే.

### సాంస్కృతిక ప్రభావం... కనిపించని నష్టం

ఈ మార్పు కేవలం ఆర్థిక వ్యవస్థలో వచ్చిన పరిణామం మాత్రమే కాదు... అది నిశ్శబ్దంగా చోటుచేసుకున్న ఒక గొప్ప సాంస్కృతిక నష్టం. ఒకప్పుడు పల్లె జీవనం ప్రకృతితో ముడిపడి, పశువులతో ఆధారపడి, మనుషుల మధ్య అనుబంధాలతో నిండిపోయి ఉండేది. కానీ ఆ ఆధారం క్రమంగా దెబ్బతినడంతో, ఆ జీవన విధానం కూడా మెల్లగా కరిగిపోతోంది.

పశువుల సంఖ్య తగ్గిపోవడం కేవలం పాల ఉత్పత్తి తగ్గడమే కాదు.. అది సేంద్రీయ వ్యవసాయానికి బలమైన ఆధారం కోల్పోవడం. ఆవుల ఎరువు, గోమయం, సహజ మూలికలతో సాగిన వ్యవసాయం ఇప్పుడు రసాయనాల పై ఆధారపడుతోంది. దాంతో భూమి ఫలదీకరణం మాత్రమే కాదు, రైతు ప్రకృతితో ఉన్న అనుబంధం కూడా తగ్గిపోయింది. ఒకప్పుడు రైతు తన పొలాన్ని "జీవంగా" చూసేవాడు... ఇప్పుడు అది "ఉత్పత్తి యూనిట్"గా మారిపోతున్నది.

స్థానిక పశు జాతులు, సంప్రదాయ విత్తనాలు.. ఇవి కేవలం జీవ వైవిధ్యం కాదు, పల్లె సంస్కృతికి మూలాలు. కానీ ఇవి ఇప్పుడు క్రమంగా అంతరించిపోతున్నాయి. వాటి స్థానంలో హైబ్రిడ్ జాతులు, వాణిజ్య విధానాలు వచ్చాయి. ఫలితంగా మనకు లాభాలు వచ్చి ఉండొచ్చు... కానీ మన గుర్తింపు, మన మూలాలు మసకబారుతున్నాయి.

### ఇంకా పెద్ద నష్టం.. సమిష్టి పండుగల మార్పు.

ఒకప్పుడు పండుగ అంటే ఊరి మొత్తం కలిసి జరుపుకునే ఆనందం. జాతరలు అంటే కుటుంబాలు, బంధువులు, పొరుగువాళ్లు అన్నీ కలిసే ఒక మహోత్సవం. కానీ ఇప్పుడు అవి క్రమంగా వాణిజ్యీకరణకు గురవుతున్నాయి. ఆత్మీయత తగ్గి, ఆర్భాటం పెరిగింది. ఆనందం పంచుకునే పండుగలు, ఇప్పుడు చూసే వేడుకలుగా మారిపోతున్నాయి.

అతిథి సత్కారం కూడా మారిపోయింది. ఒకప్పుడు ఇంట్లో పెంచుకున్న కోళ్లతో, పాలు, అన్నంతో బంధువులను ఆహ్వానించడం.. అది ప్రేమ, ఆత్మీయతకు ప్రతీక. ఇప్పుడు అదే సత్కారం మార్కెట్ నుంచి కొనుక్కొచ్చిన వస్తువులతో జరుగుతోంది. "సొంతం" అనే భావన క్రమంగా "కొనుగోలు"గా మారిపోతోంది.

ఇలా ఒక్కో మార్పు చూస్తే చిన్నదిగా అనిపించినా... ఇవన్నీ కలిసినప్పుడు ఒక పెద్ద ఖాళీని సృష్టిస్తున్నాయి. పల్లె జీవనంలో ఒకప్పుడు ఉన్న ఆత్మీయత, అనుబంధం, సహజత్వం.. ఇవి మెల్లగా కరిగిపోతున్నాయి. ఇది కంటికి కనిపించని నష్టం... కానీ మన సంస్కృతికి గుండెల్లో పడిన గాయం.

### పునరుద్ధరణే పరిష్కారం...

గత పల్లె జీవనం మనకు కేవలం జ్ఞాపకాలు మాత్రమే కాదు.. ఒక గొప్ప జీవన తత్వాన్ని, ఒక సమతుల్యమైన మార్గాన్ని నేర్పిస్తోంది. ప్రకృతితో కలిసిమెలిసి జీవించడం, సమాజంతో కలిసి ముందుకు సాగడం, స్వయం సమృద్ధిని సాధించడం.. ఇవన్నీ ఆ కాలపు పల్లె మనకు అందించిన అమూల్యమైన పాఠాలు. నేడు అభివృద్ధి పరుగులో మనం ఆ పాఠాలను మరచిపోయినా... ఇప్పుడు తిరిగి వాటి విలువను అర్థం చేసుకునే దశకు వచ్చేశాం.

ఇప్పటి అవసరం కేవలం వ్యవసాయ ఉత్పత్తిని పెంచడం కాదు, జీవన నాణ్యతను, పర్యావరణ సమతుల్యతను, సామాజిక అనుబంధాలను కాపాడటం. అందుకే సేంద్రీయ వ్యవసాయం పునరుద్ధరణ అత్యంత కీలకం. పశువుల ఆధారిత సహజ ఎరువులు, సంప్రదాయ విత్తనాలు, ప్రకృతి చక్రానికి అనుగుణంగా సాగు —— ఇవి భూమిని మాత్రమే కాదు, మన ఆరోగ్యాన్ని కూడా కాపాడతాయి.


అలాగే స్థానిక పశు జాతులను కాపాడటం అనేది కేవలం జీవ వైవిధ్యాన్ని రక్షించడం కాదు.. అది మన సంస్కృతిని నిలబెట్టే ప్రయత్నం. ఎడ్లు, ఆవులు తిరిగి పల్లెల్లో కనిపిస్తే... అది కేవలం పశుపాలన పునరాగమనం కాదు, ఒక జీవన విధానం తిరిగి పునర్జన్మ పొందినట్లే.

సహకార రైతు సమూహాలు ఈ దిశగా కీలక పాత్ర పోషించగలవు. ఒకప్పుడు ఉన్న "ఒకరికొకరు తోడు" అనే భావనను ఆధునిక రూపంలో తిరిగి తీసుకురావడం ద్వారా రైతులు ఆర్థికంగా, సామాజికంగా బలపడతారు. సమిష్టి కృషి, పంచుకునే వనరులు, పరస్పర సహకారం.. ఇవి పల్లె జీవనానికి మళ్లీ ప్రాణం పోస్తాయి.

పల్లె పండుగలను కూడా కేవలం ఆచారాలుగా కాకుండా, సంస్కృతిగా పునరుద్ధరించాలి. సంక్రాంతి, జాతరలు, గ్రామోత్సవాలు.. ఇవి మనుషులను కలిపే వేదికలు. ఆ పండుగలలో ఉన్న ఆత్మీయత, సామూహిక భావనను మళ్లీ ప్రోత్సహించాలి. పండుగ అంటే కేవలం వేడుక కాదు.. అది మన సంస్కృతిని జీవించే సందర్భం అనే భావనను తిరిగి తెచ్చుకోవాలి.

ఇది కేవలం గతాన్ని గుర్తు చేసుకోవడం కాదు... అది మన భవిష్యత్తును కాపాడుకునే ప్రయత్నం. అభివృద్ధి అనే దారిలో ముందుకు సాగుతూనే, మన మూలాలను మరచిపోకుండా, ప్రకృతితో సమతుల్యంగా జీవించే మార్గాన్ని ఎంచుకోవడం అత్యవసరం.

పల్లె జీవనం మళ్లీ పునర్జీవం పొందాలంటే... మార్పు బయట నుంచి రాదు.. అది మన ఆలోచనల్లో, మన చర్యల్లో మొదలవాలి. ఇదే నిజమైన పునరుద్ధరణ..




(కాలగిరి శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్)

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
బుధవారం 15.04.2026
www.mudranews.in | @mudranews



### టాప్ ఏఐ 3




మైక్రోసాఫ్ట్ కోపైలట్ వర్డ్, ఎక్సెల్, పవర్‌పాయింట్‌లో స్మార్ట్ సహాయం అందిస్తుంది. కోడింగ్, ఆఫీస్ పనుల్లో టైమ్ సేవ్ చేస్తుంది.

## సంక్షిప్తంగా..

### ఘనంగా అంబేద్కర్ జయంతి



**ముద్ర, శేరిలింగంపల్లి:** సైబరాబాద్ పోలీస్ కమీషనరేట్ కార్యాలయంలో అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సైబరాబాద్ పోలీస్ కమీషనర్ డాక్టర్ ఎం.రమేష్, అడ్మిన్ డీసీపీ టి.అన్నపూర్ణ, ఇతర ఉన్నతాధికారులు, పోలీసు సిబ్బంది అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. సీపీ రమేశ్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో సమానత్వం కోసం అంబేద్కర్ చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. ఆయన ఆశయాలను గౌరవించాలని, రాజ్యాంగ స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సీఏఆర్ హెడ్ క్వార్టర్ డీసీపీ సంజీవ్, సీఏఆర్ హెడ్ క్వార్టర్ ఏడీసీపీ షమీర్, సి ఎస్ డబ్ల్యు ఏడీసీపీ హనుమంతురావు, ఆర్ఐ లు రామారావు, వీరలింగం, అనిల్, నాగరాజు రెడ్డి, నాగరాజు, వీరారెడ్డి, బి.డి టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

### సజావుగా ముగిసిన పది పరీక్షలు



**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** జిల్లాలో పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 60 పరీక్షా కేంద్రాల్లో మార్చి 14 నుంచి ఏప్రిల్ 13 వరకు పరీక్షలను అధికారులు సజావుగా నిర్వహించారు.ఈ ఏడాది మొత్తం 10,658 మంది విద్యార్థులు పరీక్షలకు నమోదు కాగా, అందులో 10,637 మంది హాజరై 99.80 శాతం హాజరు నమోదైంది. కేవలం 21 మంది విద్యార్థులు మాత్రమే గైర్హాజరైనట్లు అధికారులు వెల్లడించారు. పరీక్షల నిర్వహణలో పాల్గొన్న సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.పదో తరగతి ఫలితాలను మే నెలలో విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. ఇదిలా ఉండగా, లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన మూల్యాంకన కేంద్రాన్ని అదనపు కలెక్టర్ జీవి శ్యాంప్రసాద్ లాల్ సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.

### టీఎస్‌యూటీఎఫ్ 13వ ఆవిర్భావ దినోత్సవం



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** పెద్దకొత్తపల్లి మండలంలో తెలంగాణ స్టేట్ యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఎం.డి. గౌస్ పాషా జెండా ఆవిష్కరణ చేసి మాట్లాడారు. అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ లక్ష్యాలతో టీఎస్‌యూటీఎఫ్ సేవలు కొనసాగుతున్నాయని తెలిపారు. తెలంగాణ ఏర్పడిన తరువాత 12 సంవత్సరాలుగా ఉపాధ్యాయుల హక్కుల కోసం టీఎస్‌యూటీఎఫ్ పోరాటం కొనసాగుతోందని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి స్పందించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా పెండింగ్‌లో ఉన్న 5 డీఏలను వెంటనే ప్రకటించాలని, పీఆర్సీ అమలు చేయాలని, సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలని కోరారు. జిల్లా కార్యదర్శులు పి. మహేష్ బాబు, ఎన్. చంద్రశేఖర్, కోశాధికారి వి. లక్ష్మీపతి, మండల ఉపాధ్యక్షురాలు కె. సువర్ణ, ఎఫ్‌డబ్ల్యూఎఫ్ కన్వీనర్ బి. పరమేశ్వర్‌తో పాటు సీనియర్ నాయకులు, మండల సభ్యులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# అంబేడ్కర్ అందరికీ ఆదర్శం

**డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా పలు గ్రామాల్లో ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.**

**మహబూబ్ నగర్‌లో..**
**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి:** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ ఆశయాలు అందరికీ ఆదర్శమని ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక అంబేద్కర్ కళాభవన్‌లో అంబేద్కర్ 135వ జయంతి వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లా కలెక్టర్ ఖుష్బు గుప్తా, ఎస్ పి జానకి, మేయర్ మమత, డిప్యూటీ మేయర్ సురేందర్ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మైనారిటీ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, నాయకులు వినోద్ కుమార్, పాల్గొన్నారు.

**కల్వకుర్తిలో..**
**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** కల్వకుర్తి నియోజకవర్గంలో కడ్తాల, ఆమనగల్, ఎక్వాయిపల్లి, వెల్దండ, కల్వకుర్తి, పడకల్ గ్రామపంచాయతీలలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణ రెడ్డి పాల్గొని మాట్లాడారు.

**నాగర్ కర్నూల్‌లో..**
జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నాగర్ కర్నూల్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి అన్నారు. కలెక్టర్ బాదావత్ సంతోష్, అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, వైస్ చైర్మన్ బాదం రమేష్, టౌన్ ప్రెసిడెంట్ జక్కా రాజు, జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

**ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో..**
ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి పాల్గొని అంబేద్కర్ గారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం ఆసుపత్రి సిబ్బందికి చీరలను పంపిణీ చేశారు.



కాప్రాలో..



కూకట్‌పల్లిలో..

**కొండాపురంలో విగ్రహ ఆవిష్కరణ..**
**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:** రాజ్యాంగంలో అన్ని వర్గాల ప్రజలకు హక్కులు కల్పించిన ఘనత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌కే దక్కుతుందని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. కేటిదొడ్డి మండలం కొండాపురం గ్రామంలో అంబేద్కర్ విగ్రహాన్ని మంగళ వారం ఎమ్మెల్యే ఆవిష్కరించి, విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గద్వాల వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ కుర్వ హనుమంతు, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజశేఖర్, గద్వాల మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్, సర్పంచ్లు పవన్ కుమార్ రెడ్డి, నారాయణ, స్థలదాత గౌల్ల లలితమ్మ నాగిరెడ్డి, మండల నాయకులు ఉరుకుంద, శేఖర్ రెడ్డి, తిమ్మారెడ్డి, రాజేష్, శేఖర్ రెడ్డి, కన్న, నారాయణ, వెంకట్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**తాండూర్‌లో..**
**ముద్ర, తాండూర్:** అంటరానితనాన్ని నిర్మూలించి ప్రపంచానికే సమానత్వ భావనను చాటి చెప్పిన మేధావి, గొప్ప సంఘసంస్కర్త, ఆర్థిక నిపుణులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. వికారాబాద్ జిల్లా తాండూర్ పట్టణంలోని అంబేద్కర్ చౌక్ మరియు అంబేద్కర్ పార్క్ లో గల అంబేద్కర్ విగ్రహాలకు స్థానిక నేతలతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పట్లోళ్ల నీరజ, వైస్ చైర్ పర్సన్ అబ్దుల్ రజాక్, మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల నరసింహులు, వివిధ పార్టీల కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు, పార్టీ సీనియర్ నాయకులు బంటు మల్లప్ప, అధ్యాపకులు యాసిన్, ఉప్పరి మల్లేశం, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.



తాండూర్‌లో..



నాగర్ కర్నూల్‌లో..

**రంగారెడ్డి జిల్లా కేంద్రంలో..**
**ముద్ర, ఉమ్మడిరంగారెడ్డి జిల్లా ప్రతినిధి:** ట్యాంక్ బండ్ వద్ద కలెక్టర్ సి నారాయణ రెడ్డి అంబేద్కర్ విగ్రహానికి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డాక్టర్ అంబేద్కర్ భారత రాజ్యాంగ రూపకర్తగా సామాజిక న్యాయం కోసం పోరాడిన మహానుభావుడని, ఆయన చూపిన మార్గం సమానత్వం, విద్య, స్వాభిమానం అనే విలువలపై ఆధారపడి ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సోషల్ వెల్ఫేర్ అధికారి రామరావు, సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



కొండాపురంలో..

**కాప్రా, మల్కాజిగిరిలో..**
**ముద్ర, కాప్రా:** కాప్రా, నాచారం, ఉప్పల్, మల్కాజిగిరి, నేరేడ్మెట్ ప్రాంతాలలో అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు . ఆనంద్ బాగ్ చౌరస్తాలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పూలమాలవేసి నివాళులర్పించారు. గౌతమ్ నగర్, మల్కాజిగిరి ప్రాంతాలలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. నాచారం, మల్లాపూర్ డివిజన్లో ఏర్పాటు చేసిన విగ్రహాలకు మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి రాగిడి లక్ష్మారెడ్డి నివాళులర్పించారు. మల్కాజ్గిరి సిపి కార్యాలయంలో అడ్మిన్ డీసీపీ ఇందిరా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మహబూబ్ నగర్‌లో..



కల్వకుర్తిలో..



రంగారెడ్డి జిల్లా కేంద్రంలో..

**కూకట్‌పల్లిలో..**
**ముద్ర, కూకట్‌పల్లి:** కేపీహెచ్‌బీ కాలనీ టెంపుల్ బస్టాప్ వద్ద కాంగ్రెస్ నాయకుడు శేరి సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ ఆవిష్కరించారు.

**బాలానగర్‌లో..**
బాలానగర్‌లో నిర్వహించిన jeర్యక్రమంలో సైబరాబాద్ మున్సిపల్ జనసేన పార్టీ కో-ఆర్డినేటర్ ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# రోడ్డు భద్రత అందరి బాధ్యత

**జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్**

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చేపడుతున్న పనులను నాణ్యతతో, వేగవంతంగా పూర్తిచేసి స్పష్టమైన మార్పు తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం నాగర్ కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీపురం చౌరస్తాలో జరుగుతున్న జీబ్రా క్రాసింగ్ పెయింటింగ్ పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ప్రధాన కూడళ్ల వద్ద రోడ్డుపై "గో స్లో" వైట్ పెయింటింగ్, పాఠశాలల వద్ద ప్రత్యేక హెచ్చరిక బోర్డులు, సరైన స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు వంటి చర్యలు ప్రజల్లో అప్రమత్తత పెంచుతాయని తెలిపారు. ప్రమాదాల ప్రధాన కారణాలను విశ్లేషించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పనులు పూర్తి చేయడమే కాకుండా నాణ్యతను కూడా నిర్ధారించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం అత్యంత ముఖ్యమని అన్నారు. అధిక వేగం, నిర్లక్ష్య డ్రైవింగ్, ట్రాఫిక్ నియమాల ఉల్లంఘన, యువతలో స్పీడ్‌పై నియంత్రణ లేకపోవడం వంటి కారణాలతో ప్రమాదాలు జరుగుతున్నాయని, వీటి నివారణకు అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న 'అరైవ్ అలైవ్' కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆదేశించారు. ప్రజల సహకారంతో రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, ఆర్టీవో చిన్న బాలు, మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# విద్యతో పాటు నైతిక విలువలు అవసరం

**కలెక్టర్ ప్రతీక్ జైన్,**

**ముద్ర, నారాయణపేట:** విద్యార్థులు మంచి పౌరులుగా ఎదగాలంటే విద్యతో పాటు నైతిక విలువలు కూడా అవసరమని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. ఉట్కూరు మండలంలో ఎస్ సి బాలుర వసతి గృహాన్ని మంగళవారం కలెక్టర్, ఎస్పీ వినీత్ కుమార్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని, శారీరక, మానసిక ఆరోగ్యం కోసం క్రీడలు ఎంతో అవసరమని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా వసతి గృహాల్లో అన్ని మౌలిక సదుపాయాలు మెరుగుపరచడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. విద్యార్థులు అందించే సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. పరిశుభ్రత, క్రమశిక్షణ, సమయపాలన ప్రతి విద్యార్థి జీవితంలో కీలకమని పేర్కొన్నారు. ఎస్పీ మాట్లాడుతూ క్రమశిక్షణతో జీవనం గడిపితే జీవితంలో విజయాలు సాధించవచ్చని చెప్పారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సర్పంచ్ రేణుక, ఈ.డి.ఎస్.సి.కార్పొరేషన్ అబ్దుల్ ఖలీల్, తహసీల్దార్ రవి తదితరులు పాల్గొన్నారు.



# దోస్త్ హెల్ప్‌లైన్ కేంద్రం ఏర్పాటు

**నాగర్ కర్నూల్, ముద్ర ప్రతినిధి:** నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆర్ట్స్ , కామర్స్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ ప్రవేశాల కోసం జిల్లా స్థాయి దోస్త్ హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. గీతాంజలి తెలిపారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని, కళాశాల కోడ్ 3014 ద్వారా వెబ్ ఆప్షన్లు నమోదు చేసి అడ్మిషన్లు పొందాలని సూచించారు. అదేవిధంగా బి.కాం (బీఎఫ్ ఎస్ఐ) అనే నూతన వృత్తి విద్యా కోర్సును ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈ కోర్సులో చేరిన విద్యార్థులకు డిగ్రీ చివరి సంవత్సరంలోనే ఇ ంట ర్న్‌షిప్ అవకాశంతో నెలకు సుమారు రూ.15 వేల వరకు పారితోషికం పొందే అవకాశం ఉంటుందన్నారు. కళాశాలలో బీఏ హెచ్ఈపీ, (ఇంగ్లిస్, తెలుగు, ఉర్దూ), బీఏ(హెచ్‌పీసీఏ–ఇంగ్లిస్ ), బీకాం (కంప్యూటర్స్), బీకాం(బీఎఫ్ఎస్ ఐ) కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రవేశాల మొదటి విడత రిజిస్ట్రేషన్ ఏప్రిల్ 15 నుంచి మే 7 వరకు, వెబ్ ఆప్షన్లు ఏప్రిల్ 30 నుంచి మే 8 వరకు కొనసాగనున్నట్లు వెల్లడించారు. ఒకసారి రిజిస్ట్రేషన్ చేసిన తర్వాత అన్ని విడతలకు వర్తిస్తుందని, వెబ్ ఆప్షన్లు జాగ్రత్తగా ఇవ్వాలని, సీటు వచ్చిన వెంటనే సెల్ఫ్ రిపోర్టింగ్ పూర్తి చేయాలని సూచించారు. ఆలస్యం అయితే సీటు రద్దు అవుతుందని హెచ్చరించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సమయానికి నమోదు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు. వివరాలకు 99633 75850, 83414 90263, 94942 67661, 99853 75623 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.



# అగ్నిమాపక అమరవీరులకు నివాళి



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** అగ్నిమాపక సేవా దినోత్సవం సందర్భంగా విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన అగ్నిమాపక అమరవీరులకు జిల్లా అగ్నిమాపక శాఖ ఘనంగా నివాళులు అర్పించింది. ఏప్రిల్ 14 నుంచి 20 వరకు నిర్వహించబడే అగ్నిమాపక వారోత్స వాలను ఎమ్మెల్యే కె. రాజేష్ రెడ్డి, ఎమ్మెల్సీ కె. దామోదర్ రెడ్డి పోస్టర్లను విడుదల చేసి ప్రారంభించారు. వారోత్సవాల సందర్భంగా ప్రజల్లో అగ్నిప్రమాదాలపై అవగాహన పెంపొందించేందుకు పలు శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అగ్నిమాపక యంత్రాల వినియోగంపై ప్రజలకు ప్రత్యక్ష శిక్షణ అందిస్తూ, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లను ఎలా ఉపయోగించాలో వివరంగా చూపిస్తున్నారు. జిల్లా అగ్నిమాపక అధికారి పి. గిరిధర్ రెడ్డి నేతృత్వంలో ఈ వారం రోజుల పాటు హాస్పిటల్స్, థియేటర్లు, పరిశ్రమలలో తనిఖీలు నిర్వహిస్తూ అవగాహన సదస్సులు కొనసాగుతున్నాయి.

# కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి పడకల్ గ్రామపంచాయతీలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో మక్కలు, వరి, పొద్దుతిరుగుడు పంటల కొనుగోలు కేంద్రాలను మండల ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులకు సరైన ధరలు అందేలా కొనుగోలు కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు.

# ముగ్గురు పంచాయతీ కార్యదర్శులు సస్పెండ్

**డ్ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** నాగర్ కర్నూల్ జిల్లాలో విధి నిర్వహణలో నిర్లక్ష్యం, నిధుల దుర్వినియోగం ఆరోపణల నేపథ్యంలో ముగ్గురు పంచాయతీ కార్యదర్శులను జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం జారీ చేసిన 15వ ఆర్థిక సంఘం గ్రాంట్లు మరియు ఈ-గ్రామ్ స్వరాజ్ పోర్టల్ మార్గదర్శకాలను పాటించకుండా, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించినందుకు ఈ చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. వంగూరు మండలం కొండారెడ్డిపల్లి గ్రామపంచాయతీకి చెందిన గ్రేడ్-IV పంచాయతీ కార్యదర్శి పి. కిషన్, కొల్లాపూర్ మండలం సింగోటం గ్రామపంచాయతీకి చెందిన గ్రేడ్-III కార్యదర్శి పి. అర్జునయ్య, అలాగే కొల్లాపూర్ మండలం అంకిరావుపల్లి గ్రామపంచాయతీకి చెందిన గ్రేడ్-III కార్యదర్శి ఆర్. ప్రేమచంద్‌లను సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు. అదేవిధంగా పర్యవేక్షణలో నిర్లక్ష్యం వహించిన వంగూరు, కొల్లాపూర్ మండలాల పంచాయతీ అధికారులకు షోకాస్ నోటీసులు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.

# రక్తదానం మహాదానం




**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:** రక్తదానం ఎంతో మంది ప్రాణాలను నిలబెడుతుందని, రక్తందానం చేసేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని గద్వాల మున్సిపల్ చైర్ పర్సన్ తుమ్మల జయలక్ష్మి నర్సింహులు యాదవ్, వైస్ చైర్మన్ శంకర్, డీసిసి అధ్యక్షులు రాజీవ్ రెడ్డి అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా కి.శే. ముత్యాల వెంకట్ రెడ్డి జ్ఞాపకార్థం ముత్యాల మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో 32వ వార్డు చింతలపేటలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. చాలా మంది రక్తదానం చేశారు. అనంతరం ముత్యాల మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో భవిష్యత్ లో అనేక సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ట్రస్టు సభ్యులు వీరా రెడ్డి తెలిపారు. రక్తదాతలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. డాక్టర్ క్రాంతి, డిసిసి జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్ రెడ్డి, నాయకులు రవి రెడ్డి, ముత్యాల రవి, శ్రీనివాసులు, వీరారెడ్డి, రెడ్ క్రాస్ సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
బుధవారం 15-04-2026
www.mudranews.in | @mudranews



టాప్ ఏఐ 4. Midjourney
టెక్స్ట్ ద్వారా హై క్వాలిటీ ఇమేజ్‌లు రూపొందిస్తుంది. క్రియేటివ్ డిజైన్‌లకు బాగా ఉపయోగపడుతుంది.




# దేశానికే గర్వకారణం అంబేద్కర్

## అంబేద్కర్ ఆలోచనలను ఆచరణలో పెట్టాలి



● ఎమ్మెల్యే సంజయ్ కుమార్

ముద్ర ప్రతినిధి, జగిత్యాల:

సమాజంలో ప్రతి ఒక్కరూ అంబేద్కర్ ఆలోచనలను ఆచరణలో పెట్టాలని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి ఉత్సవాలు జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు కలెక్టర్ బి. సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్ లు కలిసి అంబేద్కర్ విగ్రహానికి గజమాల వేసి అనంతరం ఏర్పాటు చేసిన వేదిక వద్ద అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన గావించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ దేశానికి అందించిన రాజ్యాంగం ప్రపంచంలోనే గొప్పదని పేర్కొన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. అనంతరం కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ డాక్టర్ అంబేద్కర్ భారత రాజ్యాంగ రూపకర్తగా, సామాజిక న్యాయం కోసం పోరాడిన మహానుభావుడిగా చిరస్థాయిగా నిలిచారని అన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టి సమాజంలో వెనుకబడిన వర్గాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. అంతకుముందు కళాజాతా బృందం ఆలపించిన గేయాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. అనంతరం అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు బి.ఎస్. లత, బి.రాజ గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగన భట్ల దినేష్, మున్సిపల్ చైర్ పర్సన్ సమిండ్ల వాణి, ఆర్డీవో మధుసూదన్, ఎస్సీ సంక్షేమ అధికారి రాజ్ కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కిషోర్, డీఎఫ్ఓ సురేష్, డీపీఆర్ఓ నరేష్, జిల్లా స్థాయి అధికారులు, మార్కెట్ కమిటీ చైర్మన్ లు, కౌన్సిలర్లు, స్థానిక ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్ లు తదితరులు పాల్గొన్నారు.



● కలెక్టర్ అభిలాష అభినవ్

ముద్ర ప్రతినిధి, నిర్మల్:

భారత రాజ్యాంగ రూపకర్త, భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ దేశానికే గర్వ కారణమని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పిలుపునిచ్చారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని నిర్మల్ పట్టణంలోని మినీ ట్యాంక్ బండ్ సమీపంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి ఆమె పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు పంచశీల జెండాను ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అంబేద్కర్ ప్రపంచం గర్వించదగ్గ గొప్ప మేధావి అని కొనియాడారు. అనంతరం జయంతి వేడుకల్లో భాగంగా ప్రత్యేకంగా 'అరైవ్ అలైవ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా కలెక్టర్ అధికారులతో కలిసి రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి, అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఎస్సీ సంక్షేమ శాఖాధికారి దయానంద్, సీపీఓ జీవరత్నం, డిఈఓ భోజన్న, వివిధ సంఘాల నాయకులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేద్దాం



కోరుట్ల, ముద్ర:

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి వేడుకలు మెట్ పల్లిలోని నిత్యసాయి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపకులు డా. రఘు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ రూపొందించిన భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి హక్కులను కల్పించిందని, అణగారిన వర్గాల అభ్యున్నతికి అంబేద్కర్ సేవలు అమూల్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు చెట్లపల్లి సుఖేం దర్ గౌడ్, నల్ల వెంకటేష్, రాజన్న, కోరుట్ల రాజ్, జోగిని పల్లి రవితేజ, వాజిద్ బేగ్, జాపిరి పవన్ కళ్యాణ్, మోతే శ్రీకాంత్, ఎక్కల్ ధనుష్, శ్రీకర్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

### కుల నిర్మూలనతోనే అంబేద్కర్ ఆశయం సిద్ధిస్తుంది

మహదేవపూర్, ముద్ర:

సమాజంలో కుల వ్యవస్థ పైన అంబేద్కర్ ఆశయ సాధన సాకారం అవుతుందని వక్తలు ఏకగ్రీవంగా అభిప్రాయపడ్డారు. నూతన అంబేద్కర్ విగ్రహాన్ని ప్రతిష్టించడంతోపాటు ఏర్పాటు చేసిన సభా కార్యక్రమానికి ఉత్సవ సమితి అధ్యక్షుడు లింగాల రామయ్య అధ్యక్షత వహించగా సర్పంచ్ హసీరాబాను ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. దళిత నాయకులు బెల్లంకొండ సురేష్, మెరుగు లక్ష్మణ్, నల్లభూగ ధర్మయ్య, రాందాసు, వేమునూరు జక్కయ్య, పసుల శంకర్, చందు, రాజశేఖర్, కిరణ్, చంద్రమౌళి, మైనార్టీ నాయకులు అమీన్, ఇర్షాద్ విద్యావేత్త ఎం ఎం శషి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గుడాల శ్రీనివాస్ తదితరులు ప్రసంగించారు. ర్యాలీ అనంతరం నిర్వహించిన సభకు పెద్ద ఎత్తున ప్రజాసంఘాల నాయకులు ప్రజలు హాజరయ్యారు. ఎడపల్లిలో సర్పంచ్ మోతే నీలారాణి సాంబయ్య, మద్దులపల్లిలో సర్పంచ్ వేల్పుల సరిత ఆధ్వర్యంలో, కాటారం మండల కేంద్రంలో జాక్ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి ఉత్సవాలను నిర్వహించారు.




# అంబేద్కర్ ఆశయాలు స్ఫూర్తిదాయకం

● ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

ముద్ర, కరీంనగర్ :




భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు అందరం కృషి చేయాలని చొప్పదండి ఎమ్మెల్యే, జయంతి ఉత్సవాల కమిటీ చైర్మన్ మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. మంగళవారం అంబేద్కర్ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని కోర్టు చౌరస్తా వద్ద అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే కలెక్టర్ చిత్రా మిశ్రా, సీపీ గౌస్ ఆలం, అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, సుడా చైర్మన్ కోమటి రెడ్డి నరేందర్ రెడ్డి, ఉన్నత అధికారులు, వివిధ సంఘాల నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడారు. అంబేద్కర్ చిన్నతనం నుంచి ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొని.. ఖండాలు సముద్రాలు దాటి ఉన్నత విద్య అభ్యసించారని పేర్కొన్నారు. ప్రపంచంలోనే మేధావిగా పేరుగాంచారన్నారు. సుమారు 30 డిగ్రీలు పూర్తి చేసిన అంబేద్కర్.. నా సేవలు నా దేశానికే ఉపయోగపడాలనే ఉద్దేశంతో భారతదేశానికి వచ్చి సేవలందించారన్నారు. పిల్లలను అంబేద్కర్ మాదిరి ఉన్నత చదువులు చదివించాలని తల్లిదండ్రులకు సూచించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం దళితులకు పెద్దపీట వేస్తూ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ అంబేద్కర్ ఆలోచనలు, ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. మనం అనుభవిస్తున్న రాజ్యాంగ ఫలాలకు అంబేద్కర్ కృషే కారణమన్నారు.

సీపీ గౌస్ ఆలం మాట్లాడుతూ అంబేద్కర్ చెప్పిన మాటలు ఎడ్యుకేట్ – ఆర్గనైజ్ నిరంతరం గుర్తుంచుకోవాలని అన్నారు. సుమారు 50 వేల పుస్తకాలు ఉన్న అతని ఇంటిని దేశంలోనే పెద్ద ప్రైవేట్ లైబ్రరీగా చెప్పుకుంటారని అన్నారు.

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ అంబేద్కర్ స్ఫూర్తితో ఎడ్యుకేషన్ పై దృష్టి సారించాలని పేర్కొన్నారు. బలహీన వర్గాల అభివృద్ధికి, సామాజిక సమస్యల పరిష్కారానికి చదువే మూలమని అన్నారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ అంబేద్కర్ అందరివాడని.. ఆయన ఆలోచనలను మనం ఆచరించి చూపాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా భీమ్ యాత్రను ప్రారంభించారు. ఎమ్మెల్యేను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మేయర్ కొల గాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, ఆర్డీవో మహేశ్వర్, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## సర్పంచ్ వినూత్న పథకం

- ఆడపిల్ల పుడితే ప్రోత్సాహం

ముద్ర ప్రతినిధి, నిర్మల్:

ఆడపిల్లల తల్లిదండ్రులకు భరోసా కల్పించే వినూత్న పథకాన్ని అంబేద్కర్ జయంతి సందర్భంగా అమలు చేస్తున్నారు నిర్మల్ రూరల్ అనంతపేట్ సర్పంచ్ సునీత. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆమె మంగళవారం "మా ఊరి బంగారు తల్లి" అనే కొత్త పథకాన్ని ప్రకటించి అమలు చేశారు. ఇందులో భాగంగా ఊరిలో ఆడపిల్ల పుట్టగానే పాప పేరిట బ్యాంకు ఖాతాలో రూ.5 వేలు జమ చేయడంతో పాటు తల్లిదండ్రులకు రెండు శ్రీగంధం మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ ఆడపిల్లల పట్ల సమాజంలో గౌరవం పెంచేందుకే తాను ఈ కార్య క్రమాన్ని చేపట్టినట్లు వివరించారు.



## అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్లు ఆవిష్కరణ

ముద్ర ప్రతినిధి, నిర్మల్:




అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా నిర్వహించనున్న కార్యక్రమాలకు శ్రీకారం చుడుతూ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మంగళవారం క్యాంపు కార్యాలయంలో పోస్టర్లను ఆవిష్కరించారు. అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు జరగనున్న వారోత్సవాలను సమర్ధవంతంగా, ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి ప్రభాకర్, అధికారులు శివాజీ తదితరులు పాల్గొన్నారు.

## అగ్నిమాపక సిబ్బందికి సన్మానం

కోరుట్ల, ముద్ర:




అగ్నిమాపక దినోత్సవం సందర్భంగా మంగళవారం కోరుట్ల వాసవి సీనియర్ సిటిజన్ క్లబ్ ఆధ్వర్యంలో అగ్నిమాపక సిబ్బందిని శాలువాతో సన్మానించి జ్ఞాపికలను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనుషుల ప్రాణాల్ని కాపాడడంలో ప్రముఖ పాత్ర వహిస్తారని అన్నారు. ఈ సందర్భంగా ప్రమాదం జరిగినప్పుడు ఉపయోగించే పరికరాల గురించి అగ్నిమాపక సిబ్బంది వివరించారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ జోనల్ చైర్మన్ నీలి శ్రీనివాస్, వాసవి క్లబ్ సీనియర్ సిటిజన్ అధ్యక్షులు కొత్త గణేష్, కోశాధికారి శక్కరి వెంకటేశ్వర్, ఉపాధ్యక్షులు శక్కరి అశోక్, వనిత క్లబ్ అధ్యక్షులు ఎలుగూరి భాగ్య, మౌనిక, గౌతమి, తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ జిల్లా టాపర్ కు సన్మానం


మహాదేవపూర్, ముద్ర:



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ఫలితాలలో జిల్లా టాపర్‌గా నిలిచిన సువైబా తస్నీమ్ ను సర్పంచ్ హసీనా భాను, కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించారు. ఈ విజయం విద్యార్థులకు ప్రేరణగా నిలవాలని సర్పంచ్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తుం గల శ్రీజ సంతోష్, మాజీ దేవస్థాన చైర్మన్ వామన్ రావు, మాజీ జెడ్పీటీసీ చల్ల తిరుపతయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కట్కం అశోక్, మాజీ ఎంపీటీసీ ఆకు తోట సుధాకర్, గ్రామపంచాయతీ పాలక వర్గ సభ్యులు, కళాశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శికి సన్మానం

మహదేవపూర్, ముద్ర:



భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన మాజీ ఎంపీటీసీ, అకుతోట సుధాకర్ ను సర్పంచ్ హసీనాభాను అక్బర్ ఖాన్, వార్డు మెంబర్లు సన్మానించారు. తనపై నమ్మకం ఉంచి నియమించినందుకు ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబుకు అకుతోట సుధాకర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీజ, గడ్డం స్వామి, అస్రార్ ఖురేషి, నయూమొద్దీన్, యూత్ కాంగ్రెస్ నాయకులు కటకం అశోక్, మాజీ సింగిల్ విండో చైర్మన్ చల్ల తిరుపతిరెడ్డి, కాళేశ్వరం దేవస్థానం మాజీ చైర్మన్ వామన్ రావు, అజ్మత్ లతోపాటు పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు.


## బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

కోరుట్ల, ముద్ర:

గత కొంతకాలంగా కోరుట్ల పట్టణంలోని వ్యాపారవేత్తలను చంపుతానని బెదిరిస్తూ బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్న విత్తనాల నాగరాజు అనే రౌడీ షీటర్ ను ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు, మెట్టుపల్లి డీఎస్పీ ఏ రాములు ఆధ్వర్యంలో, మంగళవారం కోరుట్ల పట్టణంలో అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ సురేష్ బాబు మాట్లాడుతూ గతంలో విత్తనాల నాగరాజుపై రెండు మర్డర్ కేసులు, ఎక్స్టార్షన్ కేసులు నమోదు చేసినట్లు, పీడీ యాక్ట్ నమోదు చేసి జైలుకు పంపినట్లు వెల్లడించారు. ఈ కేసులో విత్తనాల నాగరాజు తో పాటు మరొక నిందితుడు కూడా ఉన్నట్లు దర్యాప్తులో తేలిందని అన్నారు.. ప్రస్తుతం అతను పరారీలో ఉన్నాడని, త్వరలోనే పట్టుకుని అరెస్టు చేస్తామన్నారు. నాగరాజు అతని సహచరులతో సంబంధాలు ఉన్న ప్రతి ఒక్కరిపై ప్రత్యేక నిఘా పెట్టి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎవరైనా ఇలాంటి బెదిరింపులకు పాల్పడి బలవం తపు వసూలు చేస్తే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఎవరైనా భయభ్రాంతులకు గురిచేసిన, బెదిరించిన, నిర్భయంగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని సీఐ సురేష్ బాబు, ఎస్సై చిరంజీవి పేర్కొన్నారు.



## సీఎంతో సమావేశానికి తరలిన కాంగ్రెస్ నేతలు

● నామినేటెడ్ పదవులు తమకే దక్కాలని డిమాండ్

ముద్ర ప్రతినిధి, జగిత్యాల:

జగిత్యాల సీనియర్ కాంగ్రెస్ నాయకులు 70 మంది సీఎం రేవంత్ రెడ్డిని కలిసేందుకు మంగళవారం హైదరాబాద్ కు తరలి వెళ్లారు. ఇటీవలే మాజీ మంత్రి జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుల నియామకానికి నోటిఫికేషన్ రావడంతో సీనియర్లు, వలసవాదులు అంటూ నాయకుల మధ్య ఆధిపత్య పోరు రగిలింది. దీనిపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో భేటీ అయి తమకు న్యాయం చేయాలని కోరడంతో పాటు సీఎంతో సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఏర్పాటు చేసిన సమావేశం వాయిదా పడింది. దీంతో మంగళవారం సాయంత్రం మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌తో కలిసి సీఎం రేవంత్ రెడ్డి తో సమావేశం కానున్నారు. ఈ మేరకు రెండు బస్సుల్లో సీనియర్ కాంగ్రెస్ నాయకులు హైదరాబాదుకు పయనమయ్యారు. సీఎంతో సాయంత్రం 5 గంటలకు అపాయింట్ మెంట్ ఉండడంతో ఉదయం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కజంగి నందయ్య ఆధ్వర్యంలో నాయకులు వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా కష్టనష్టాలకు ఓర్చుకొని పార్టీ జెండా మోయడంతోపాటు పార్టీలో సీనియర్లమైన తమకు పార్టీ పదవులు, నామినేటెడ్ పదవులు దక్కాలని డిమాండ్ చేశారు. ఇదే విషయంపై చర్చిస్తామని పేర్కొన్నారు.




సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
15.04.2026 బుధవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



టాప్ ఏఐ: 5 DALL.E

వర్ణన ఆధారంగా ప్రత్యేకమైన చిత్రాలు సృష్టిస్తుంది.మార్కెటింగ్, సోషల్ మీడియా కోసం అనువైనది.






## అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి

ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :
అంబేద్కర్ సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేశారని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం తెలిపారు. మంగళవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135 జయంతి సందర్భంగా అంబేద్కర్ చౌరస్తా, అంబేద్కర్ విగ్రహం వద్ద, భువనగిరి పట్టణములో వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, స్థానిక సంస్థ ల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి, భువనగిరి ఆర్ డి ఓ కృష్ణా రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీ వాణి, వైస్ చైర్మన్ మంజుల, గ్రంధాలయ చైర్మన్ అవేజ్ చిస్తీ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేణుక బాబురావు, ప్రజా ప్రతినిధులు, యస్ .సి సంఘం సభ్యులు విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అంబేద్కర్ భారత రాజ్యాంగ రూపకర్తగా సామాజిక న్యాయం కోసం పోరాడిన మహానుభావుడు అని కొనియాడారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు మాట్లాడుతూ బడుగు, బలహీన, అణగారిన వర్గాల వారి కోసం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఎనలేని కృషి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈవో శోభారాణి, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి సాహితి , ప్రజా ప్రతినిధులు, ఎస్సీ సంఘ నాయకులు సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.




## రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి

ముద్ర, బీబీనగర్ :
కొత్తగూడెంలో జరిగే తెలంగాణ రైతు సంఘం 3వ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాటూరి బాలరాజు గౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం బీబీనగర్ మండలం జమీలాపేట గ్రామంలో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ఏప్రిల్ 23, 24, 25 తేదీల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెంలోజరిగే 3వరాష్ట్ర మహాసభ ల పోస్టర్ ను ఆయన ఆవిష్కరించారు. కొత్తగూడెం పట్టణంలో జరిగే మహాసభలకు ఆల్ ఇండియా కిసాన్ సభ అఖిల భారత అధ్యక్షులు అశోక్ ధావలే ,ప్రధాన కార్యదర్శి విజ్జు కృష్ణన్ తోపాటు జాతీయ రాష్ట్ర రైతు ఉద్యమ నాయకులు పాల్గొనే సభలను జయప్రదం చేయాలని పిలుపుచ్చారు. కార్యక్రమం లో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు రేసు రామచంద్రా రెడ్డి, కడారి బిక్షపతి, మరిపడిగ ఆంజనేయులు, కొలిచలమ కృష్ణ, బాలు నాయక్, ఆంజనేయులు, బోనాల పెంటయ్య, రామిడి బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.



## సాంప్రదాయ దుస్తులతో ఆలయాలకు వెళ్లాలి

ముద్ర, మోత్కూర్:
మోత్కూర్ మున్సిపాలిటీ పరిధిలోని అంగడి బజార్ లో శ్రీ అభయ వీరాంజనేయ స్వామి ఆలయానికి వచ్చే భక్తుల కు మోత్కూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ పల్లెర్ల వెంకన్న గుప్తా సుమారు 250 మంది భక్తులకు కాషాయం లుంగీ, టీ షర్టుల ను అందజేశారు. మంగళవారం శ్రీ అభయ వీరాంజనేయ స్వామి ఆలయంలో పారునంది సూరిబాబు శర్మ చేతుల మీదుగా భక్తులకు అందచేశారు.ఈ సందర్భంగా పురోహితుడు సూరిబాబు శర్మ మాట్లాడుతూ గుడికి సాంప్రదాయ దుస్తులతో వెళ్లాలి అనే భక్తి భావంతో కూడిన కార్యం వెంకన్న గుప్తా ముందుకు వచ్చి చేయడం చాలా శుభకరమని అన్నారు. కార్యక్రమంలో భక్తులు బుస్సా రవి గుప్తా, శ్ పోచం కన్నయ్య, ఏలే నగేష్ జిట్ట నరేష్, జల్దీ సత్యనారాయణ, పుల్కరం వేణు, శివ చారి పాల్గొన్నారు.




## బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్

ముద్ర, మోత్కూర్:
భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 135 వ జయంతిని పురస్కరించుకొని మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి మున్సిపల్ చైర్మన్ గడ్డం స్వప్న సోమ నర్సయ్య పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చైర్మన్ గడ్డం స్వప్న సోమ నర్సయ్య మాట్లాడుతూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి అహర్నిశలు కృషిచేసిన గొప్ప మహానుభావుడు అంబేద్కర్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ పల్లెర్ల వెంకన్న మున్సిపల్ కమిషనర్ సతీష్ కుమార్, కౌన్సిలర్లు కురిమిళ్ళ ప్రమీల, సుల్తాన్ స్వామి, కొండ శోభ, మొగ్గుళ్ళ అనురాధ, గనగానీ శైలజ, పన్నాల శ్రీవిద్య, బీసు శ్రీకాంత్, నల్ల మధు, కారుపోతుల వెంకన్న, మెంట రమణ మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీవారి నిత్య కళ్యాణోత్సవం

ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :
స్వర్ణ గిరి దివ్య క్షేత్రంలో శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి అర్చక స్వాములు స్వామి వారి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని శ్రీవారి వైభవోత్సవ మండపంలో వేదమంత్రాలతో మంగళ ధ్వనుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. సోమవారం ప్రాతఃకాలం అర్చక స్వాములు సుప్రభాత సేవతో నిత్య కైంకర్యాలు ఆరంభించారు. సుప్రభాతసేవ అనంతరం స్వామి వారికి సహస్ర నామార్చన సేవను ఘనంగా నిర్వహించారు. లోక కళ్యాణం కోసం అర్చక స్వాములు శ్రీ సుదర్శన నారసింహ హవనంను నిర్వహించారు.





అన్న ప్రసాద వితరణలో 3000 మందికి పైగా భక్తులు నిత్యాన్న ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం శ్రీ స్వామివారి తిరువీధి ఉత్సవ సేవను ఘనంగా నిర్వహించారు. తిరువీధి ఉత్సవ సేవ అనంతరం శ్రీ వేంకటేశ్వర స్వామి వారు దేదీప్యమానంగా వెలుగుతున్న సహస్రదీప కాంతుల మధ్య ఊయలలో ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు. అర్చక స్వాములు వేదమంత్రోచ్చారణలతో శ్రీ స్వామివారిని అర్చించి కర్పూర మంగళహారతులు సమర్పించారు.భక్తులు నయనానందకరంగా శ్రీవారిని దర్శించుకున్నారు.

# మహనీయుల స్ఫూర్తితో ఐక్యతను చాటుదాం

### ఘనంగా భీమ్ యాత్ర




ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :
మహనీయులు మహాత్మా జ్యోతిరావు ఫూలే, బాబాసాహెబ్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ స్ఫూర్తితో అణగారిన వర్గాల ఐక్యతను చాటుదామని మహనీయుల జయంతి ఉత్సవ కమిటీ నాయకులు అన్నారు. బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా మహనీయుల జయంతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన భీమ్ యాత్ర ప్రారంభం సందర్భంగా వారు మాట్లాడారు. సమాజంలో అసమానతలకు వ్యతిరేకంగా ప్రజలను సంఘటిత పరచి విద్యా ఆవశ్యకతను తెలిపిన మహనీయులను గుర్తు చేసుకోవాలని అన్నారు. యాత్ర హైదరాబాద్ చౌరాస్తా నుండి ప్రారంభమై నల్గొండ చౌరస్తా, జంఖాన్ గూడా, బాబు జగ్జీవన్ రామ్ చౌరస్తా, పాత బస్టాండ్ నుండి తిరిగి అంబేద్కర్ విగ్రహం వరకు కొనసాగింది. యాత్రలో బట్టు రాం చంద్రయ్య, నాగరం అంజయ్య, బర్రె జహం గీర్, దొనకొండ రాములు సురుపంగా శివలింగం, ఎండీ.ఇలియస్, కర్తల శ్రీనివాస్ ,ఇటుకల దేవేందర్, కుతడి సురేష్, నాగరం శంకర్, కనుకుంట్ల రమేష్ కోటి, చింతల శివ, వనం రాజు, కారుపటి రాజు, నరేష్, కౌన్సిలర్స్ తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తి మండలంలో...
అంబేద్కర్ జయంతి వేడుకలు తుంగతుర్తి మండలంలో ఘనంగా నిర్వహించారు. రాజకీయ, ప్రజా సంఘాలు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యార్థి ఉపాధ్యాయ సంఘాలు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా డిసిసి అధ్యక్షుడు గుడిపాటి నరసయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, సింగిల్ విండో చైర్మన్ గుడిపాటి సైదులు, బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు తాటికొండ సీతయ్య జిల్లా నాయకులు గుండ గాని రాములు గౌడ్, తడక రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక సమానత్వంతోనే కుల నిర్మూలన

- భారత రాజ్యాంగం పరిరక్షణ కోసం పోరాటం
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు యండి జహంగీర్




ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :
భూమి లేని పేదలందరికీ భూపంపిణీ జరిగి, అందరికి ఉపాధి కల్పించినప్పుడే ఆర్థిక సమానత్వం వస్తుందని ఆర్థిక సమానత్వం కుల నిర్మూలన జరుగుతుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు యండి జహంగీర్ తెలిపారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో మనువాదానికి వ్యతిరేకంగా భారత రాజ్యాంగం పరిరక్షణ కోసం అందరూ ఐక్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం భువనగిరిలోని సుందరయ్య భవనంలో సీపీఎం భువనగిరి మండల కమిటీ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు ఫూలే, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా 'భారత రాజ్యాంగం – సామాజిక న్యాయం' అనే అంశంపై సదస్సు నిర్వహించగా ఈ సదస్సు ముఖ్య అతిథిగా జహంగీర్ పాల్గొని మాట్లాడారు. ఈ సదస్సుకు పార్టీ మండల కార్యదర్శి పల్లెర్ల అంజయ్య అధ్యక్షత వహించగా జిల్లా కమిటీ సభ్యులు దయ్యాల నర్సింహ, గడ్డం వెంకటేష్, మండల కార్యదర్శివర్గ సభ్యులు ఏదునూరి మల్లేశం, అన్నంపట్ల కృష్ణ, కొండమడుగు నాగమణి, మండల కమిటీ సభ్యులు మోటె ఎల్లయ్య, కొండపురం యాదగిరి, మధ్యపురం బాల్ నర్సింహ, రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి వడ్డెబోయిన వెంకటేష్, ఎన్.పి. ఆర్.డి జిల్లా అధ్యక్షులు సురుపంగ ప్రకాష్, శాఖ కార్యదర్శులు ఏదునూరి వెంకటేష్, మచ్చ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# మహోన్నత వ్యక్తి అంబేద్కర్

- చదువుతోనే అభివృద్ధి సాధ్యం
- సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



ముద్ర, సూర్యాపేట:
బడుగు, బలహీన వర్గాల జీవితాల్లో మార్పు తెచ్చిన మహోన్నత వ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. మంగళవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135 వ జయంతి సందర్భంగా జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఖమ్మం క్రాస్ రోడ్ వద్ద ఏర్పాటు చేసిన జయంతి ఉత్సవాలకు అయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఖమ్మం క్రాస్ రోడ్ కూడలిలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యాభ్యాసం నుండి కుల వివక్షత ఎదుర్కొన్నారని, అలాంటి వివక్షతను తొలగించాలన్న ఆలోచనతో చాలా మార్పులు వచ్చాయని తెలిపారు. ప్రజా సంక్షేమం, ప్రజా అభివృద్ధికి హక్కులు కల్పించే లక్ష్యంతో బడుగు బలహీన వర్గాల వారికి సమాన హక్కులు సాధించాలన్న ధ్యేయంతో రాజ్యాంగాన్ని నిర్మించిన అంబేద్కర్ కు రుణపడి ఉండాలని అన్నారు. జిల్లా ఎస్పీ కె నరసింహ మాట్లాడుతూ.. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ప్రపంచ మేధావి అని, గొప్ప మహనీయుడు, అని కొనియాడారు. బడుగు, బలహీన, మైనారిటీ వర్గాలతో పాటు స్త్రీలకు కూడ అనేక హక్కులు కల్పించారన్నారు. మున్సిపల్ చైర్మన్ మొరిశెట్టి నివేదిత మాట్లాడుతూ.. బడుగు, బలహీన, అణగారిన వర్గాల వారి కోసం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఎనలేని కృషి చేశారని మహిళా రిజర్వేషన్లు, మహిళలు చదువుకోవడానికి కూడా అనేక అవకాశం కల్పించారన్నారు. జిల్లా షెడ్యూలు కులాల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలలో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు జిల్లా కలెక్టర్, ఎస్పీ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, ఆర్డీవో జయప్రకాశ్ రెడ్డి, ఎస్సీ సంక్షేమ అధికారి కొల్లి లత, మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి, వైస్ చైర్మన్ షఫీ ఉద్దీన్, జిల్లా అధికారులు, సూర్యాపేట తాసిల్దార్ కృష్ణయ్య, ఏఐసీసీ సభ్యులు రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, డిసిసి జిల్లా ప్రెసిడెంట్ గుడిపూడి నరసయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ, సీనియర్ జర్నలిస్ట్, గోల్డ్ మెడలిస్ట్ డాక్టర్ కృష్ణ బంటు, నాయకులు , చింతలపాటి చిన్న శ్రీరాములు, జీడి బిక్షం, ఎర్ర వీరస్వామి, ములకలపల్లి రాములు, డాక్టర్ రామ్మూర్తి, పల్లెటి లక్ష్మణ్, టిఎన్జీవోస్ సెక్రటరీ దున్న శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



## అంబేద్కర్ కు ఘన నివాళి

ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :
తాజ్ పూర్ గ్రామ సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా రూరల్ సీఐ చంద్రబాబు, ఎస్ హెచ్ఓ అనీల్ కుమార్ పాల్గొని నివాళులు అర్పించారు. సామాజిక వేత్త డా, ర్యాకల శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి బి. నరేందర్, ఉపసర్పంచ్ వరిగంటి కృష్ణ, మాజీ సర్పంచ్ లు, అన్ని కుల సంఘాల నాయకులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

వట్టిమర్తిలో..
చిట్యాల : అంబేద్కర్ ఆశయ సాధనకు యువత కృషి చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్ అన్నారు. చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం,కెవిపియస్ జిల్లా నాయకులు బొడ్డు బాబురావు, బెల్లపు హరిబాబు, సిరిపంగి యాదయ్య, బూరుగు విజయ్ కుమార్, డివైఎఫ్ ఐ జిల్లా నాయకులు బూరుగు గోపికృష్ణ, సిపిఎం నాయకులు కొంపెల్లి రమేష్,నర్రా బిక్షం రెడ్డి, బూర్గు యాదయ్య ,బూర్గు అజయ్ కుమార్, బూర్గు శ్రీనివాస్ ఉపధ్యక్షులు కొంపెల్లి భరత్ పాల్గొన్నారు.





## హక్కుల సాధకుడు అంబేద్కర్

ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :
అన్ని వర్గాలకు హక్కులను సాధించిన ధీరుడు డాక్టర్ బీఆర్. అంబేద్కర్ అని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వద్ద జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం అధ్యక్షులు దర్గాయి హరి ప్రసాద్, పచ్చల కట్ట సోమేశ్వరాలయం చైర్మన్ కొల్లూరి రాజు, 22వ వార్డు కౌన్సిలర్ జాలిగం విగ్నేష్, యువజన కాంగ్రెస్ నాయకులు పడిగల రేణుక ప్రదీప్ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తంగేళ్లపల్లి శ్రీవాణి రవికుమార్, పీసీసీ ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్ కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండి అవేష్ చిస్తి, వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల వెంకటేశ్వర్లు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కూర వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. వర్ణన ఆధారంగా ప్రత్యేకమైన చిత్రాలు సృష్టిస్తుంది. మార్కెటింగ్, సోషల్ మీడియా కోసం అనువైనది.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
15.04.2026 బుధవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



టాప్ ఏఐ 7. Grammarly
వ్యాకరణం, స్పెల్లింగ్ దోషాలను సరిచేస్తుంది. ప్రొఫెషనల్ కమ్యూనికేషన్‌లో ఉపయోగకరం.



## వడదెబ్బకు జాగ్రత్తలు అవసరం

- కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచనలు



**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

వేసవిలో ఎండ తీవ్రత దృష్ట్యా వడదెబ్బ తగలకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు. తీవ్ర వడగాలులు నమోదవుతున్న నేపథ్యంలో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వడదెబ్బ కారణంగా ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలు పడకుండా ఉండేందుకు జిల్లా పరిపాలన సమగ్ర కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో తాగునీటి సరఫరా, చలివేంద్రాల ఏర్పాటు, ఆరోగ్య కేంద్రాలలో అవసరమైన మందులు, ఓఆర్ఎస్ నిల్వలు, బహిరంగ ప్రదేశాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం వంటి చర్యలు చేపట్టినట్లు వివరించారు. ముఖ్యంగా కార్మికులు, వృద్ధులు, పిల్లలు, గర్భిణులు వంటి సున్నిత వర్గాల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు వెళ్లవద్దని సూచించారు. పుష్కలంగా నీరు, మజ్జిగ, కొబ్బరి నీళ్లు వంటి ద్రవ పదార్థాలు తీసుకోవాలని, తేలికపాటి దుస్తులు ధరించాలని సూచించారు. వడదెబ్బ లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని కోరారు. అలాగే జిల్లా వ్యాప్తంగా బస్ స్టాండ్లు, మార్కెట్లు, పని స్థలాల్లో తాగునీరు, నీడ సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.

## రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

- రాజ్యాంగం సూచించిన విధంగా పేదలకు హక్కులు కల్పించాలి
- 21న కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా విజయవంతం చేయాలి



**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**

రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా రెడ్డిల్లో ఉన్న పేదలకు అన్ని హక్కులు కల్పించాలని రెడ్డి సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని రెడ్డి సంఘాల నాయకులతో కలిసి బుధవారం సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రెడ్డిల్లో అనేక మంది పేదలు ఉన్నారని, ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు వారికి కూడా అందాలన్నదే తమ లక్ష్యమని తెలిపారు. గత ప్రభుత్వంలో కూడా రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినా, అది నెరవేరలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. రెడ్డిల్లో ఉన్న పేదవారికి అండగా నిలబడాలని కోరారు. రెండేళ్ల క్రితమే రెడ్డి కార్పొరేషన్ కోసం కేబినెట్‌లో ఆమోదం పొందినా, ఇప్పటివరకు నిధులు కేటాయించలేదన్నారు. రిజర్వేషన్ పొందే వారితో తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, కానీ రెడ్డిల్లో ఉన్న పేదలకు సరైన సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్పొరేషన్ ఏర్పాటు కోసం ఎన్నో పోరాటాలు చేశామని తెలిపారు. ఈ నెల 21న సిద్దిపేట కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వహించబోయే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్పొరేషన్ సాధించే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

## అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**



అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా కలెక్టరేట్‌లో అడిషనల్ కలెక్టర్ మెంచు నగేష్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అగ్నిప్రమాదాల నివారణలో ప్రజల్లో అవగాహన చాలా ముఖ్యమని, ప్రతి ఒక్కరూ అగ్ని భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఇళ్లలో, కార్యాలయాల్లో, వాణిజ్య సముదాయాల్లో అగ్నిప్రమాదాల నివారణకు అవసరమైన భద్రతా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా అగ్నిమాపక అధికారి జి. వేణు మాట్లాడుతూ, ఈ నెల 14 నుండి 20 వరకు అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా జిల్లాలో వివిధ అవగాహన కార్యక్రమాలు, మాక్ డ్రిల్స్, భద్రతా ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

## ఆర్టిజన్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మ దేవేందర్ రెడ్డి డిమాండ్




**ముద్ర ప్రతినిధి, మెదక్:**

విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మాజీ డిప్యూటీ స్పీకర్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎం. పద్మ దేవేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. మెదక్ జిల్లా కేంద్రంలో గత ఏడు రోజులుగా కొనసాగుతున్న ఆర్టిజన్ కార్మికుల సమ్మెలో పాల్గొని బీఆర్ఎస్ పార్టీ తరఫున కార్మికులకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని, విద్యుత్ కార్మికుల సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని కోరారు. ఇప్పటికే వారం రోజులుగా సమ్మె కొనసాగుతున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు. విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క వెంటనే స్పందించి కార్మికులను చర్చలకు ఆహ్వానించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, పట్టణ పార్టీ కన్వీనర్, కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు, న్యాయవాది జీవన్ రావు, మున్సిపల్ కౌన్సిలర్లు దీపక్ కుమార్, జుబేర్ అహ్మద్, ఉదయ్ కుమార్, మెదక్ మండల పార్టీ అధ్యక్షులు ఎం. అంజాగౌడ్, నాయకులు పూసల సంతోష్, సునీల్, ఇందాద్, మోహన్, మహిళా నాయకురాలు చంద్రకళ, రాధ, విద్యుత్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# బడుగు వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్

- నివాళులర్పించిన కలెక్టర్ ప్రతిమా సింగ్, ఎస్పీ శ్రీనివాసరావు





**ముద్ర ప్రతినిధి, మెదక్:**

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అని కలెక్టర్ ప్రతిమా సింగ్ పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను మంగళవారం మెదక్ జిల్లా కేంద్రం రాందాస్ చౌరస్తా, కలెక్టరేట్‌లో ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించగా, కలెక్టర్ ప్రతిమా సింగ్, ఎస్పీ డీ.వి. శ్రీనివాసరావు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ, భారత రాజ్యాంగ నిర్మాత, షెడ్యూల్డ్ కులాల మార్గదర్శకుడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆలోచనలు, ఆశయాలు స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. ప్రపంచంలో చిన్న చిన్న దేశాలు సాధించని స్వేచ్ఛ భారతదేశం సాధించిందంటే అది డాక్టర్ అంబేద్కర్ కృషి ఫలితమని పేర్కొన్నారు. ఎస్పీ డీ.వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ, రాజ్యాంగం స్వేచ్ఛను, సమానత్వాన్ని ప్రసాదించిందని, సమాజంలో ప్రజలందరూ ఆనందంగా జీవించేందుకు దోహదపడిందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, మెదక్ ఆర్డీఓ రమాదేవి, మున్సిపల్ చైర్‌పర్సన్ కానుగు రాధిక, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, డీఎస్పీ ప్రసన్నకుమార్, జిల్లా రవాణా శాఖ అధికారి వెంకటస్వామి, ఎస్సీ కార్పొరేషన్ అధికారి, డిఆర్డిఓ శ్రీనివాసరావు, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిఎఫ్ఓ జోజి, తహసీల్దార్ లక్ష్మణ్ బాబు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా పరిశ్రమల అధికారి ప్రకాష్ రావు, అంబేద్కర్ ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షులు ఆకుల పెంటయ్య, కమిటీ చైర్మన్ దుబాషి సంజీవ్, వైస్ చైర్మన్ గరుగుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్, కార్యదర్శి నాగరాజు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

**పురపాలక సంఘంలో**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా పురపాలక సంఘ కార్యాలయ ఆవరణలో చైర్‌పర్సన్ కానుగు రాధిక భూపతి రాజు నివాళులు అర్పించారు. వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్లు, మెప్మా ఆర్పీలు, స్వయం సహాయక సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

**బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో**

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చేసిన సేవలు చిరస్మరణీయమని మాజీ డిప్యూటీ స్పీకర్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎం. పద్మ దేవేందర్ రెడ్డి అన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా మెదక్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో కలిసి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అకిరెడ్డి కృష్ణారెడ్డి, పట్టణ పార్టీ కన్వీనర్, కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు, న్యాయవాది జీవన్ రావు, మున్సిపల్ కౌన్సిలర్లు దీపక్ కుమార్, సంధ్య నవీన్, ఉదయ్ కుమార్, గౌస్, సోహెల్, జుబేర్ అహ్మద్, మహిళా నాయకురాలు అంకం చంద్రకళ, రాధ, నాయకులు కిష్ట గౌడ్, అంజాగౌడ్, కిష్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

**ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో**

భారత రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్ అడుగుజాడల్లో నడవాలని మెదక్ మున్సిపల్ చైర్‌పర్సన్ కానుగు రాధిక భూపతి రాజు పిలుపునిచ్చారు. మెదక్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పట్టణ పార్టీ అధ్యక్షులు ఎం. గంగాధర్ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. చైర్‌పర్సన్ కానుగు రాధిక భూపతి రాజు మాట్లాడుతూ డాక్టర్ అంబేద్కర్ చేసిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి అపారమని కొనియాడారు. సమానత్వం, సామాజిక న్యాయం సాధనలో అంబేద్కర్ చూపిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, కౌన్సిలర్లు ఎండి మన్సూర్ అహ్మద్, అరుణ సిద్దిరాములు, గంట సంపత్, హరిత నర్సింగ్ రావు, శశాంక్, అవారి రాజశేఖర్, తొడుపునూరి శివరామకృష్ణ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాగి అశోక్, నాయకులు బొజ్జ పవన్, సయ్యద్ ఉమర్, తదితరులు పాల్గొన్నారు.






**సిద్దిపేటలో ఘనంగా అంబేద్కర్ జయంతి ఉత్సవాలు**

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**

సిద్దిపేట జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మంగళవారం జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో భారతరత్న డా. బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు, కలెక్టర్ కె. హైమావతి, సీపీ సాధన రష్మీ పెరుమాళ్, ఏసీఎల్బీ అబ్దుల్ రహమాన్, డీఆర్ఓ నాగరాజమ్మ, ఆర్డీఓ సదానందం తదితరులు పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం సభ వేదికపై అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో భాగంగా ప్రజల ప్రగతి ప్రణాళికలో భాగంగా మూడవ వారంలో 'అరైవ్ అలైవ్' కార్యక్రమం కింద రహదారి భద్రతపై ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గొప్ప నాయకుడిగా ఎదగడం ఒక్కరోజులో సాధ్యం కాదని, ఎన్నో కష్టాలను అధిగమిస్తూ క్రమశిక్షణతో ముందుకు సాగాల్సి ఉంటుందన్నారు. బంగారం, ఇనుములతో నగలు, వస్తువులు తయారు చేయడంలో ఎంత కఠిన శ్రమ అవసరమో, అదే విధంగా మనం ఉత్తమ వ్యక్తులుగా ఎదగడానికి కృషి చేయాలని సూచించారు. అంబేద్కర్ సామాజికంగా, ఆర్థికంగా ఎన్నో అవమానాలను ఎదుర్కొన్నప్పటికీ, తన సంకల్పంతో ఉన్నత స్థాయికి ఎదిగి కోట్లాది మందికి స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. భారత రాజ్యాంగంలో పౌరులకు ఉన్నతమైన హక్కులను కల్పించి, అన్ని వర్గాల ప్రజలకు సమాన ఓటు హక్కు అందించి ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసిన మహనీయుడని పేర్కొన్నారు. అంబేద్కర్ కేవలం ఒక వర్గానికి చెందిన వ్యక్తి కాదని, సమాజంలోని అన్ని వర్గాల అభివృద్ధి కోసం కృషి చేసిన మహోన్నత నాయకుడని అన్నారు. ఆయన సేవలను గుర్తించి భారత ప్రభుత్వం "భారతరత్న" పురస్కారం అందజేసిందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సీపీ సాధన రష్మీ పెరుమాళ్ మాట్లాడుతూ, అంబేద్కర్ చూపిన మార్గాన్ని అనుసరించి సమసమాజ నిర్మాణానికి కృషి చేయాలని అన్నారు. ఆయన జీవితంలో ఉన్న మంచి విలువలను స్వీకరించి ప్రతి ఒక్కరూ సమాజ సేవలో ముందుండాలని సూచించారు. ఏసీఎల్బీ అబ్దుల్ రహమాన్ మాట్లాడుతూ.. అంబేద్కర్ జీవితంలో నుంచి ఓర్పు, పట్టుదల, బాధ్యత వంటి గుణాలను అలవరచుకోవాలని తెలిపారు. అనంతరం ఎస్సీ వెల్ఫేర్ స్కూల్ విద్యార్థిని కళాంజలి ప్రార్థిని (లిటిల్ మిస్ ఇండియా రన్నర్అప్)ను శాలువాతో సత్కరించారు. కులాంతర వివాహం చేసుకున్న వారికి ప్రోత్సాహకాలు అందజేశారు. అలాగే అంబేద్కర్ జయంతి సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన వారికి నగదు బహుమతులు, క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు పి. రాములు, సాకీ ఆనంద్, కె. రవీందర్, బయ్యారం ఇస్తారి, లింగంపల్లి శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, సంఘ నాయకులు మరియు ప్రజలు పాల్గొన్నారు.

## అతివేగం, నిర్లక్ష్యంతోనే రోడ్డు ప్రమాదాలు

- ప్రమాదాల నివారణపై ప్రతిజ్ఞ, సెల్ఫీ పాయింట్ ప్రారంభం
- కలెక్టర్ ప్రతిమా సింగ్







**ముద్ర ప్రతినిధి, మెదక్:**

ప్రస్తుత సమాజంలో అతివేగం, నిర్లక్ష్యంతో వాహనాలు నడపడం వల్ల ఎందరో తమ విలువైన ప్రాణాలను కోల్పోతున్నారని, ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నిబంధనలు పాటిస్తూ ప్రమాదాలను నివారించాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించే ఉద్దేశంతో 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా, మెదక్ రాందాస్ చౌరస్తాలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా జిల్లా అధికారులు, ఆటో డ్రైవర్లు, విద్యార్థుల సమక్షంలో రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రతిజ్ఞ నిర్వహించారు. అనంతరం సెల్ఫీ పాయింట్‌ను ప్రారంభించి మాట్లాడారు. ప్రజల్లో చైతన్యం పెంచి రోడ్డు ప్రమాదాలను తగ్గించాలని సూచించారు. ఎస్పీ డీ.వి. శ్రీనివాసరావు మాట్లాడుత.., మనం తీసుకునే జాగ్రత్తలతోనే రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా ఉండగలమన్నారు. పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, రవాణా శాఖ అధికారులు రోడ్డు ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రాణాల కంటే విలువైనది ఏదీ లేదని, చిన్న చిన్న జాగ్రత్తలు ప్రతి ఒక్కరూ పాటించాలని తెలిపారు. గ్రామాల్లో అత్యవసర పరిస్థితుల్లో సంప్రదించాల్సిన అంబులెన్స్, పోలీసుల నంబర్లపై అవగాహన కల్పించాలని సూచించారు. అందరి భాగస్వామ్యంతోనే రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పడతాయని, ప్రతి ఒక్కరూ రోడ్డుపైకి వచ్చినప్పుడు బాధ్యతతో మెలగాలని సూచించారు. అనంతరం జరిగిన ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డీఓ రమాదేవి, మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, డీఎస్పీ ప్రసన్నకుమార్, జిల్లా రవాణా శాఖ అధికారి వెంకటస్వామి, డిఆర్డిఓ శ్రీనివాసరావు, నేషనల్ హైవే ఈఈ కరుణ, డీఈ ప్రవీణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కలెక్టరేట్ కార్యాలయం ముందు నేషనల్ హైవే 765డీజీ రోడ్డు మరమ్మత్తులు జరుగుతున్న ప్రాంతాన్ని కలెక్టర్, ఎస్పీ, నేషనల్ హైవే అధికారులు, పోలీసు యంత్రాంగంతో కలిసి పరిశీలించారు. నేషనల్ హైవే అధికారులకు పలు సూచనలు చేస్తూ త్వరితగతిన మరమ్మత్తులు పూర్తి చేసి పునరుద్ధరించాలని ఆదేశించారు. వాహన చోదకులకు సురక్షిత ప్రయాణం అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. వేగాన్ని నియంత్రించే రక్షణ చర్యలు చేపట్టి ప్రమాదాల నివారణ లక్ష్యంగా పనిచేయాలని తెలిపారు.

## పెన్షనర్లకు లైఫ్ సర్టిఫికెట్ సమర్పణ తప్పనిసరి

- రిటైర్డ్ ఉపాధ్యాయుడు కాచం శ్రీనివాస్

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**



ప్రభుత్వం అందిస్తున్న ఉచిత సేవలను రిటైర్డ్ ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని, ఈ నెల 17లోపు పెన్షనర్లు తమ లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాలని రిటైర్డ్ ఉపాధ్యాయుడు కాచం శ్రీనివాస్ సూచించారు. మంగళవారం సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని రకాల పెన్షనర్లు తమ లైఫ్ సర్టిఫికెట్‌ను సమర్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ రిటైర్డ్ పెన్షనర్లతో పాటు బీడీ కార్మికుల పెన్షనర్లు కూడా తప్పనిసరిగా లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాలన్నారు. పెన్షన్ పొందుతున్న ప్రతి లబ్ధిదారు నిర్దేశించిన గడువు లోపు లైఫ్ సర్టిఫికెట్ సమర్పించకపోతే వారి పెన్షన్ నిలిచిపోవచ్చన్నారు. ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ముందుగానే ఈ ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న వివిధ ఉచిత సేవలను కూడా రిటైర్డ్ ఉద్యోగులు వినియోగించుకోవాలన్నారు. అధికారులు ఇచ్చిన గడువును గౌరవిస్తూ ప్రతి పెన్షనర్ తమ బాధ్యతగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. పెన్షనర్లు ఏదైనా అవసరం ఉంటే సంప్రదించాలని కోరారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
15.04.2026 బుధవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews

9 జనరల్ న్యూస్
GENERAL NEWS

టాప్ ఏఐ 7. Grammarly
వ్యాకరణం, స్పెల్లింగ్ దోషాలను సరిచేస్తుంది. ప్రొఫెషనల్ కమ్యూనికేషన్‌లో ఉపయోగకరం.
grammarly

## జేఎన్టీయూ మూసాపేట్ మార్గంలో ట్రాఫిక్ కష్టాలకు చెక్

**క్షేత్రస్థాయిలో సీపీ పరిశీలన**

**ముద్ర, కూకట్‌పల్లి :**



నగరంలోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ రద్దీని క్రమబద్ధీకరించేందుకు సైబరాబాద్ పోలీస్ విభాగం నడుం బిగించింది. మంగళవారం సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మొహంతి, ట్రాఫిక్ డీసీపీ హర్షవర్ధన, ఏసీపీలతో కలిసి జేఎన్టీయూ జంక్షన్ నుంచి మూసాపేట్ వైజంక్షన్ వరకు రహదారులను కాలినడకన పరిశీలించారు. ఈ క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా జేఎన్టీయూ, కేపీహెచ్‌బీ, మూసాపేట్ ప్రాంతాల్లో నెలకొంటున్న ట్రాఫిక్ సమస్యలపై అధికారులతో చర్చించారు. వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగిస్తున్న బాటిల్ నెక్స్ పాయింట్లు, అడ్డదిడ్డంగా ఉన్న డివైడర్లు, యూటర్న్ల వద్ద మార్పులు చేయాలని సీపీ ఆదేశించారు. అవసరమైన చోట్ల రోడ్డు కరెక్షన్లు చేపట్టాలని ఇంజనీరింగ్ విభాగాలకు సూచించారు. వాహనదారులు ఇబ్బంది పడకుండా సిగ్నల్ వ్యవస్థను, జంక్షన్ల డిజైన్లను మెరుగుపరచాలని తెలిపారు. స్థానిక కేపీహెచ్‌బీ ఎస్ హెచ్వో, ట్రాఫిక్ ఎస్ హెచ్వో లు నిరంతరం పర్యవేక్షిస్తూ ట్రాఫిక్ సాఫీగా సాగేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ, కేపీహెచ్‌బీ లా అండ్ ఆర్డర్ ఎస్ హెచ్ ఓ, ట్రాఫిక్ ఎస్ హెచ్వో, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ప్రజల ప్రయాణ సమయాన్ని తగ్గించడమే లక్ష్యంగా ఈ మార్పులు చేపడుతున్నట్లు అధికారులు వెల్లడించారు.

## అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో తోపులాట

- **శిలాఫలకంపై ఎంపీ పేరు చిన్నగా ఉండడంతో నాయకుల మండిపాటు**

**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:**



అంబేడ్కర్ విగ్రహావిష్కరణ శిలాఫలకంపై ఎంపీ డీకే అరుణ పేరు చిన్నగా ఉండడంపై బీజేపీ నాయకులు తీవ్రస్థాయిలో అభ్యంతరం వ్యక్తం చేయడం, వారిని పోలీసులు అడ్డుకోవడంతో కొంతసేపు పోలీసులకు, నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కొండాపురం గ్రామంలో నిర్వహించిన అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో బీజేపీ జిల్లా యువ నాయకురాలు డికె. స్నిగ్ధా రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, కౌన్సిల్ మేంబర్ బండల వెంకట రాములు, మండల నాయకులు పాల్గొని, అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విగ్రహావిష్కర కార్యక్రమం కూడా రాజకీయ లబ్ధి కోసం వాడుకోవడం అత్యంత విచారకరమని విమర్శించారు. విగ్రహ ఏర్పాటుకు ఎంపీ డీకే అరుణ తన వంతుగా ఆర్థికసాయం అందించిందని, ఆమె పేరు చిన్న అక్షరాలతో లిఖించడం దారుణమని మండిపడారు. విగ్రహ ఏర్పాటుకు చిల్లిగవ్వ ఇవ్వని నేతల పేర్లు శిలాఫలకంపై పెట్టడం హాస్యస్పదంగా ఉందన్నారు. ఎంపీ డీకె అరుణను అగౌరవపరిచేలా అధికార పార్టీ నాయకులు వ్యవహరించారని ఆరోపించారు. కార్యక్రమంలో కేటీ దొడ్డి మండలాధ్యక్షుడు శ్రీపాదరెడ్డి, ఓబీసీ ప్రెసిడెంట్ ముంగిలి వీరేష్, ఉప సర్పంచ్ ఎల్ చిన్న భీమ్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

## అణగారిన వర్గాలకు సమాన అవకాశాలు అంబేద్కర్ చలవే

**-స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్**

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**



అణగారిన వర్గాల ప్రజలు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాలలో సమాన అవకాశాలను కల్పించింది అంబేద్కర్ ప్రసాదించిన రిజర్వేషన్లు కారణమని తెలంగాణా రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్‌అన్నారు. మంగళవారం వికారాబాద్ రైల్వే స్టేషన్ దగ్గర ఉన్న అంబేద్కర్ జయంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించి మాట్లాడారు. అంబేద్కర్ అనేది ఒక పేరు కాదు, అది ఈ దేశ ప్రజల జీవన రేఖ అని అన్నారు. దళిత, బడుగు బలహీన వర్గాల జీవితాలకు వెలుగును ఇచ్చిన సూర్యుడు అంబేద్కర్ అని కొనియాడారు. రాజ్యాంగం వల్లనే తాను శాసనసభ సభాపతి అయ్యానని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో శాసనసభ సభాపతి స్థానంలో ఉండగా తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ అమలు ప్రారంభించామన్నారు. పార్లమెంటు సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ దేశానికి దిక్కు చూపిన, కుల మతాల కతీతంగా సామాజిక న్యాయం కోసం పోరాడిన మహానుబావుడు డాక్టర్ అంబేద్కర్ అని, ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరు సమాజ అభివృధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా ఎస్ పి స్నేహ మెహ్రా, అడిషనల్ కలెక్టర్ ఉమాశంకర్, మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం అనన్య, జడ్ పి సిఈఓ సుధీర్, మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ అర్ధ సుధాకర్ రెడ్డి, కౌన్సిలర్లు, ఉత్సవ కమిటీ సభ్యులు రామచందర్, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## ఆధునిక ఆవిష్కరణలకు క్వాంటం టెక్నాలజీ కీలకం

**ముద్ర, అమరావతి**

పారిశ్రామిక రంగానికి విద్యుత్, డిజిటల్ యుగానికి ఇంటర్నెట్, ఆధునిక ఆవిష్కరణలకు క్వాంటం టెక్నాలజీ కీలకమని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. అమరావతిలో దేశంలోని తొలి క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీని ప్రారంభించిన అనంతరం ఆయన ప్రసంగించారు. ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో 1 ఎస్ ఓపెన్ యాక్సెస్ క్వాంటం ఫెసిలిటీ, మేథాటవర్స్‌లో 1 క్యూ పేరిట మరో క్వాంటం సిస్టం ఏర్పాటు చేశారు. విజ్ఞానమే సామాజిక ప్రగతికి చిహ్నం అని చెప్పిన అంబేద్కర్ జయంతి, ప్రపంచ క్వాంటం దినోత్సవం రోజు అమరావతిలో క్వాంటం చరిత్ర ప్రారంభించుకున్నామన్నారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు, పరిశోధకులు, విద్యార్థులు, ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అమరావతి క్వాంటం వ్యాలీ ఏర్పాటుకు ప్రోత్సహిస్తున్న ప్రధాని మోదీకి, ఏక్యూవీని వేగంగా పూర్తి చేయటంలో సహకరిస్తున్న కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్, కార్యదర్శి అభయ్ కరాండికర్ కు ధన్యవాదాలు తెలిపారు. అమరావతిలో ప్రారంభమైన 1ఎస్, 1క్యూ క్వాంటం హార్డ్‌వేర్ టెస్ట్‌బెడ్స్ క్వాంటం ఉపకరణాలను పరీక్షించేందుకు, సర్టిఫై చేసేందుకు కీలకంగా మారతాయన్నారు. క్వాంటం సాంకేతికతలో సాధికారిత సాధించిన దేశాలే భవిష్యత్తును శాసించే అవకాశం ఉంటుందన్నారు. భారతీయ పరిశోధకులకు క్వాంటం హార్డ్‌వేర్ పరీక్షించేందుకు అమరావతి క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీ కీలకంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎస్ఆర్ఎం యూనివర్సిటీలోని అమరావతి 1ఎస్ పరిశోధనలకు, మేధా టవర్స్‌లోని అమరావతి 1క్యూ పారిశ్రామిక వినియోగానికి తోడ్పడతాయన్నారు. ఈ రెండూ క్వాంటం టెక్నాలజీలో దేశ సామర్థ్యాన్ని పెంచాయని భావిస్తున్నానని అన్నారు.

# ఉత్తరాంధ్రలో మహానాడు..!

- **టీడీపీ పొలిటికల్ స్కెచ్ అదేనా..!**
- **గతేడాది కడప గడపలో మహాసంబరం నిర్వహించిన టీడీపీ**
- **ఈసారి ఉత్తరాంధ్ర సెంట్రిక్‌గా మహానాడు జరిపే ప్లాన్**
- **ఆ మూడు ఉమ్మడి జిల్లాలపై టీడీపీ స్పెషల్ ఫోకస్**
- **పసుపు పండుగకు తమ్ముళ్లు రెడీ**
- **విజయనగరం జిల్లా వైపు మొగ్గు**
- **కేడర్లో పెరుగుతున్న జోష్**

**ముద్ర, డెస్క్:**







తెలుగువారి ఆత్మగౌరవం కోసం పుట్టిన పార్టీ. చారిత్రక విజయం సాధించిన తర్వాత రెండోసారి నిర్వహిస్తున్న మహాసంబరం. పార్టీ ఆవిర్భావ వేడుక పసుపు పండుగను అంబరాన్నంటేలా.. యావత్ దేశం దృష్టిని ఆకర్షించేలా నిర్వహించేందుకు రెడీ అవుతోంది తెలుగుదేశం పార్టీ. గతేడాది..రాయలసీమ సెంట్రిక్‌గా కడప వేదికగా కనీవినీ ఎరుగని రీతిలో..మహానాడును నిర్వహించిన టీడీపీ..ఇప్పుడు మరో పొలిటికల్ స్కెచ్ వేస్తోందట. ఈసారి ఉత్తరాంధ్రలో పసుపు పండుగను ఓ రేంజ్‌లో జరపాలనే ప్లాన్ చేస్తున్నారట.

మహానాడు టీడీపీకి ఒక పండుగ. పార్టీలో ఉన్న క్యాడర్ మొత్తం ఎంతో ఉత్సాహంగా పాల్గొనే అతిపెద్ద సంబరం. 2024లో అధికారంలోకి వచ్చాక తొలిసారి తొలి గడప కడపలో మహానాడును గ్రాండ్ సక్సెస్ చేసింది టీడీపీ. అంతకముందు 2023లో రాజమండ్రిలో టీడీపీ మహానాడు జరిగింది. సూపర్ సిక్స్ పథకాలపై ఆనాడే ప్రస్తావించారు. దాంతో గోదావరి జిల్లాల్లో రాజకీయం గేర్ మార్చింది. అలా వైసీపీకి ఒక్క సీటు కూడా దక్కకుండా చేసి కూటమి కట్టి మరీ టీడీపీ గోదావరి తీరంలో రాజకీయాన్ని తమవైపు తిప్పుకుంది. ఇక 2024లో మహానాడు నిర్వహించ లేదు. అప్పటికి ఏపీలో ఎన్నికలు పూర్తై.. ఫలితాల కోసం వేచి చూసే పరిస్థితి. దాంతో 2025లో మహానాడును ఘనంగా నిర్వహించారు. ఈసారి మహానాడును అంతకు మించి అన్నట్లుగా నిర్వహించేందుకు రెడీ అవుతోంది టీడీపీ. గతేడాది రాయలసీమ సెంట్రిక్‌గా పార్టీ పండుగ జరిగితే..ఈసారి ఉత్తరాంధ్రలో మహానాడు పెట్టాలని ప్లాన్ చేస్తోంది.

**పెద్ద నగరాలు, ట్రాన్స్‌పోర్ట్, అన్ని ఫెసిలిటీస్ ఉన్నచోటే మహానాడు..**

ఎన్నికలు అయిపోయి రెండేళ్లు దగ్గరపడుతున్నా..దారుణమైన ఓటమితో వైసీపీ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. వైసీపీ ఓటమి షాక్‌లో ఉండగానే.. కడపలో మహానాడు నిర్వహించాచి గ్రాండ్ సక్సెస్ చేసింది టీడీపీ. ఈసారి ఉత్తరాంధ్రలో మహానాడును విజయవంతం చేసి..అక్కడా వైసీపీని కోలుకోకుండా చేయాలనేది టీడీపీ పెద్దల ఆలోచనగా చెబుతున్నారు. టీడీపీ మహానాడును పెద్ద నగరాలు, ట్రాన్స్‌పోర్ట్, అన్ని ఫెసిలిటీస్ ఉన్నచోటే నిర్వహించే వారు.

గతేడాది నుంచి పార్టీ ఆలోచన మారింది. రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లోనూ ఈ వేడుక నిర్వహించాలనే భావనతో గ్రామీణ ప్రాంతాలకు పెద్దపీట వేస్తున్నారు.

ఈసారి ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళంవిజయనగరం జిల్లాల సరిహద్దుల్లో పసుపు పండుగ నిర్వహణకు సిద్ధమైందని అంటున్నారు. విజయనగరం జిల్లా నెల్లిమర్ల, శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల నియోజకవర్గాల పరిధిలో మహానాడు ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ రెండు నియోజవకర్గాలలో మూడు స్థలాలను పరిశీలించిన టీడీపీ ముఖ్యనేతలు..త్వరలోనే తుది నిర్ణయం తీసుకోనున్నారు. దీంతో విజయనగరం టీడీపీలో హడావుడి పెరిగిపోతోంది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు విదేశాల నుంచి టీడీపీ అభిమానులు, కార్యకర్తలు మహానాడుకు తరలివచ్చే అవకాశం ఉందని అంటున్నారు.తెలుగు న్యూస్

**అందుకే ఈసారి విజయనగరం జిల్లాలో మహానాడు..**

కూటమి ప్రభుత్వం వచ్చాక ఉత్తరాంధ్ర సెంట్రిక్‌గానే ఎన్నో కార్యక్రమాలు చేపట్టింది. విశాఖకు గూగుల్ డేటా సెంటర్‌ను తీసుకొచ్చారు సీఎం చంద్రబాబు. వైజాగ్‌లో ఐబీఎం, అనకాపల్లి జిల్లాలో ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్‌తో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నారు. అటు విజయనగరం జిల్లా భోగాపురంలో నిర్మిస్తున్న అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం పూర్తి కావొస్తోంది. ఇలాంటి ఎన్నో ప్రాజెక్టులు, కంపెనీలు ఉత్తరాంధ్రకు తీసుకొచ్చిన సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్..మహానాడు వేదికగా తాము చేసిన డెవలప్‌మెంట్‌ను ప్రజలకు వివరించే ప్లాన్ చేస్తున్నారట. అందుకే ఈసారి ఉత్తరాంధ్రలోని.. విజయనగరం జిల్లాలో మహానాడును నిర్వహించేందుకు రెడీ అవుతున్నట్లు తెలుస్తోంది.

# అంబేడ్కర్ కృషితోనే రిజర్వేషన్లు

**ఎంపీ మల్లు రవి**

**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:**



రాజ్యాంగంలో అణగారిన వర్గాల ప్రజలకు అంబేడ్కర్‌రిజర్వేషన్లు కల్పించడంతో విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో ఆయా వర్గాలకు ప్రాధాన్యత కల్పించబడిందని నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి అన్నారు అంబేడ్కర్ 135 వ జయంతిని పురస్కరించుకొని మంగళవారం జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గద్వాల అంబేడ్కర్ చౌరస్తా వద్ద నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి ఎంపీ మల్లు రవి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించిన అనంతరం ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ రాజ్యాంగాన్ని సులువుగా అర్థం చేసుకోవడానికి వీలుగా భారత రాజ్యాంగం ముఖ్యాంశాలు పేరుతో తాను స్వయంగా 30 వేల పుస్తకాలను ముద్రించినట్లు చెప్పారు. రిజర్వేషన్స్ వలన ఎంతోమంది అణగారిన వర్గాల ప్రజలు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులుగా ఎదిగారన్నారు. అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల మేలుకు వివిధ సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. రాష్ట్రంలో నూతనంగా 105 ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ విద్యాలయాలను స్థాపించి, అన్ని వర్గాల విద్యార్థులు అక్కడ కలిసి చదువుకునేందుకు కృషి చేస్తుందన్నారు. డోర్నకల్ నుంచి గద్వాల వరకు రైల్వే లైన్ ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. గద్వాల రైల్వే స్థలంలో ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణానికి, జిల్లాలో ఎస్సీ, ఎస్టీ స్టడీ సర్కిల్ ఏర్పాటుకు ప్రయత్నిస్తానన్నారు. గద్వాలలో అంబేడ్కర్ కళాభవన్ నిర్మాణానికి, నూతన విగ్రహ ఏర్పాటుకు, బాబు జగ్జీవన్ రామ్ భవన నిర్మాణానికి తన ఎంపీ నిధులను కేటాయిస్తానన్నారు. సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తన ఎంపీ నిధులను కేటాయిస్తానన్నారు. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎస్పీ శ్రీనివాసరావు. డీఎస్పీ మొగిలయ్య, అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి నుషిత, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు, గద్వాల మున్సిపల్ చైర్ పర్సన్ జయలక్ష్మి, వైస్ చైర్మన్ శంకర్, జెడ్పి మాజీ చైర్పర్సన్ సరిత, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, డీసీసీ అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# షాడో నేతల చీకటి దందా..!

- **నేతల అండ తో ఇసుక మాఫియా బరితెగింపు**
- **రాత్రికి రాత్రే భారీ వాహనాలతో ఇసుక తరలింపు**
- **రూ. లక్షలు చేతులు మారుతున్న వైనం**
- **మాఫియాకు అండగా అధికారులు**
- **వాహనాల ట్రిప్పులు లెక్కపెట్టేందుకు కానిస్టేబుళ్ల కు డ్యూటీ**
- **ఒక్కో వాహనానికి రూ. 5 వేల నుంచి రూ.12 వేల మామూళ్లు**
- **సాక్ష్యాలు సమర్పించినా చర్యలు లేవు**

**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి:**





అధికారం అడ్డు పెట్టుకుని ఉమ్మడి జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో షాడో నేతల సహకారంతో ఇసుక మాఫియా చెలరేగిపోతోంది. ఇప్పటి వరకే జిల్లాలో వాగులన్నింటిలో ఇసుక తరలింపులో మాఫియా తలమునకలవుతోంది. అక్రమార్కులను అరికట్టాల్సిన పోలీసులు, రెవిన్యూ, మైనింగ్ శాఖ అధికారులు ఏమి చేస్తున్నారనే అనుమానం రాక మానదు. వారి అండదండలతో ఈ వ్యాపారం నెలకు రూ కోట్లల్లో జరుగుతోంది. అధికార పార్టీ షాడో నేతలు వీరి వెనుక ఉండి చక్రం తిప్పుతున్నారు. ఇంత జరుగుతున్నా ఎమ్మెల్యేలకు తెలియదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వీరి వెనుక అదృశ్య హస్తాలతోనే ఈ దందా కొనసాగుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇసుక తరలింపుపై పలు గ్రామాల ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు కలెక్టర్ కు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది.

నారాయణ పేట, దేవరకద్ర నియోజకవర్గాల్లో ఇసుక మాఫియా తిష్ట వేసింది. మండలాల్లో వాగులన్నీ ఖాళీ అవుతున్నా అడ్డుకునే వారే లేకుండా పోయారు. ఇసుక తరలించే రోజు ఒక్కో బెంజి వాహనానికి ఎనిమిది నుంచి రూ.12 వేల వరకు వసూళ్లు చేస్తున్నారు. వాహనాల లెక్కించేందుకు కానిస్టేబుళ్లను వాగుల వద్ద డ్యూటీ వేస్తున్నారంటే ఎంత బరితెగింపో అర్థమవుతోంది. రోజు వందల చొప్పున వాహనాలు ఇసుకను ఇతర జిల్లాలకు తరలిస్తున్నారు. ముఖ్యంగా నారాయణపేట నియోజకవర్గంలోని కోయిలకొండ పెద్దవాగు ఇసుకాసురులకు కాసులు కురిపిస్తోంది. ఈ వాగులో సూరారం, మల్లాపూర్, శేరి వెంకటాపూర్, జమాల్ పూర్, లింగాల్చేడ్ పరిసర గ్రామాల నుంచి ఇసుక తరలిస్తున్నారు. వర్షాకాలంలో ఈ వాగు నుంచి కోయిల్ సాగర్ ప్రాజెక్టు భారీగా నీరు చేరుతుంది. ప్రతి ఏడాది ఈ వాగులో భారీగా ఇసుక మేటలు ఏర్పడుతాయి. ఆ ఇసుక మేటలే అక్రమార్కులకు రూ. కోట్లు కురిపిస్తున్నాయి. ఇక్కడి పోలీసులు, రెవిన్యూ అధికారులకు నెలనెలా రూ. లక్షల్లో మాముళ్లు అందుతాయని కలెక్టర్ కు పలు గ్రామాల ప్రజల ఫిర్యాదుతో బట్టబయలు అయింది. ఇక్కడ ఒక ఎస్ ఐ, తహసీల్దార్ పోస్టుకు రేటు కూడా నిర్ణయించడం గమనార్హం. ఇక్కడ పోస్టింగ్ కోసం ఓ షాడో నేతకు రూ. ఐదు లక్షల నుంచి రూ.8 లక్షలు సమర్పించుకుంటారనే విషయాన్ని కూడా ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం. ఈ పెద్దవాగు నుంచి రాత్రి సమయంలో ఇసుక తవ్వి ఒక చోట డంప్ చేసి, మరుసటి రోజు రాత్రి ఈ డంప్ నుంచి భారీ వాహనాలతో ఇతర ప్రాంతాలకు తరలిస్తారు. ఈ వాహనాల ట్రిప్పుల లెక్కలు రాసేందుకు కోయిల కొండ పోలీస్ స్టేషన్ నుంచి ఒక కానిస్టేబుల్ డంప్ వద్ద డ్యూటీ లో ఉంటారు. ఈ కానిస్టేబుల్ పేరుతో సహా స్టేషన్ హౌస్ అధికారి, తహసీల్దార్ పై ఓ స్వచ్ఛంద సంస్థ ఎస్పీ, కలెక్టర్ కు, జిల్లా రెవిన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. వారు పట్టించుకోకపోవడంతో వీరిపై హైకోర్ట్ లో పిటిషన్ కూడా వేస్తామని పేర్కొంటున్నారు. చీకటి దందాను ఫొటోలతో సహా జిల్లా అధికారులకు సమర్పిస్తే చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారని ఈ సంస్థ ఆరోపిస్తోంది. ఎస్ఐ, తహసీల్దార్ ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. లేకుంటే హైకోర్ట్ ద్వారా చర్యలు తీసుకునే విధంగా ప్రయత్నిస్తామని అంటున్నారు. చర్యలు తీసుకోకుండా ఒక షాడో నేత అడ్డుకుంటున్నారని సమాచారం. ఇక్కడ ఇలా ఉంటే దేవరకద్ర నియోజకవర్గంలోని ఊకచెట్టు వాగులో కూడా ఇదే పరిస్థితి. ఇదే నియోజకవర్గంలోని మొల్గర వాగు కూడా ఇసుక మాఫియాకు, అధికారులకు ప్రజాప్రతినిధులకు కాసులు కురిపిస్తోంది. మిడ్జిల్ మండలంలోని డిండి వాగులో కూడా ఇదేవిధంగా ఇసుక తరలిస్తున్నారు. ఈ వాగులో భారీగా ఇసుక నిల్వలు ఉంటాయి. ఇక్కడ కూడా ఇసుకాసురులకు కాసుల పంటే పండుతోంది. వీటిపై జిల్లా కలెక్టర్ కు పదుల సంఖ్య లో ఫిర్యాదు చేసినా ఫలితం లేదని వాగు పరిసర గ్రామాల ప్రజలు అంటున్నారు. జిల్లాలో మైనింగ్ శాఖ అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. వాగుల్లో ఇసుక నిల్వలు లేకుంటే భూగర్భ జలాలు అడుగంటి రబీ పంటలు ఎండి పోయే పరిస్థితి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో భూగర్భ జలాలు ప్రమాదకర స్థాయిలో పడిపోయాయని అ శాఖ అధికారులు ప్రకటించారు. ఇసుక తరలింపుపై కలెక్టర్ స్పందించి ఇసుక మాఫియా పై ఉక్కుపాదం మోపాలని వాగు పరిసర గ్రామాల ప్రజలు, రైతులు కోరుతున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
15.04.2026 బుధవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**టాప్ ఏఐ 8.**
**Canva AI**

డిజైన్స్, పోస్టర్లు, వీడియోలు సులభంగా తయారు చేయవచ్చు.
AI ఫీచర్స్ వల్ల డిజైన్ చేయడం ఈజీ అవుతుంది.

# డిక్లరేషన్లు గుర్తొచ్చేలా బీఆర్ఎస్ సభలు

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- డిక్లరేషన్లు అమలు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ నాయకులు డిక్లరేషన్లు ప్రకటించిన ప్రాంతాల్లో సభలు నిర్వహిస్తూ వాటిని అమలు చేసేలా అధికార పార్టీపై ఒత్తిడి తీసుకువస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో జరిగిన అంబేద్కర్ జయంతి వేడుకల్లో కేటీఆర్ పాల్గొన్నారు. అంబేద్కర్ చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏప్రిల్ 20న జగిత్యాలలో జరిగే బహిరంగ సభకు కేసీఆర్ హాజరు కాబోతున్నారని ఏప్రిల్ 27న పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఈ రెండు కార్యక్రమాలు అయ్యాక మే, జూన్ నెల నుంచి కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటాలను ట్రాక్ ఎక్కించబోతున్నట్లు వెల్లడించారు. తొలుత ఎస్సీ, ఎస్టీలతోనే మొదలు పెట్టబోతున్నట్లు స్పష్టం చేశారు. కాంగ్రెస్ నాయకులు డిక్లరేషన్లు ప్రకటించి ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు.

**అంబేద్కర్ బాటలో తెలంగాణ సాధన..**

అంబేద్కర్ బాటలో తెలంగాణ సాధించామని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ అంబేద్కర్‌ను తన రాజకీయాల కోసం వాడుకుందని, రెండు సార్లు పార్లమెంట్ కు రాకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. అంబేద్కర్ కు భారతరత్న ఇవ్వలేదన్నారు. కనీసం పార్లమెంట్‌లో ఆయన ఫోటో కూడా పెట్టలేదన్నారు. 125 అడుగుల విగ్రహాన్ని సంకెళ్లతో బంధిస్తే తాము ఆరోజు వార్నింగ్ ఇస్తే ఈరోజు అంబేద్కర్ విగ్రహం దగ్గర గేట్లు తెరుచుకున్నాయన్నారు. కాంగ్రెస్ ది అరాచక, మూర్ఖపు ప్రభుత్వం అని ఎస్సీ, ఎస్టీలను కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. వెయ్యి గురుకులాల్లో మరణమృదంగం మోగుతోందన్నారు.



# వంజరి సంఘానికి తక్షణమే ఎన్నికలు నిర్వహించాలి

**ముద్ర, హైదరాబాద్ :**

పదవీకాలం ముగిసి ఏడాది గడుస్తున్న ఇంకా ఎన్నికలు జరపకుండా కోట్ల రూపాయల సంఘం నిధులు ఇష్టరీతిన వెచ్చించడంపై తెలంగాణ వంజరి సంఘం ముఖ్యుల సమావేశం ఆక్షేపణ వ్యక్తం చేసింది. మంగళవారం తార్నాకలోని తెలంగాణ వంజరి సంఘం కార్యాలయంలో తెలంగాణ వంజరి సంఘం ముఖ్యుల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు ప్రముఖులు తెలంగాణ వంజరి సంఘంలో జరుగుతున్న పరిణామాలు కులానికి సంఘానికి శ్రేయస్కరంగా లేవని, సంఘానికి నూతన బైలా ప్రకారంవెంటనే ఎన్నికలు నిర్వహించాలని, ఉప్పల్ బాగా ఎత్తులో నిర్మిస్తున్న ట్రస్ట్ ట్రస్టును సంఘానికి అనుసంధానం చేయాలని ట్రస్ట్ ను విస్తరించాలని వెంటనే ఎన్నికల కమిటీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈనెల 19 నాటికి ఈ విషయంలో స్పష్టత ఇవ్వకుంటే రాష్ట్రంలో ఉన్న కులస్తులందరినీ ఏకతాటిపైకి తెచ్చి తదుపరి కార్యాచరణను ప్రకటిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వంజరి సంఘం మాజీ అధ్యక్షులు కాలేరు విశ్వనాథం, కొండే బిక్షపతి, , భానుక ఆంజనేయులు సాల్వేరు కృష్ణ, ఎదుగని హరినాథ్ గోపాల్ రమేష్, దాత్రిక ధర్మరాజు, ముజకరి రవీందర్, లవంగు ఆంజనేయులు దాత్రిక కాశీనాథ్ నవాత్ రాజేందర్ పిట్టల అంజయ్య బిల్లంకి నరసింహారావు కాలేరు యుగంధర్ అనంతుల అనిల్ వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు



# ప్రధాని మోదీకి ట్రంప్ ఫోన్..

- 40 నిమిషాలపాటు సంభాషణ

**ముద్ర డెస్క్ :**

పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు తీవ్ర రూపం దాల్చిన వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. ప్రధాని మోదీకి ఫోన్ చేసి మాట్లాడారు. దాదాపు 40 నిమిషాల పాటు వీరు సంభాషించినట్లు సమాచారం. పశ్చిమాసియాలో పరిస్థితులు, భారత్‌అమెరికాల మధ్య ద్వైపాక్షిక సహకారం, హర్మూజ్ జలసంధిని తెరవడంపై ప్రధానంగా చర్చించినట్లు ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. అమెరికాఇరాన్‌ల మధ్య శాంతి చర్చలు విఫలమైన వేళ అగ్రనేతల సంభాషణ ప్రాధాన్యం సంతరించుకుంది. ''మిత్రుడు డొనాల్డ్ ట్రంప్ నుంచి ఫోన్ కాల్ వచ్చింది. వివిధ రంగాల్లో ద్వైపాక్షిక సహకారంలో సాధించిన గణనీయ పురోగతిని సమీక్షించాం. అన్ని రంగాల్లో సమగ్ర అంతర్జాతీయ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు కట్టుబడి ఉన్నాం. పశ్చిమాసియాలో పరిస్థితులపైనా చర్చించాం. హర్మూజ్‌ను తెరవడం, సురక్షితంగా ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది'' అని మోదీ పేర్కొన్నారు. ఈ పరిణామాలపై భారత్‌లోని అమెరికా రాయబారి సెర్గియో గోర్ స్పందించారు. ఇద్దరి నేతల మధ్య సంభాషణ సానుకూలంగా సాగిందన్నారు. పశ్చిమాసియాలో నెలకొన్న పరిణామాలను ప్రధాని మోదీకి ట్రంప్ వివరించారని తెలిపారు.

# ట్రంప్.. ఓ పైరేట్స్ కింగ్

- ఏఐ చిత్రాలతో ఇరాన్ వ్యంగ్యం
- ట్రంప్ హెచ్చరికలకు ఇరాన్ వ్యంగ్య సమాధానం...
- హర్మూజ్ ఉద్రిక్తతల మధ్య సోషల్ మీడియాలో ఏఐ యుద్ధం
- అమెరికా–ఇరాన్ మాటల తూటాలు
- సముద్రపు దొంగగా ట్రంప్
- డిజిటల్ డిప్లమసీకి కొత్త రూపం
- రాజకీయ ఉద్రిక్తతలకు సోషల్ మీడియా ట్విస్ట్...

**ముద్ర డెస్క్ :**



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అంతర్జాతీయ వేదికపై మరోసారి ఉద్రిక్తతలకు దారితీశాయి. ఇరాన్ పోర్టుల వైపు వెళ్లే, వచ్చే నౌకలను తమ నౌకాదళం అడ్డుకుంటుందని ట్రంప్ హెచ్చరికలు జారీ చేయడం పెద్ద చర్చకు దారి తీసింది. ఈ వ్యాఖ్యలను నేను తీవ్రంగా ఖండిస్తూ, 'ఇవి ఖాళీ బెదిరింపులే' అని కొట్టిపారేసింది. ఈ నేపథ్యంలో ట్రంప్ వ్యాఖ్యలకు సమాధానంగా ఇరాన్ వైఖరి ఆసక్తికరంగా మారింది. నేరుగా ప్రతిస్పందించకుండా, సోషల్ మీడియా వేదికగా వ్యంగ్యానికి దిగింది. దక్షిణాఫ్రికాలోని దక్షిణాఫ్రికాలోని ఇరాన్ రాయబార కార్యాలయం తమ అధికారిక ఖాతాల్లో ట్రంప్‌ను 'సముద్రపు దొంగ'గా చిత్రీకరిస్తూ ఏఐ ద్వారా రూపొందించిన చిత్రాలను పోస్ట్ చేసింది.

**'పర్షియన్ గల్ఫ్ పైరేట్స్' అంటూ ఎద్దేవా**

పెర్షియన్ గల్ఫ్, హార్ముజ్ జలసంధి ప్రాంతాలకు సంబంధించిన సముద్రపు దొంగలుగా ట్రంప్‌ను చూపిస్తూ రూపొందించిన చిత్రాలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఈ చిత్రాలలో ట్రంప్‌తో పాటు అమెరికా ఉపాధ్యక్షుడు జెడీ వ్యాన్స్, రక్షణ మంత్రి పీట్ హెగ్‌సేత్‌లను కూడా 'పైరేట్స్ టీమ్'గా చూపించడం ప్రత్యేక ఆకర్షణగా మారింది.

**సంగీత వీడియోతో మరో సెటైర్**

ఇరాన్ రాయబార కార్యాలయం 1980ల శైలిలో రూపొందించిన ఓ మ్యూజిక్ వీడియోను కూడా షేర్ చేసింది. ఇందులో ట్రంప్ కీబోర్డ్ వాయిస్తూ పాట పాడుతున్నట్లుగా చూపించారు. "హర్మూజ్ జలసంధిని మూసేయాలి... నన్ను అడ్డుకుంటే, నేను నిన్ను అడ్డుకుంటాను" అన్న లిరిక్స్‌తో రూపొందించిన ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

**సోషల్ మీడియాలో వైరల్**

ఈ పోస్టులు అంతర్జాతీయ స్థాయిలో చర్చకు దారితీశాయి. అనేకమంది నెటిజన్లు ఈ చిత్రాలను పంచుకుంటూ, తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. కొందరు ఇది సృజనాత్మక వ్యంగ్యమని ప్రశంసిస్తున్నారు, మరికొందరు ఇది అంతర్జాతీయ సంబంధాలను మరింత ఉద్రిక్తం చేసే ప్రయత్నమని విమర్శిస్తున్నారు.

**పెరుగుతున్న ఉద్రిక్తతలు**

ఇటీవలి కాలంలో అమెరికా-ఇరాన్ సంబంధాలు మరింత ఉద్రిక్తంగా మారుతున్నాయి. ముఖ్యంగా హర్మూజ్ జలసంధి ప్రపంచ చమురు రవాణాకు కీలక మార్గంగా, ఈ ప్రాంతంలో ఏ చిన్న ఉద్రిక్తతైనా గ్లోబల్ మార్కెట్లపై ప్రభావం చూపే అవకాశం ఉంది. మొత్తానికి, ట్రంప్ బెదిరింపులకు ఇరాన్ ఇచ్చిన ఈ 'డిజిటల్ కౌంటర్' ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. రాజకీయ వేదికలపై మాటల యుద్ధం జరుగుతుండగా, సోషల్ మీడియాలో వ్యంగ్య యుద్ధం కూడా వేడెక్కుతోంది.

# హర్మూజ్‌ను మూసేసిన అమెరికా.. ఇరాన్ వార్నింగ్..

- ఇరాన్ ఓడరేవులు దిగ్బంధం
- అన్నంత పని చేసిన ట్రంప్
- హర్మూర్ నుంచి ఆయిల్ నౌకలు రాకుండా అడ్డం
- అనుమతి లేకుండా పయనిస్తే కఠిన చర్యలు
- ట్రంప్ తీరుపై తీవ్రంగా స్పందించిన ఆరాన్

**ముద్ర డెస్క్ :**

ఇస్లామాబాద్ వేదికగా ఇరాన్, అమెరికా ప్రతినిధుల మధ్య జరిగిన శాంతి చర్చలు విఫలమయ్యాయి. న్యూక్లియర్ కార్యక్రమాన్ని నిలిపివేయడానికి ఇరాన్ అంగీకరించకపోవడంతో అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఈ విఫలతను ప్రకటించారు. వెంటనే స్పందించిన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, హర్మూజ్ జలసంధిని అమెరికా నౌకాదళంతో పూర్తిగా దిగ్బంధిస్తున్నట్లు ప్రకటించారు. ఇరాన్ ఇప్పటికే ఈ జలసంధిని మూసివేసిందని, కానీ అమెరికా తమ గైడెడ్ మిస్సైల్ డిస్ట్రాయర్లతో దీనిని అధికారికంగా బ్లాక్ చేస్తోందని ట్రంప్ వెల్లడించారు. ఈ చర్యను 'ప్రపంచానికి మేలు చేసే ప్రయత్నం'గా ఆయన అభివర్ణించారు.

**ఇరాన్ కౌంటర్ వార్నింగ్..**

అమెరికా బ్లాకేడ్ ప్రకటనకు ఇరాన్ తీవ్రంగా స్పందించింది. హర్మూజ్ జలసంధిని పూర్తి నియంత్రణలోకి తీసుకున్నట్లు ప్రకటించిన ఇరాన్, ఏ మాత్రం తప్పుడు నిర్ణయం తీసుకున్నా శత్రువులు జలసంధిలోని ప్రమాదకర సుడిగుండాలలో చిక్కుకునేలా చేస్తామని హెచ్చరించింది. ఇరాన్ బ్లాక్ చేస్తే ప్రభావం తక్కువగా ఉంటుందని, కానీ అమెరికా బ్లాక్ చేస్తే ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం ఉంటుందని ఇరాన్ అధికారులు అభిప్రాయపడ్డారు. ఈ జలసంధి గుండా ప్రపంచ చమురు సరఫరాలో 20-30 శాతం సాగుతుండటంతో, ఇది ప్రపంచ చమురు ధరలపై తీవ్ర ప్రభావం చూపనుంది.



**చైనా, రష్యా టార్గెట్‌గా ట్రంప్ వ్యూహం..**

ఇరాన్‌కు సహాయం చేసే దేశాలపై 50 శాతం టారిఫ్‌లు విధిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఇది పరోక్షంగా చైనా, రష్యాలను ఉద్దేశించినదేనని ఆయన అంగీకరించారు. రష్యా ఇరాన్‌కు సహాయం చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించింది. చైనా, భారత్‌ను కూడా ఈ బ్లాకేడ్ ప్రభావితం చేయనుంది. భారత్‌లో చమురు ధరలు పెరిగే అవకాశం ఉంది. ఆహార ధరలపై మాత్రం పెద్దగా ప్రభావం ఉండదని అంచనా. రష్యా, ఇరాన్ నుంచి చమురు దిగుమతులు కష్టతరం కావచ్చు.

**ఉగాండా–టర్కీ వివాదం..**

మరోవైపు, ఉగాండా ఆర్మీ చీఫ్ ముహూజీ కైనెరుగాబా టర్కీకి షాకింగ్ అల్టిమేటం జారీ చేశారు. తనకు ఒక బిలియన్ డాలర్లు 'భద్రతా లాభం'గా చెల్లించాలని, టర్కీలోని 'అత్యంత అందమైన మహిళను తనకు భార్యగా పంపాలి అని డిమాండ్ చేశాడు. నెరవేర్చకపోతే టర్కీ విమానాలకు ఉగాండా వాయుసీమను నిషేధిస్తామని హెచ్చరించారు. సోమాలియాలో అల్-షబాబ్ ఉగ్రవాదులతో 20 ఏళ్లుగా ఉగాండా సైన్యం పోరాడుతోంది. ఈ సమయంలో టర్కీ సోమాలియాలో మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల ద్వారా లాభపడుతోందని, ఆ లాభంలో తమకు వాటా కావాలని ముహూజీ డిమాండ్ చేస్తున్నారు. టర్కీ అధ్యక్షుడు ఎర్డోగాన్ సోమాలియాపై కన్నేశారని, ఉగాండాను పక్కన పెట్టాలని చూస్తున్నారు. టర్కీ ప్రభుత్వం ఇప్పటి వరకు అధికారికంగా స్పందించలేదు. ఈ విచిత్రమైన డిమాండ్ అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. హర్మూజ్ జలసంధి చుట్టూ అమెరికా-ఇరాన్ ఘర్షణ ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపనుంది. ట్రంప్ కఠిన వైఖరి, ఇరాన్ సుడిగుండాల వార్నింగ్, ఉగాండా విచిత్ర డిమాండ్లు ప్రపంచ రాజకీయాల్లో కొత్త ఉద్రిక్తతలకు దారితీస్తున్నాయి. పాకిస్తాన్‌తో అమెరికా స్నేహం, ఒసామా బిన్ లాడెన్ చరిత్రను మర్చిపోయి, కొత్త వ్యూహాత్మక అవసరాలకు అనుగుణంగా మారుతోంది. ప్రపంచం ఇప్పుడు హర్మూజ్ సుడిగుండాల చుట్టూ తిరుగుతోంది.

**పాకిస్తాన్‌పై ట్రంప్ ప్రశంసలు..**

ఇస్లామాబాద్ చర్చలకు మధ్యవర్తిత్వం వహించిన పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఆర్మీ చీఫ్ ఆసిఫ్ మునీర్‌లను ట్రంప్ ప్రశంసించారు. చర్చలు విజయవంతంగా జరగడానికి వారి సహకారం కీలకమని అన్నారు. పాకిస్తాన్ చైనాతో అత్యంత సన్నిహిత సంబంధాలు కలిగి ఉంది. ఒసామా బిన్ లాడెన్‌ను పాకిస్తాన్ దాచిపెట్టిందని అమెరికా ఆరోపణలు చేసింది. 2011లో అబోటాబాద్‌లో అమెరికా సైన్యం రహస్య ఆపరేషన్ నిర్వహించి బిన్ లాడెన్‌ను హతమార్చింది. అలాంటి పాకిస్తాన్‌తో అమెరికా ఇప్పుడు స్నేహపూర్వకంగా వ్యవహరించడం, ఇస్లామాబాద్‌లో శాంతి చర్చలు జరపడం అంతర్జాతీయ వర్గాల్లో ఆశ్చర్యం కలిగిస్తోంది.



# బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు

**ముద్ర, మల్కాజిగిరి :**

సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం అనే ఉన్నత విలువల పునాదులపై ఒక బలమైన, న్యాయబద్ధమైన నవ భారత నిర్మాణానికి బాబాసాహెబ్ స్పష్టమైన రూపాన్నిచ్చారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు వెల్లడించారు. సమాజంలో అట్టడుగున ఉన్న కడగొట్టు వ్యక్తికి సైతం హక్కులు, ఆత్మగౌరవం, సమాన అవకాశాలు దక్కాలనే ఉదాత్త లక్ష్యంతో ఆయన తన జీవితాన్ని అంకితం చేశారని చెప్పారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా మంగళవారం మల్కాజిగిరిలోని ఆనంద్ బాగ్‌లో ఆయన విగ్రహానికి రాంచందర్ రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ, ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆర్టీసీని కాపాడుకుందాం

- కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధం
- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



ఆర్టీసీ సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో సమ్మె నిర్ణయం సరైంది కాదని అభిప్రాయపడ్డారు. ఈ నెల 22 నుంచి సమ్మెలో దిగుతున్నట్టు ఆర్టీసీ కార్మికులు ప్రకటించిన నేపథ్యంలో మంగళవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే అంశంపై గత ప్రభుత్వం హడావిడిగా నిర్ణయం తీసుకుందని మంత్రి విమర్శించారు. ప్రస్తుతం ఈ అంశంపై ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి నేతృత్వంలోని ఉన్నత స్థాయి కమిటీ అధ్యయనం చేస్తోందని, సంస్థ ఆర్థిక స్థితిగతులను బట్టి కమిటీ నివేదిక ఇస్తుందని తెలిపారు. విలీనం, కార్మిక సంఘాల గుర్తింపు మినహా మిగిలిన అన్ని సమస్యలపై చర్చించడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని, తన తలుపులు ఎల్లప్పుడూ తెరిచే ఉంటాయని ఆయన హామీ ఇచ్చారు.

**సంస్థ బలోపేతానికి చర్యలు..**

గతంలో ఉన్న రూ.1205 కోట్ల పీఎఫ్ బకాయిలను రూ.600 కోట్లకు, రూ.690 కోట్ల సీసీఎస్ బకాయిలను రూ.300 కోట్లకు తగ్గించామని మంత్రి ప్రభాకర్ తెలిపారు. ఇప్పటికే 2978 కొత్త బస్సులను ప్రవేశపెట్టామని, 1134 మందికి కారుణ్య నియామకాలు చేపట్టామన్నారు. కొత్త ఉద్యోగ నియామకాల ప్రక్రియ కూడా చివరి దశలో ఉందన్నారు. ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆర్టీసీ ఉనికి ప్రశ్నార్థకం కాలేదని, పైగా 90కి పైగా డిపోలు ఇప్పుడు లాభాల్లో నడుస్తున్నాయని వెల్లడించారు. ఇటీవలే 2.1 శాతం డీఏ అమలు చేశామని, పీఆర్సీ అంశం కూడా పరిశీలనలో ఉందని మంత్రి వెల్లడించారు. ఆర్టీసీ సంస్థ పరిరక్షణ, ఉద్యోగుల సంక్షేమం, ప్రయాణికుల సౌలభ్యం అనే మూడు సూత్రాలతో తమ ప్రభుత్వం పని చేస్తోందని, కార్మికులు ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సమ్మె ఆలోచన విరమించుకోవాలని పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు.

టాప్ ఏఐ 9.
Notion AI
నోట్స్, టాస్క్ మేనేజ్‌మెంట్‌లో AI సహాయం.
కంటెంట్ సృష్టి, సమ్మరీలు చేయడంలో ఉపయోగపడుతుంది.
Notion AI

# ఒకడు ఉప్పెన.. ఒకడు గర్జన

## కలిసి ఎస్ఆర్.హెచ్ ప్రళయం..



- ప్రఫుల్ హింజ్ ఉత్పతాన్ని సృష్టిస్తే..
- సాకిబ్ హుస్సేన్ భయాన్ని కలిగించాడు..
- డెబ్యూ మ్యాచ్లోనే ఈ ఇద్దరు చరిత్ర సృష్టించారు..
- రాజస్థాన్ బ్యాటింగ్ లైనప్‌ను చీల్చి చెండాడిన ఎస్ఆర్‌హెచ్

**ముద్ర స్పోర్ట్స్ డెస్క్ :**

రాజస్థాన్ రాయల్స్ జట్టుతో జరిగిన మ్యాచ్లో హైదరాబాద్ అద్భుతమైన విజయం సాధించింది.. బ్యాటింగ్లో కెప్టెన్ ఇషాన్ కిషన్ అదరగొడితే.. బౌలింగ్లో ప్రఫుల్ హింజ్ దుమ్మురేపాడు. ఇతడికి సాకీబ్ హుస్సేన్ తోడు కావడంతో రాజస్థాన్ జట్టు ఏ దశలో కూడా గెలుపుకు దరిదాపుల్లో రాలేకపోయింది. ఈ సీజన్లో ఇప్పటివరకు రాజస్థాన్ వరుసగా నాలుగు విజయాల సాధించింది. చెన్నై నుంచి మొదలుపెడితే బెంగళూరు వరకు ఏ జట్టు కూడా రాజస్థాన్ రాయల్స్ ను ఓడించలేకపోయింది. బ్యాటింగ్లో బలంగా.. బౌలింగ్లో దుర్భేద్యంగా ఉన్న రాజస్థాన్ రాయల్స్ జట్టు జట్టును సన్ రైజర్స్ బౌలర్లు భయపెట్టారు.. ప్రఫుల్(34/4), సాకిబ్ హుస్సేన్ (24/4) అద్భుతమైన గణాంకాలు నమోదు చేశారు. ఆరంగేట్ర మ్యాచ్లోనే సంచలనాలు సృష్టించారు.. ప్రఫుల్ ధాటికి వైభవ్ సూర్యవంశీ(0), జురెల్(0), ప్రిటోరియస్(0), రియాన్ పరాగ్ (4) వంటి ఆటగాళ్లు త్వరగానే పెవిలియన్ చేరుకున్నారు. హుస్సేన్ బౌలింగ్లో యశస్వి జైస్వాల్ (1), పెరీరా(69), ఆర్చర్ (2), రవి బిష్ణోయ్(0) అవుట్ అయ్యారు. ప్రఫుల్ తోసమానంగా నాలుగు వికెట్లు సాధించాడు హుస్సేన్.

తద్వారా హుస్సేన్ సరికొత్త చరిత్ర సృష్టించాడు.. సాకిబ్ హుస్సేన్ బీహార్ రాష్ట్రంలోని గోపాల్‌గంజ్ ప్రాంతానికి చెందిన ఆటగాడు. ఇతడి వయసు 21 సంవత్సరాలు.. అన్ క్యాప్డ్ ఆటగాడిగా సన్ రైజర్స్ జట్టులో ఇతడు కొనసాగుతున్నాడు.. హైదరాబాద్ బౌలర్లు క్రితం మ్యాచులలో విఫలం కావడంతో హుస్సేన్ కు అవకాశం లభించింది. ఐపీఎల్ లో ఆరంగేట్రం చేసిన తొలి మ్యాచ్ లోనే 24 పదవులకు నాలుగు వికెట్లు సాధించాడు. ఐపీఎల్ చరిత్రలో ప్రారంభ మ్యాచ్లో నాలుగు లేదా అంతకంటే ఎక్కువ వికెట్లు తీసిన ఏడవ బౌలర్ గా హుస్సేన్ రికార్డు సృష్టించాడు. తొలి మ్యాచ్లో ఉత్తమ గణాంకాలు నమోదు చేసిన అశ్విని కుమార్ అనే బౌలర్ తో సమానంగా కొనసాగుతున్నాడు. ఈ జాబితాలో అల్జారి జోసెఫ్ మొదటి స్థానంలో ఉన్నాడు. 2019లో హైదరాబాద్ జట్టుతో జరిగిన మ్యాచ్లో ముంబై తరపున ఆడిన జోసెఫ్.. 12 పరుగులు ఇచ్చి ఆరు వికెట్లు తీ శా డు . 2017లో ఆర్పీఎస్ జట్టు తో జరిగిన మ్యాచ్లో

గుజరాత్ లయన్స్ తరపున ఆండ్రు టై 17 పరుగులు ఇచ్చి ఐదు వికెట్లు తీశాడు. 2008లో కోల్ కతా వేదికగా దక్కన్ చార్జర్స్ జట్టుతో జరిగిన మ్యాచ్లో కోల్ కతా బౌలర్ షోయబ్ అక్తర్

1 1 పరుగులకు 4 వికెట్లు తీశాడు. 2012లో జైపూర్ వేదికగా పంజాబ్ జట్టుతో జరిగిన మ్యాచ్లో రాజస్థాన్ రాయల్స్ బౌలర్ కూపర్ 26 పరుగులు ఇచ్చి 4 వికెట్లు పడగొట్టాడు. 2025లో కోల్ కతా నైట్ రైడర్స్ జట్టుతో జరిగిన మ్యాచ్లో ముంబై బౌలర్ అశ్విని కుమార్ 24 పరుగులు ఇచ్చి నాలుగు వికెట్లు పడగొట్టాడు.

2026లో హైదరాబాద్ వేదికగా రాజస్థాన్ రాయల్స్ జట్టుతో జరిగిన మ్యాచ్లో హైదరాబాద్ హుస్సేన్ 24 పరుగులు ఇచ్చి నాలుగు వికెట్లు పడగొట్టాడు.

2015లో బెంగళూరు వేదికగా ముంబై ఇండియన్స్ జట్టుతో జరిగిన మ్యాచ్లో రాజస్థాన్ బౌలర్ డేవిడ్ 33 పరుగులు ఇచ్చి నాలుగు వికెట్లు సాధించాడు.

2026 లో హైదరాబాద్ వేదికగా రాజస్థాన్ రాయల్స్ జట్టుతో జరిగిన మ్యాచ్లో హైదరాబాద్ బౌలర్ ప్రఫుల్ 34 పరుగులకు 4 వికెట్లు తీశాడు.

**తొలి ఐపిఎల్ మ్యాచ్లో నాలుగు వికెట్లు తీసిన భారత ప్లేయర్లు**

4/24 షాదాబ్ జాకాతి(చెన్నై సూపర్ కింగ్స్) వర్సెస్ డి సి జోహేన్నేస్ బర్గ్, 2009

4/24 అశ్వని కుమార్ (ముంబై ఇండియన్స్) వర్సెస్ కోల్ కతా నైట్ రైడర్స్, వాంఖడే స్టేడియం , 2025

4/24 సాకిబ్ హుస్సేన్ (సన్ రైజర్స్ హైదరాబాద్) , వర్సెస్ రాజస్థాన్ రాయల్స్, హైదరాబాద్, 2026

4/29 పాల్ వాల్తాటి (పంజాబ్) వర్సెస్ దక్కన్ చార్జర్స్, హైదరాబాద్, 2011

4/34 ప్రఫుల్ హింజ్( సన్ రైజర్స్ హైదరాబాద్) వర్సెస్ రాజస్థాన్ రాయల్స్, హైదరాబాద్,

2026 హుస్సేన్ ను ఐపీఎల్ 2026 వేలంలో హైదరాబాద్ జట్టు ఇతడిని 30 లక్షలకు కొనుగోలు చేసింది. 2024 సీజన్ కు ముందు ఇతడిని కోల్ కతా కొనుగోలు చేసినప్పటికీ ఆడే అవకాశం లభించలేదు. 2022 23 సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో బీహార్ తరపున t20 లలో ఎంట్రీ ఇచ్చాడు. 17 సంవత్సరాల వయసులో రెండో మ్యాచులు 20 పరుగులకు నాలుగు వికెట్లు తీశాడు. 2025 26 రంజి ట్రోఫీలో తన మొదటి 5 వికెట్లను సాధించాడు. ఐపీఎల్ 2026 సీజన్ కంటే ముందు దేశవాళీ క్రికెట్ టోర్నీలో అరుణాచల్ ప్రదేశ్ పై 41 పరుగులు ఇచ్చి ఆరు వికెట్లు పడగొట్టాడు..



## తల్లి త్యాగాలే నడిపించాయి..

**ఐపీఎల్ వేదికపై మెరిసిన సాకిబ్**

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్ :**

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 19వ సీజన్‌లో బీహార్‌కు చెందిన యువ బౌలర్ సాకిబ్ హుస్సేన్ తన ప్రతిభతో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. అయితే అతని విజయానికి వెనుక ఉన్నది తల్లి చేసిన త్యాగాలే అని చెప్పాలి. చిన్నప్పటి నుంచి దేశానికి సేవ చేయాలనే లక్ష్యంతో సైన్యంలో చేరాలని సాకిబ్ కలలు కనేవాడు. అందుకోసం తన ఇంటి సమీపంలోని ఆర్మీ గ్రౌండ్‌లో సాధన చేస్తూ ఉండేవాడు. ఆ సమయంలో అతని బౌలింగ్ ప్రతిభను గమనించిన కొందరు స్థానికులు క్రికెట్‌లో ప్రయత్నించాలని సూచించారు. దీంతో అతను టెన్నిస్ బాల్‌తో క్రికెట్ ఆడటం ప్రారంభించి క్రమంగా ఫాస్ట్ బౌలర్‌గా ఎదిగాడు. అయితే ఆర్థిక ఇబ్బందులు అతని ప్రయాణంలో పెద్ద సవాళ్లుగా నిలిచాయి. ముఖ్యంగా పెద్ద స్థాయి మ్యాచ్‌లు ఆడేందుకు అవసరమైన స్పైక్స్ బూట్లు కొనడానికి కూడా డబ్బులు లేని పరిస్థితి ఎదురైంది. బూట్లు లేకపోతే ఎలా ఆడగలనని బాధపడుతూ తల్లిని ఆశ్రయించిన సాకిబ్ కన్నీళ్లు పెట్టుకున్నాడు. కుమారుడి కలను నెరవేర్చాలనే తపనతో అతని తల్లి తన ఆభరణాలను అమ్మి బూట్లు కొనిపెట్టింది. ఆ తల్లి త్యాగమే అతని జీవితాన్ని మలిచిన కీలక ఘట్టంగా నిలిచింది. ఇప్పుడు ఐపీఎల్ వేదికపై అవకాశాలు అందిపుచ్చుకుంటూ తన ప్రతిభను నిరూపించుకుంటున్న సాకిబ్ విజయగాథలో తల్లి చేసిన త్యాగాలు చిరస్థాయిగా నిలిచాయి.

## కేకేఆర్ ప్లేయర్ పై రెండేళ్ల. నిషేధం



**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్ :**

పాకిస్థాన్ క్రికెట్ బోర్డు మరోసారి కఠిన నిర్ణయం తీసుకుంది. పాకిస్థాన్ సూపర్ లీగ్‌లో ఆడాల్సి ఉన్నప్పటికీ ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో పాల్గొనాలని నిర్ణయం తీసుకున్న జింబాబ్వే ఫాస్ట్ బౌలర్ బ్లెసింగ్ ముజరబానిపై రెండేళ్ల నిషేధం విధించినట్లు సమాచారం. పీఎస్ఎల్ 2026 సీజన్‌లో పాల్గొనేందుకు ముందుగా ఒప్పందం చేసుకున్నప్పటికీ, చివరి నిమిషంలో ఐపీఎల్‌లో అవకాశం రావడంతో ఆయన తన నిర్ణయాన్ని మార్చుకున్నాడు. మొదట ఐపీఎల్, పీఎస్ఎల్ వేలాల్లో ఏ జట్టు కూడా ముజరబానిని ఎంపిక చేయలేదు. అనంతరం పీఎస్ఎల్ 2026 సీజన్ కోసం ఇస్లామాబాద్ యునైటెడ్ జట్టు అతనిని రీప్లేస్‌మెంట్ ఆటగాడిగా తీసుకుంది. అయితే ఐపీఎల్ ప్రారంభానికి ముందు కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టు ముస్తఫిజుర్ రెహ్మాన్ గైర్హాజరుతో ప్రత్యామ్నాయ ఆటగాడి కోసం ముజరబానిని సంప్రదించింది. ఈ నేపథ్యంలో ముజరబాని పీఎస్ఎల్‌ను వదిలి ఐపీఎల్‌లో కేకేఆర్ తరపున ఆడేందుకు అంగీకరించాడు. ఈ పరిణామంపై అసంతృప్తి వ్యక్తం చేసిన పాకిస్థాన్ క్రికెట్ బోర్డు, అతనిపై రెండేళ్ల పాటు పీఎస్ఎల్‌లో ఆడకుండా నిషేధం విధించినట్లు తెలుస్తోంది. ఇదే తరహాలో గత ఐపీఎల్ సీజన్ సమయంలో దక్షిణాఫ్రికా ఆటగాడు కార్బిన్ బోష్ కూడా పీఎస్ఎల్‌ను మధ్యలో వదిలి ఐపీఎల్‌లో చేరడంతో అతనిపై ఒక సంవత్సరం నిషేధం విధించిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా పీఎస్ఎల్ 2026 సీజన్‌కు ముందు మరో ఇద్దరు విదేశీ ఆటగాళ్లు స్పెన్సర్ జాన్సన్, దసున్ షనాకా కూడా చివరి నిమిషంలో ఐపీఎల్ జట్లలో చేరారు. వీరిపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక నిర్ణయం ప్రకటించకపోయినా, భవిష్యత్తులో చర్యలు తీసుకునే అవకాశం ఉందని సమాచారం.

## ఈ ఓటమి మాకో గుణపాఠం: రియాన్ పరాగ్

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

ఐపీఎల్ 2026లో ఏప్రిల్ 13న జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ చేతిలో ఎదురైన ఓటమి తమ జట్టుకు గుణపాఠంగా మారుతుందని రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్ తెలిపారు. మ్యాచ్ అనంతరం మాట్లాడుతూ ఓటమిపై ఎక్కువగా ఆలోచించడానికి సమయం లేదని, తదుపరి మ్యాచ్‌లో మెరుగైన ప్రదర్శన చేయడానికి సిద్ధమవుతున్నామని చెప్పారు. 217 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన రాజస్థాన్ జట్టు ఆరంభంలోనే తడబడిందన్నారు. 9 పరుగులకే 5 వికెట్లు కోల్పోవడం మ్యాచ్ ఫలితాన్ని ప్రభావితం చేసిందని పేర్కొన్నారు. అయినప్పటికీ తరువాతి బ్యాటర్లు పోరాడి జట్టును 160 పరుగుల దాకా తీసుకెళ్లడం జట్టులో లోతు ఉన్నదనే విషయం చూపిస్తుందని వివరించారు. సన్‌రైజర్స్ బౌలర్లు అద్భుతంగా బౌలింగ్ చేశారని, ముఖ్యంగా ప్రఫుల్ హింగే, సాకిబ్ హుస్సేన్ బౌలింగ్ ప్రభావం చూపిందని తెలిపారు. పిచ్ ప్రారంభంలో కొంత నెమ్మదిగా ఉండటంతో కొత్త బంతి ఎక్కువగా సహకరించిందని చెప్పారు. తమ జట్టు కొన్ని నిర్ణయాల్లో తేడాలు జరిగాయని అంగీకరించారు. ఇది కేవలం ఒక ఎదురుదెబ్బ మాత్రమేనని, తదుపరి



మ్యాచ్ కోసం కోల్‌కతాకు వెళ్లి మరింత మెరుగైన ప్రదర్శన చేస్తామని రియాన్ పరాగ్ తెలిపారు.



## ధోనీ వారసుడు ఫెయిల్

**ముద్ర స్పోర్ట్స్ డెస్క్ :**

చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు అద్భుతమైన చరిత్ర ఉంది. అభిమానులపరంగా.. సాధించిన ట్రోఫీల పరంగా చెన్నై జట్టు ఐపీఎల్లో తిరుగులేని స్థానంలో కొనసాగుతోంది. కొంతకాలంగా సరిగ్గా ఆడలేకపోతున్నప్పటికీ.. చెన్నై జట్టు విలువ ఏమాత్రం తగ్గలేదు. చెన్నై జట్టుకు ఈ స్థాయిలో క్రెడిబిలిటీని తీసుకొచ్చింది ముమ్మాటికి మహేంద్ర సింగ్ ధోని. ఇందులో ఏమాత్రం అనుమానం లేదు. ఎందుకంటే ముంబై ఏకఛత్రాధిపత్యం కొనసాగిస్తున్న క్రమంలో.. చెన్నై జట్టుకు తిరుగులేని స్టామినాను అందించాడు ధోని. వయోభారం.. ఇతర సమస్యల వల్ల ధోని రెండు సంవత్సరాల క్రితం సారధ్య బాధ్యతల నుంచి తప్పుకున్నాడు. ఆటగాడిగా మాత్రం కొనసాగుతున్నాడు. ఈ క్రమంలో గైక్వాడ్ కు చెన్నై మేనేజ్మెంట్ సారద్య బాధ్యతలు అప్పగించింది. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ.. సారధిగా అతడు విఫలమవుతున్నాడు. ధోని లెగసీని కంటిన్యూ చేయాల్సిన అతడు అట్టర్ ఫ్లాఫ్ అవుతున్నాడు. గత సీజన్లో సరిగా ఆడ లేకపోయినా అతడు.. గాయం వల్ల మధ్యలోనే టోర్నీ నుంచి వెళ్లిపోయాడు. ఇప్పుడు సారధిగా విఫలమవుతున్నాడు. ఆటగాడిగా కూడా చేతులెత్తేస్తున్నాడు. ఓపెనర్ గా వస్తున్న గైక్వాడ్.. ఆస్థానానికి సార్థకం కలిగించే విధంగా ఇన్నింగ్స్ ఆడలేక పోతున్నాడు. కోల్ కతా నైట్ రైడర్స్ జట్టు తో జరుగుతున్న ప్రస్తుత మ్యాచ్లో గైక్వాడ్ మరోసారి ఫ్లాఫ్ అయ్యాడు. కేవలం ఏడు పరుగులకే అవుట్ అయ్యాడు. ఇప్పటివరకు అయితే ఇన్నింగ్స్ లలో వరుసగా 6(11), 28(22), 7(3), 15(18),7(6) పరుగులు చేశాడు. 105 స్ట్రైక్ రేట్ తో కేవలం 63 పరుగులు చేశాడు. దీంతో అతడి ఆట తీరు పట్ల తీవ్ర స్థాయిలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గైక్వాడ్ విశ్రాంతి తీసుకుని.. వేరే ఆటగాడికి అవకాశం ఇవ్వాలని క్రికెట్ విశ్లేషకులు చెన్నై సూపర్ కింగ్స్ మేనేజ్మెంట్ కు సూచిస్తున్నారు.. ఇలా ఆడితే చెన్నై జట్టు ట్రోఫీ కాదు కదా.. కనీసం ప్లే ఆఫ్ దాకా కూడా వెళ్లలేదని చెబుతున్నారు. చెన్నై సూపర్ కింగ్స్ మేనేజ్మెంట్ గైక్వాడ్ మీద విపరీతమైన ఆశలు పెట్టుకుంది. ఈ సీజన్లో అయినా గొప్పగా ఆడతాడని భావించింది. కానీ అతడు మరోసారి విఫల ప్రదర్శన చేస్తున్నాడు. ఇలానే ఆడుతుంటే.. వచ్చే రోజుల్లో అతని పరిస్థితి రిజర్వ్ బెంచ్ లేదా.. జట్టు నుంచి వెళ్లిపోవడమో.. వంటివి చోటు చేసుకుంటాయని క్రికెట్ విశ్లేషకులు అంటున్నారు. మ్యాచ్ ప్రారంభం నుంచి గైక్వాడ్ ఇబ్బంది పడుతూనే ఉన్నాడు. ఏమాత్రం సమర్థవంతంగా బ్యాటింగ్ చేయలేకపోతున్నాడు. కనీసం బంతులను డిపెండ్ కూడా చేసుకోలేకపోతున్నాడు. ఇతర ప్లేయర్లు

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
15.04.2026 బుధవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews






కొంటె చూపులతో కవ్విస్తున్న

# శృతి చౌహాన్

ముద్ర, సినిమా డెస్క్:

మోడల్, నటి శృతి చౌహాన్ తాజా ఫోటోషూట్‌తో మరోసారి నెటిజన్ల దృష్టిని తనవైపు తిప్పుకుంది. అందం, స్టైల్ కలిసిన ఈ చిత్రాలు చూడగానే రొమాంటిక్ భావాలను రేకెత్తించేలా ఉన్నాయి. జేడ్ స్టే ఇండియా అందమైన సహజ వాతావరణం ఈ ఫోటోలకు మరింత ప్రత్యేక ఆకర్షణను తీసుకొచ్చింది. పీచ్ రంగు ఫ్లోరల్ దుస్తుల్లో శృతి ఎంతో గ్రేస్‌ఫుల్‌గా కనిపించింది. డ్రెస్‌లోని రఫిల్స్, మెరూన్ బోస్ కలిసి ఆమె లుక్‌ను మరింత హైలైట్ చేశాయి. ఎర్ర గులాబీల బొకేతో సూర్యరశ్మిలో పోజులు ఇచ్చిన ఆమె, సహజంగా వదిలిన వేవీ హెయిర్‌తో మరింత అందాన్ని చాటుకుంది. ఆమె చర్మంపై పడిన సాఫ్ట్ లైట్ మొత్తం ఫోటోషూట్‌కు మృదువైన రొమాంటిక్ టచ్‌ను అందించింది. ఈ ఫోటోషూట్‌లో శృతి వ్యక్తీకరించిన భావాలు ప్రత్యేకంగా ఆకర్షిస్తున్నాయి. సొగసుతో పాటు సున్నితమైన అమాయకత్వాన్ని మిళితం చేస్తూ ఆమె ఇచ్చిన ఎక్స్‌ప్రెషన్స్ అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ప్రతి ఫ్రేమ్‌లోనూ ఆమె చూపులు, హావభావాలు స్పష్టంగా మెరిసిపోతున్నాయి.






# డెకాయిట్ చిత్రంపై స్పందించిన రామ్ చరణ్

ముద్ర, సినిమా డెస్క్ :

అడివి శేష్, మృణాల్ ఠాకూర్ ప్రధాన పాత్రల్లో రూపొందిన రొమాంటిక్, యాక్షన్ చిత్రం 'డెకాయిట్' ఇటీవల థియేటర్లలో విడుదలై మంచి స్పందన అందుకుంటోంది. ఈ సినిమాను చూసిన అగ్ర హీరో రామ్‌చరణ్ సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో తన అభిప్రాయాన్ని వెల్లడించారు.

'డెకాయిట్' చిత్రాన్ని చూసి చాలా ఎంజాయ్ చేశానని రామ్‌చరణ్ పేర్కొన్నారు. హరి పాత్రలో అడివి శేష్ గుర్తుండిపోయేలా నటించారని తెలిపారు. మృణాల్ ఠాకూర్ తన పాత్రలో భావోద్వేగాలను లోతుగా ప్రదర్శిస్తూ పాత్రకు పూర్తి న్యాయం చేశారని వివరించారు. అనురాగ్ కశ్యప్‌తో పాటు ఇతర నటీనటులు తమ పాత్రలకు తగ్గట్టుగా అద్భుతంగా నటించారని చెప్పారు. అలాగే నిర్మాత సుప్రియ యార్లగడ్డ ఈ చిత్రాన్ని ఉన్నత సాంకేతిక ప్రమాణాలతో నిర్మించారని ప్రశంసిస్తూ, చిత్రబృందానికి అభినందనలు తెలిపారు.ఇక రామ్‌చరణ్ ప్రస్తుతం బుచ్చిబాబు దర్శకత్వంలో రూపొందుతున్న 'పెద్ది' చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమాలో జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తున్నారు. ఈ చిత్రం ఏప్రిల్ 30న విడుదల కానున్నట్టు సమాచారం.



# పాలరాతి శిల్పంలా మెరిసిన జాన్వీ కపూర్

ముద్ర, సినిమా డెస్క్:

బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ తాజా ఫోటోషూట్‌లో తన అందంతో మరోసారి అందరినీ ఆకట్టుకుంది. సింపుల్ అయినప్పటికీ క్లాసీ లుక్‌లో ఆమె కనిపించిన తీరు చూస్తే నిజంగానే పాలరాతి శిల్పంలా మెరిసిపోతుంది. వైట్ కలర్ అవుట్‌ఫిట్‌లో జాన్వీ ఎంతో ఎలిగెంట్‌గా కనిపించింది. బ్యాక్ ఓపెన్ డిజైన్‌తో ఉన్న ఈ డ్రెస్సు ఆమె గ్లామర్‌ను సున్నితంగా హైలైట్ చేసింది. సాఫ్ట్ ఫ్యాబ్రిక్‌తో రూపొందించిన లూజ్ స్లీవ్స్ ఆమె లుక్‌కు ఒక ఫ్లోయింగ్ ఎఫెక్ట్‌ను తీసుకొచ్చాయి. లైట్ మేకప్, నేచురల్ హెయిర్ స్టైల్ ఆమె అందాన్ని మరింత నిగారింపజేశాయి. కెమెరా వైపు వెనక్కి తిరిగి చూసే పోజ్‌లో జాన్వీ ఇచ్చిన ఎక్స్‌ప్రెషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆమె చూపుల్లో కనిపించిన కాన్ఫిడెన్స్, సౌమ్యత కలిసి ఈ ఫోటోను మరింత ప్రత్యేకంగా మార్చాయి. సింపుల్ బ్యాక్‌గ్రౌండ్‌లో తీసిన ఈ చిత్రం మొత్తం ఫోకస్‌ను ఆమెపైనే నిలిపింది. ఈ ఫోటోషూట్‌లో జాన్వీ మరోసారి తన స్టైల్, గ్లామర్‌ను సున్నితంగా ప్రెజెంట్ చేస్తూ, ట్రెండింగ్‌లో నిలిచింది.

# నిర్మాతల కోసం మనసు మార్చుకున్న విజయ్

ముద్ర, సినిమా డెస్క్ :



విజయ్ నటించిన 'జన నాయగన్' చిత్రం విడుదల విషయంలో ఇంకా స్పష్టత రాకపోవడంతో అనేక ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ సినిమా విడుదల తేదీ పదేపదే వాయిదా పడుతుండగా, ఇటీవల సోషల్ మీడియాలో మూవీ లీక్ కావడం చిత్రబృందానికి మరో పెద్ద సమస్యగా మారింది. హెచ్. వినోద్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్ నిర్మించింది. ఇదే బ్యానర్‌తో విజయ్ మరో సినిమాకు సిద్ధంగా ఉన్నారన్న వార్త ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతోంది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు పూర్తయ్యాక ఈ ప్రాజెక్ట్‌పై నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఈ విషయంపై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. మరోవైపు 'జన నాయగన్' చిత్రం జనవరిలో విడుదల కావాల్సి ఉన్నప్పటికీ సెన్సార్ సర్టిఫికెట్ ఇంకా లభించకపోవడంతో రిలీజ్‌పై సందిగ్ధత కొనసాగుతోంది. ఇదిలా ఉండగా, సినిమా లీక్ వ్యవహారం చిత్రబృందాన్ని కలవరపెడుతోంది. కోయంబత్తూరులోని ఒక లోకల్ ఛానల్‌లో మొత్తం సినిమాను ప్రసారం చేసిన ఘటనతో మూవీ యూనిట్ దిగ్భ్రాంతికి గురైంది. ఈ లీక్ ఘటనపై కేసు నమోదు చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు ఇప్పటికే ఆరుగురిని అరెస్ట్ చేశారు. తాజాగా ఆ లోకల్ ఛానల్ యజమానిని కూడా కస్టడీలోకి తీసుకున్నట్లు సమాచారం.

# టాక్సిక్' వాయిదాపై మేకర్స్ క్లారిటీ!

ముద్ర, సినిమా డెస్క్ :

యశ్ హీరోగా గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'టాక్సిక్' చిత్రం గత కొన్ని రోజులుగా వాయిదా వార్తలతో చర్చల్లో నిలిచింది. ఈ సినిమా విడుదల మళ్లీ వాయిదా పడుతుందనే ప్రచారం జోరుగా సాగుతున్న నేపథ్యంలో చిత్రబృందం వాటిని ఖండించింది. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే జూన్ 4న ఈ సినిమాను విడుదల చేస్తామని టీమ్ స్పష్టం చేసింది. అంతర్జాతీయ స్థాయిలో ఈ చిత్రాన్ని ప్రచారం చేయడానికి కూడా సిద్ధమవుతున్నట్లు వెల్లడించింది. నిర్మాత నమిత్ మల్హోత్రాతో కలిసి యశ్ ఇప్పటికే ప్రమోషన్ కార్యక్రమాలను ప్రారంభించినట్లు సమాచారం. ప్రస్తుతం అమెరికాలో జరుగుతున్న సినిమాకాన్ కార్యక్రమానికి ఆయన హాజరుకానున్నారు. ఈ వేదికపై 'టాక్సిక్'తో పాటు 'రామాయణ' చిత్రం గురించి కూడా మాట్లాడనున్నట్లు తెలిసింది. ఈ చిత్రంలో పలువురు కథానాయికలు కీలక పాత్రలు పోషిస్తున్నారు. నదియా పాత్రలో కియారా కనిపించనుండగా, ఎలిజిబెత్‌గా హ్యూమా ఖురేషీ నటిస్తున్నారు. గంగ పాత్రలో నయనతార, రెబెకా పాత్రలో తారా సుతారియా కనిపించనున్నారు.మెలిసా పాత్రలో రుక్మిణి వసంత్ నటిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకునేలా సిద్ధమవుతున్నారు.





# ఎన్టీఆర్ 'డ్రాగన్'లో ఆలియా?

ముద్ర, సినిమా డెస్క్ :




ఎన్టీఆర్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందుతున్న భారీ చిత్రం 'డ్రాగన్'పై అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ప్రతి చిన్న సమాచారం సోషల్ మీడియాలో వేగంగా వైరల్‌గా మారుతోంది. తాజాగా ఈ సినిమాలో బాలీవుడ్ హీరోయిన్ ఆలియా భట్ నటించే అవకాశమున్నట్లు ప్రచారం జరుగుతోంది. 'ఆర్ఆర్ఆర్' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన ఆలియా భట్ మరోసారి టాలీవుడ్‌లో కనిపించనున్నట్లు టాక్ వినిపిస్తోంది. ప్రశాంత్ నీల్-ఎన్టీఆర్ కాంబినేషన్‌లో రూపొందుతున్న ఈ చిత్రంలో కీలక పాత్ర కోసం ఆమెతో చిత్రబృందం సంప్రదింపులు జరిపినట్లు సమాచారం. ఈ ప్రాజెక్ట్‌కు ఆమె సానుకూలంగా స్పందించినట్లు కూడా ప్రచారం జరుగుతోంది. అయితే ఈ విషయంపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఇక ఈ సినిమాలో ప్రతినాయకుడి పాత్ర విషయంలో కూడా మార్పులు చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. తొలుత ఈ పాత్రకు మలయాళ నటుడు టొవినో థామస్‌ను ఎంపిక చేసినప్పటికీ, డేట్స్ సమస్యల కారణంగా ఆయన ఈ అవకాశాన్ని వదులుకున్నట్లు సమాచారం. ప్రస్తుతం అదే పాత్ర కోసం బాలీవుడ్ నటుడు షాహిద్ కపూర్ పేరు పరిశీలనలో ఉన్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి.

# మలయాళ నటి సజినిపై దాడి..

## ప్రాణహాని ఉందంటూ పోలీసులకు ఫిర్యాదు

ముద్ర, సినిమా డెస్క్ :



ప్రముఖ మలయాళ నటి సజినిపై హైదరాబాద్‌లో దాడి జరిగిన ఘటన కలకలం రేపింది. ఈ ఘటనపై ఆమె జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఆస్తి వివాదం నేపథ్యంలో కొందరు తనపై దాడికి పాల్పడ్డారని ఆమె ఆరోపించారు. తనకు తీవ్ర ప్రాణహాని ఉందని, ఎప్పుడైనా ప్రాణాలకు ముప్పు ఏర్పడే అవకాశం ఉందని ఫిర్యాదులో ఆందోళన వ్యక్తం చేశారు. తనకు రక్షణ కల్పించాలని పోలీసులను కోరినట్లు తెలిసింది. సజిని ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు సమాచారం. సజిని ఆంధ్ర ప్రదేశ్‌కు చెందిన నటి. తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో పలు చిత్రాల్లో నటించి గుర్తింపు పొందారు. ముఖ్యంగా 2000వ దశకం ప్రారంభంలో నటి షకీలాతో కలిసి పలు బీ గ్రేడ్, గ్లామరస్ చిత్రాల్లో నటిస్తూ ప్రేక్షకులకు పరిచయమయ్యారు. ప్రస్తుతం ఆస్తి వివాదం కారణంగా జరిగిన ఈ దాడి ఘటన సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ దాడికి బాధ్యులు ఎవరు, వివాదం ఎవరితో కొనసాగుతోంది అనే విషయాలు ఇంకా వెల్లడికావాల్సి ఉంది.

ఫెస్టివ్ మూడ్‌లో మెరిసిన

# ఐశ్వర్య మేనన్

ముద్ర, సినిమా డెస్క్:

నటి ఐశ్వర్య మేనన్ తాజా ఫోటోషూట్‌తో మరోసారి అభిమానుల మనసు దోచుకుంది. సంప్రదాయపు అందం, ఆధునిక శైలి కలిసిన ఈ లుక్‌లో ఆమె ఎంతో ఆకర్షణీయంగా మెరిసింది. పండుగ వాతావరణాన్ని ప్రతిబింబించేలా రూపొందించిన ఈ ఫోటోలు చూసినవారికి ప్రశాంతమైన అనుభూతిని కలిగిస్తున్నాయి. ఎథ్నిక్ దుస్తుల్లో ఐశ్వర్య ఎంతో సొగసుగా కనిపించింది. సహజ కాంతి, ఎర్త్ టోన్స్‌తో కూడిన ఈ సెటప్ ఆమె అందాన్ని మరింత మెరుగుపరిచింది. సింపుల్ బ్యాక్‌డ్రాప్ మధ్యలో పుస్తకాన్ని పట్టుకుని చిరునవ్వుతో కనిపించిన ఆమె, శాంతి, సానుకూలత, కొత్త ఆరంభాల భావాన్ని చక్కగా వ్యక్తపరిచింది.

ఈ ఫోటోషూట్‌లో ఆమె చూపించిన హావభావాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సాదాసీదా లుక్‌లోనే క్లాస్‌ను చూపిస్తూ, సహజమైన అందంతో ఐశ్వర్య ప్రేక్షకులను ఆకట్టుకుంది. ప్రతి ఫ్రేమ్‌లోనూ ఆమె ఎక్స్‌ప్రెషన్స్, సౌమ్యమైన ప్రెజెన్స్ స్పష్టంగా కనిపిస్తున్నాయి



Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013. Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com